అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 28-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 159 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



మీటర్లపై హీటెక్కిన అసెంబ్లీ

విద్యుత్ ఒప్పందాలపై రాష్ట్ర శాసనసభ హీటెక్కింది. అధికార, ప్రధాన ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వంపై పలుమార్లు విమర్శలు చేయగా, ప్రతిగా ముఖ్యమంత్రి రేవంత్... నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాతున్నారంటూ ఆయనపై విరుచుకుపడ్డారు. ఒకరోజు విరామానంతరం శాసనసభ బడ్జెట్ సమావేశాలు శనివారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్... బడ్జెట్‌పై చర్చను చేపట్టారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు హాజరుకాకపోవటంతో ఆయనకు బదులు హరీశ్‌రావు చర్చను ప్రారంభించారు.

డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగిస్తామని మీరు చెప్పలేదా..?

ఆ మేరకు 2017 జనవరిలో కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారుగా...?

ఈ అగ్రిమెంట్‌పై కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదు...?

శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంపై విరుచుకుపడిన సీఎం రేవంత్

ఒప్పందంపై అజయ్‌మిశ్రా, రఘుమారెడ్డి, గోపాల్‌రావు సంతకాలు చేశారంటూ వెల్లడి



గొర్రెల పంపిణీ, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్లపై విచారణకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్‌కు సవాల్

హరీశ్ నోరుతెరిస్తే అబద్ధాలేనంటూ ఎద్దేవా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ ప్రభుత్వ హయాంలో కేంద్రం మెడమీద కత్తి పెట్టినా విద్యుత్ ఒప్పందాలు, సంస్కరణలను తాము ఒప్పుకోలేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చెప్పారు. వాటిని అమలు చేస్తే రూ.30 వేల కోట్ల మేర అప్పులు తీసుకోవచ్చంటూ కేంద్రం సూచించినా ముఖ్యమంత్రి హోదాలో తమ నాయకుడు కేసీఆర్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారని గుర్తు చేశారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో నిలబడి కొట్లాడినట్టు హరీశ్ మాట్లాతున్నారనీ, తద్వారా సభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని సీఎం



విమర్శించారు. గతంలోని తప్పులను కప్పి పుచ్చుకోవటానికి సభలో బుకాయించటం సరికాదని హితవు పలికిన ముఖ్యమంత్రి...మీటర్ల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను సభ ముందు ఉంచారు. విద్యుత్ ఒప్పందాల్లో భాగంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగిస్తామంటూ 04.01.2017న కేంద్రంతో నాటి తెలంగాణ ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుందని వెల్లడించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యుత్ సంస్థలకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆనాటి ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా, ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కంల ఉన్నతాధికారులు రఘుమారెడ్డి, గోపాలరావులు సంతకాలు చేశారని వివరించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఆర్నెల్లలోగా మీటర్లను బిగిస్తామంటూ ఆ సందర్భంగా కేసీఆర్ సర్కారు కేంద్రంతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. మొత్తం 28 పేజీల ఈ అగ్రిమెంట్‌పై 500 యూనిట్లు వాడే గృహాలకు 31 డిసెంబరు 2018 నాటికి, 200 యూనిట్లు వాడే గృహాలకు 31 డిసెంబరు 2019 నాటికి మీటర్లు పెడతామంటూ సంతకాలు చేశారని సీఎం వివరించారు. ఆయా ఒప్పందాలను చదువుకుని రావాలంటూ హరీశ్‌కు సూచించారు. సంబంధిత ప్రతులను ఆయనకు పంపించారు.

గత ప్రభుత్వం గురించి హరీశ్ పదే పదే గొప్పలు చెబుతున్నారనీ, కానీ కేసీఆర్ హయాంలోని గొర్రెల పంపిణీ, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్ పథకాల్లో భారీ అవినీతి చోటు చేసుకున్నట్టు రిపోర్టులు చెబుతున్నాయని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆ మూడు పథకాలపై విచారణకు సిద్ధమా..? అని ...11లో

ఆ పేపర్లు చూసి చెప్తా..

పాలన సరిగా లేకనే

మమ్మల్ని ఇక్కడ కూర్చోబెట్టారు

మీరు కూడా అలాగే చేస్తారా?

మీ ఆరు గ్యారంటీల అమలు ఏది ?

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా 10లో..

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుడు

హరీశ్‌రావు

ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

జేవీ మోడల్‌లో మెట్రోను నిర్మిస్తాం

పాత దోస్తును ఎమ్ఐఎమ్ పదేండ్లు

నమ్మినా మోసమే చేసిండు 11లో..

మేము నాలుగేండ్లలోనే పూర్తి చేస్తాం :

అసెంబ్లీలో సీఎం రేవంత్

యువశక్తితో ఇండియా

ప్రపంచానికి ఆకర్షణగా దేశ మానవ వనరులు

యువతను నైపుణ్యాలు కలిగిన వారిగా మార్చాలి

ఈ దశాబ్దంలో అనేక మార్పులు

నిటి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ

ఎన్డీఏ ముఖ్యమంత్రులు నితీష్ కుమార్, రంగస్వామి డుమ్మా

ఎనిమిది మంది ప్రతిపక్ష పార్టీల సీఎంలు గైర్హాజరు

మమత బెనర్జీ వాకౌట్

భవిష్యత్‌లోనూ ఈ సమావేశానికి రానని ప్రకటన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా యువశక్తితో నిండిన దేశమని, దేశ మానవ వనరులు యావత్ ప్రపంచానికి ఆకర్షణగా నిలిచాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. విక్షిత్ భారత్ 2024 విజన్‌ని ముందుకు తీసుకెళ్లేందుకు నిటి ఆయోగ్ తొమ్మిదో పాలక మండలి సమావేశం శనివారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్ లోని కల్చరల్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగింది. విక్షిత్ భారత్ 2047లో విజన్ డాక్యుమెంట్ కోసం అప్రోచ్ పేపర్‌పై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశ యువతను నైపుణ్యాలు కలిగిన మానవ వనరులుగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. నైపుణ్యాలు, పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలు, ఉద్యోగాలకు అవసరమైన పరిజ్ఞానం ఇప్పుడు చాలా అవసరమన్నారు. అన్ని రాష్ట్రాల సమిష్టి కృషితో వికసిత్ భారత్ - 2047 సాధించగలమని అన్నారు. 'మన కలలను మనం నెరవేర్చుకోగలం. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు అభివృద్ధి చెందిన దేశాన్ని తయారు చేస్తాయి. ఈ దశాబ్దం అనేక మార్పులను చూస్తుంది. సాంకేతికంగా, జియో-పొలిటికల్, అవకాశాల పరంగా ఈ మార్పులుంటాయి' అని చెప్పారు. దేశం ఈ మార్పులను అవకాశాలుగా మలచుకోవాలని, అందుకు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఇదే తొలి మెట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనేది ప్రతి భారతీయుడి ఆశయమని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను రూపొందించేందుకు సరైన దిశలోనే పయనిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు, ప్రజలతో నేరుగా అనుసంధానమై ఉన్నందున, ఈ లక్ష్యాన్ని సాధించడంలో క్రియాశీల పాత్ర పోషిస్తాయని వివరించారు. నిటి ఆయోగ్ పాలక మండలి 9వ భేటీలో మోడీ ప్రసంగించారు. వందేండ్లలో ఒకసారి వచ్చే మహమ్మారిని ఓడించామని గుర్తు చేశారు. మన ప్రజలు ఉత్సాహం, విశ్వాసంతో ఉన్నారన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులకు అనుకూలంగా మన విధానాలు కూడా, మార్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఎన్డీఏ ముఖ్యమంత్రులు నితీష్ కుమార్, రంగస్వామి డుమ్మా

ఈ సమావేశానికి కేంద్రంలో అధికార ఎన్డీఏ కూటమికి చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, పుదిచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి డుమ్మాకొట్టారు. అయితే పుదిచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వల్ల హాజరు కాలేదని చెబుతున్నారు. అయితే ...11లో

మోడల్ స్కూళ్లలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



11లో..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరదొస్తే మురుగు

గోదావరి పరివాహక ప్రాంతాల్లో బురద మేటలు

స్లూయిజ్‌లు పటిష్టంగా లేక భద్రాద్రిలోకి వ్యర్థ జలం

ప్రణాళికా లేమే కారణం

నదీ పరివాహకంలో అనేక చోట్ల పారిశుధ్య సమస్యలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ముఖ్యంగా భద్రాచలం వంటి చోట వరద కన్నా మురుగు నీటి సమస్యే ఎక్కువగా ఉంటోంది. పట్టణం నుంచి వెలువడే మురుగునీరు స్లూయిజ్‌ల ద్వారా గోదావరిలో కలుస్తోంది. ఏటా వరదలు రావడంతో రామాలయ పరిసర ప్రాంతాలు, విస్తా కాంప్లెక్స్, శిల్పానగర్, అశోక్‌నగర్ కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీ, అయ్యప్ప కాలనీ, చప్టా దిగువ ప్రాంతాలు ముంపునకు గురవుతుంటాయి. వర్షం నీటికి భద్రాచలం నుంచి వెలువడే వ్యర్థ జలాలూ తోడవడంతో స్లూయిజ్‌ల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోయడం



కష్టమవుతోంది. మురుగు నీటి నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ లేకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

తీరని స్లూయిజ్‌ల లీకేజీ సమస్య

భద్రాచలం పట్టణ వ్యాప్తంగా ఏడు స్లూయిజ్‌లు ఉన్నాయి. మరో రెండు ఏటపాక మండలంలో ఉన్నా వాటి నిర్వహణ బాధ్యతను కూడా భద్రాచలం నీటిపారుదల శాఖ అధికారులే చూస్తున్నారు. వరదలు వచ్చే ప్రతిసారీ స్లూయిజ్‌లు పటిష్టం చేస్తున్నామని, నీరు లీకవ్వకుండా మోటార్లు, ఇసుక బస్తాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పడం పరిపాటిగా మారింది. కానీ పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి మార్పూ రావడం లేదు. పోలవరం ఎత్తు పెంచినప్పటి ...3లో



సీపీఐ(ఎం) నేతలపై అక్రమ కేసులెత్తేయండి

సీఎం రేవంత్‌కు పార్టీ నేతల విజ్ఞప్తి

కేసుల వివరాలు అందజేత

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రజాఉద్యమాలు, పోరాటాల సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, పేదలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. శనివారం అసెంబ్లీలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కేసుల వివరాలతో కూడిన జాబితాను సైతం సమర్పించింది. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసిన పేదలపై బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసులు, ఆర్టీసీ సమ్మె సందర్భంగా కార్మికులపై ...11లో

హు..ఉద్యోగ విస్ఫోటనమట!

వాస్తవాలకు దూరంగా ఆర్‌బీఐ లెక్కలు



న్యూఢిల్లీ : ఇటీవలి సంవత్సరాలలో వాస్తవ వినియోగ వ్యయం కేవలం 3.5-4 శాతం మాత్రమే పెరిగింది. కుటుంబ పొదుపు రేటు 12 సంవత్సరాల కనిష్ట స్థాయికి... అంటే జీడీపీలో 18.4 శాతానికి పడిపోయింది. ఇక ఉద్యోగ కల్పన విస్ఫోటనం గురించి నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అసలు ఆర్‌బీఐ సమాచారం అతిగా, అసాధారణంగా కన్పిస్తోంది.

2017-18 నుండి ఉద్యోగ కల్పన అద్భుతంగా జరిగిందని ఆర్‌బీఐ చెప్పింది. 2012-13, 2017-18 మధ్యకాలంలో వాస్తవ స్థూల విలువ ఆధారిత వృద్ధి 7 శాతం నుండి 4.2 శాతానికి క్షీణించింది. పైగా ఆర్‌బీఐ చూపుతున్న గణాంకాలు 2011 జనాభా లెక్కల ఆధారంగా తయారు చేసినవి. వాటికి ఏనాడో కాలం చెల్లిపోయింది. కాబట్టి వాటి ఆధారంగా రూపొందించిన అంచనాలు వాస్తవ దూరంగా ఉంటాయి. 2023-24లో 64.3 కోట్ల మంది ఉపాధి పొందారని ఆర్‌బీఐ తెలిపింది. దీనిని బట్టి చూస్తే కార్మికుడు-జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) 46.2 శాతం ఉండాలి. అయితే ఇది 2017-18లో 36.1 శాతంగా ఉంది. వాస్తవానికి 2004-05లో 42 శాతం ఉన్న డబ్ల్యూపీఆర్ ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం ఇప్పుడు బాగా పెరిగింది. 2011-12 నుండి ప్రయివేటు పెట్టుబడులు తగ్గుతూ ఉన్నందున ఉపాధి కల్పన కూడా 20017-18 వరకూ నిలకడగా తగ్గుతూ వచ్చింది. డబ్ల్యూపీఆర్ పెరుగుదలకు కారణాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. డిజిటలైజేషన్, ఆటోమేషన్ పెరుగుతున్న నేపథ్యంలో డబ్ల్యూపీఆర్‌లో ఆకస్మిక పెరుగుదల కన్పిస్తోంది. 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగింది. 2017లో జీఎస్టీ ప్రభావం కన్పించింది. 2018లో ఎన్‌బీఎఫ్‌సీ సంక్షోభం తలెత్తింది. 2019లో అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం సంభవించింది. 2020-21లో కోవిడ్ కారణంగా ...3లో



మహిళల్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి

3లో వివరాలు



బొగ్గు బ్లాక్‌ల వేలం ఆపాలి

సింగరేణి ప్రయివేటీకరణపై సమరం

సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్రకు మద్దతు 12లో..

సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు

రాజకీయాలు, వ్యక్తి స్వేచ్ఛలో మతప్రమేయమొద్దు

ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి ప్రమాదం 11లో..

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నంలో మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహా 4వ వర్ధంతి సభ



ఏజెన్సీపై గోదారమ్మ ఉగ్రరూపం

- భద్రాచలం వద్ద తుది హెచ్చరిక జారీ
- పునరావాస కేంద్రాలకు ముంపు వాసుల తరలింపు
- మూడు వైపులా నిలిచిన రాకపోకలు
- బాధితులకు అండగా సీపీఐ(ఎం) నాయకత్వం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఏజెన్సీపై గోదారమ్మ కన్నెర్ర చేసి ఉగ్రరూపాన్ని చూపిస్తోంది. 20 రోజుల నుంచి వరద ప్రవాహం పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడుతున్న గోదావరి శనివారం సాయంత్రం నుంచి శరవేగంగా పెరిగి భద్రాచలం పట్టణాన్ని మూడు వైపులా చుట్టుముట్టింది. ఎగువ ప్రాంతంలోని మేడిగడ్డ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు రావడంతోపాటు ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి భారీ స్థాయిలో వస్తున్న వరదకు తోడు తాలిపేరు, కిన్నెరసాని, జంపన వాగుల ఉధృతి తోడైంది. గోదావరి 54 అడుగులు దాటి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి 54 అడుగులు దాటి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం మూడో ప్రమాద హెచ్చరికను జల వనరుల శాఖ అధికారులు జారీ చేశారు. ముంపు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో కరకట్ట ప్రాంత వాసులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు.

ఏజెన్సీకి నిలిచిన రాకపోకలు

భద్రాచలం ఏజెన్సీకి మూడు వైపులా వరద నీరు చుట్టేసింది. దీంతో భద్రాచలానికి రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం నుంచి కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలకు వెళ్లే జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు వెళ్లే జాతీయ రహదారి సైతం తూరుబాక, కన్నాయిగూడెం వద్ద రాకపోకలు నిలిపివేశారు. మరోవైపు భద్రాచలం నుంచి బూర్గంపాడు మీదుగా ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు వెళ్లే రహదారి బూర్గంపాడు, రెడ్డిపాలెం రాకపోకలు స్తంభించాయి. భద్రాచలం నుంచి బయటికి వెళ్లాలంటే లక్ష్మీపురం రహదారి మాత్రమే మిగులున్న పరిస్థితి నెలకొంది.

పునరావాస కేంద్రాలకు తరలింపు

భద్రాచలం పట్టణంలోని ఏటపాక, కొత్త కాలనీల వద్ద ఉన్నటువంటి స్లూయిజ్‌ల లీకేజీతో భారీగా వరద నీరు కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలను ముంచెత్తింది. దాంతో సుమారు 125 కుటుంబాలను హుటాహుటిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టణంలోని నన్నపనేని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. శనివారం తెల్లవారు జామున స్లూయిజ్‌ల వద్ద నుంచి భారీగా వరద నీరు కాలనీలలోకి ప్రవేశించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. స్థానిక సీపీఐ(ఎం) నాయకత్వం వెంటనే అధికారులను ముంపు కాలనీలకు రప్పించింది. అకస్మాత్తుగా వచ్చిన వరదతో పూర్తిస్థాయిలో సామాన్లు కూడా సర్దుకోలేని పరిస్థితిలో సీపీఐ(ఎం) నాయకులు బాధితులకు అండగా నిలిచి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించారు. మరో మూడ్రోజుల పాటు తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో భద్రాచలం మరింత ముంపునకు గురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కరకట్ట బలహీనతపై పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్లూయిజ్‌ల వద్ద ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన మోటార్లు కూడా పూర్తిస్థాయిలో పని చేయకపోవడంతో గోదావరి వరదకు వర్షపు నీరు కూడా తోడవడంతో పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ, చప్టదిగువ అయ్యప్ప కాలనీ తీవ్రంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లిని హత్య చేసి.. ఆపై ఆత్మహత్య!

- మానసికస్థితి సరిగాలేని యువకుడు



నవతెలంగాణ-కొత్తగూడెం

మానసిక పరిస్థితి సరిగాలేని యువకుడు తల్లిని హత్య చేసి.. ఆ తర్వాత తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో సంచలనం రేపింది. కొత్తగూడెం మున్సిపాల్టీ పరిధి, బూడిదగడ్డ, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగింది. పాసి వినయ్‌కుమార్(28) కొంతకాలం పాల్వంచలోని బేకరీలో పనిచేశాడు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తల్లి తుల్జా కుమారి(55)తో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. వీరి పోషణ తుల్జాకుమారి మరిది గుల్లపల్లి రవిశంకర్ (మాజీ కౌన్సిలర్) చూస్తున్నాడు. తుల్జా కుమారి రోజులాగే శుక్రవారం రాత్రి రవిశంకర్ ఇంట్లో భోజనం చేసి, కొడుకు వినయ్‌కి భోజనం తీసుకువెళ్లింది. తుల్జా కుమారి ఇంటి పక్కనే కూతురు, అల్లుడు నాగేందర్ నివాసం ఉంటారు. శనివారం ఉదయం 9 అయినప్పటికీ తుల్జా కుమారి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆమె మనవరాలు సునన్య ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. దీంతో ఆమె వెంటనే కుటుంబీకులకు చెప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘట నాస్థలానికి చేరుకొని పరిశీలించారు. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు. క్లూస్ టీం పరిశీలించి, వివరాలు సేకరించారు. మానసిక పరిస్థితి సరిగా లేక కొడుకే తల్లిని చంపి.. ఆ తర్వాత అతను ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చార్జింగ్ సౌకర్యంతో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్

- తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఈవీ చార్జింగ్ హబ్ ప్రారంభం
- 102 పాయింట్లతో అతిపెద్ద గ్లిడా ఈవీ చార్జింగ్ హబ్

నవతెలంగాణ-శంషాబాద్

ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ సౌకర్యం కల్పిస్తే భవిష్యత్తు అంతా వాటిదేనని రాష్ట్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం రహదారి తుక్కుగూడ వద్ద గ్రిడా (ఆల్ లైట్స్ గ్రీన్) సంస్థ ఆధ్వర్యంలో దేశంలోనే అతి పెద్దదైన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో ప్రధానంగా తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగిందన్నారు. పర్యావరణం, శబ్ద కాలుష్యం నియంత్రణ, తక్కువ ధరలో ఎక్కువ దూరం ప్రయాణం చేయడం అనే కాంక్షతో ఎలక్ట్రిక్ వాహనాలు కొనే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. అయితే, పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా చార్జింగ్ సౌకర్యం లేకపోవడంతో కొందరు కొనుగోలు చేయ డానికి ముందుకు రావడం లేదని తెలిపారు. ఇలాంటి సమస్యను తీర్చడం కోసం గ్లిడా సంస్థ ఎయిర్‌పోర్టు సమీపంలో ఒకే చోట 102 చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సదు పాయం ఎంతో మందికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశానికి ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలక్ట్రిక్ వాహనాలు పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులకు ఏర్పడుతున్న సమస్యలను ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో పరిష్కరించుకోవచ్చన్నారు. గ్లిడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆవదేశ్ కె.ఝా మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం తమ సంస్థ మొదటి ఆవిష్కరణ వేదికగా ఉందన్నారు. ఇప్పటివరకు 88 చోట్ల ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇది దేశంలోనే అతిపెద్ద 89వ అవుట్ లెట్ అని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనదారులకు చార్జింగ్, ఇతర సదుపాయాలు అందించడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

చేనేత పరిశ్రమకు గడ్డు పరిస్థితి..!

- రంగు వెలుస్తున్న రాట్నం బతుకులు
- ఆధునిక పరిజ్ఞానం పెరిగిన వైనం
- వర్షాకాలంలో రోజుకు రూ.50 కంటే తక్కువే..
- 50 ఏండ్లు పనిచేసినా.. ఇండ్లు లేవు
- అప్పుల్లో చేనేత కార్మికులు.. ఇతర పనుల్లోకి పలువురి వలసబాట



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

చేనేత.. ప్రసిద్ధి చెందిన కుటీర పరిశ్రమ. దీని కారణంగా దేశానికి పేరు, డబ్బు తెచ్చిపెట్టింది. వందల ఏండ్ల కిందటి నుంచి విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిన ఘనత చేనేతది. మానవాళికి వస్త్రాన్ని అందించడమే కాదు.. అగ్గిపెట్టెలో పట్టే ఆరడుగుల చీరను నేసి ప్రపంచాన్ని అబ్బురపరిచిన చరిత్ర చేనేతకుంది. అంతటి అందమైన బట్టలు నేసే కార్మికులు నేడు ఉపాధి లేక.. పొట్టకూటి కోసం అనేక పాట్లు పడాల్సి వస్తోంది. మువ్వన్నెల జెండా నేసిన చేనేతకు నేడు చేయూత కరువైంది. ఆధునిక యంత్రాలతో పోటీ పడలేక బతుకీడుస్తున్నారు. చేనేతకు ఆదరణ లేకపోవడం, ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక దీనిపైనే ఆధారపడిన ఎంతో మందికి పని లేకుండా పోయింది. రోజుకు ఒక్కొక్కరికి రూ.50 కూలి కూడా రావడం లేదు. దీంతో వృత్తిని వదిలి చేనేత కార్మికులు కుటుంబాల పోషణ కోసం ఇతర పనులకు వెళ్తున్నారు. వందల ఏండ్ల కిందటి నుంచి చేనేత రంగాన్ని కాపాడుతూ వస్తున్న కార్మికులు తమ కుటుంబాలను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. గిట్టుబాటుకాని చేనేత రంగాన్ని వదిలి పొట్ట చేత పట్టుకొని సోలాపూర్, వాండి, ముంబయి, సూరత్ అహ్మదాబాద్ వంటి నగరాలకు వలస పోతున్నారు. నిత్యం మగ్గాల సవ్వడితో మారుమోగే నేతన్నల కాలనీలలో నేడు నిశ్శబ్దం అలుముకుంది. కొంత మంది అప్పులు చేసి మరమగ్గాలు తెప్పించుకున్నా.. ముడిసరుకు అందుబాటులో లేదు. ఉన్నా కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేదు. రాష్ట్రంలో 25,930 మంది చేనేత కార్మికులు ఉన్నారు. 21,922 మంది అనుబంధ కార్మికులున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 38 వేల మంది ఈ రంగంలో పనిచేస్తున్నారని తెలుస్తోంది. అనధికారికంగా ఇంకా ఎక్కువగానే ఉంటారు. 47852 చేనేత మగ్గాలున్నాయి. భూదాన్‌పోచంపల్లితో పాటు చౌటుప్పల్, కొయ్యలగూడెం, సంస్థాన్ నారాయణపురం, పుట్టపాక, సిరిపురం, కమలాపూర్, మహదేవపూర్, గద్వాల, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో ఎన్నో వేల కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ఉదాహరణకు: జోగులాంబ గద్వాల జిల్లాలోనే 2525 మగ్గాలు ఉండగా.. 2525 మంది కార్మికులు, 4487 మంది అనుబంధ రంగాల్లో పని చేస్తున్నారు. వనపర్తి జిల్లాలో 324 మగ్గాలు, 324 మంది కార్మికులు, 697 మంది అనుబంధంగా పనిచేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 622 మగ్గాలు, 622 మంది కార్మికులు, 1250 మంది చేనేత అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 311 మగ్గాలు, 311 మంది కార్మికులు, 630 మంది అనుబంధ కార్మికులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 11 మగ్గాలు 11 మంది కార్మికులు, ఆరుగురు అనుబంధంగా పని చేస్తున్నారు. నారాయణపేటలో 250 చేనేత మగ్గాలు, 250 కార్మికులు ఉండగా మరో 750 మంది అనుబంధ చేనేత కార్మికులుగా పనిచేస్తున్నారు. మరో 100 మర మగ్గాలు ఉన్నాయి. 800 మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. రోజుకు 10 గంటలు పనిచేస్తే.. ఒక చీర తయారవుతుంది. చీరకు రూ.290 ఇస్తారు. నెలకు రూ.8500 వేతనం వస్తోంది. వర్షాకాలంలో ఒక చీర తయారు కావడానికి నాలుగు రోజుల సమయం పడుతుంది. రోజుకు రూ.50 కూడా కూలి పడటం లేదు. తేమ అధికంగా ఉండి కండె ముందుకు జరగక పోవడంతో గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 'నవతెలంగాణ' బృందం సందర్శించి వారిని పలకరించగా.. తమ ఆవేదన వ్యక్తం చేశారు.

చేనేత రంగంపై దృష్టి కరువు

చేనేత రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదు. కనీసం రోజుకు రూ.500 కూలి దక్కేలా ఉపాధి కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. పరిశ్రమను ఆధునీకరించాల్సి ఉంది. ఇప్పుడు ఇస్తున్న జీయో ట్యాగ్ ప్రకారం ఒక మగ్గానికి ముగ్గురు కాకుండా 10 మందిని గ్రూపుగా చేర్చాలి. జీఎస్‌టీ రద్దు చేసి చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యవస్థ కల్పించాలి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగాలి. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రుణ సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నారాయణపేట పట్టణానికి చెందిన బాలరాజు భార్య మోనేశ్వరి 25 ఏండ్లుగా చేనేత రంగం మీద ఆధార పడి జీవనం సాగిస్తోంది. రోజూ మగ్గం నేయడం ద్వారా కీళ్ల నొప్పులతో అనారోగ్యాల బారిన పడిన ఆమె చేతిలో చిల్లి గవ్వ లేక అప్పులు చేసి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటోంది. మరో మహిళ అసీనాబేగం 26 ఏండ్లుగా నేత పని చేస్తోంది. ఈమెకు ఇప్పుడు 60 ఏండ్లు కావస్తున్నా.. పింఛను రావడం లేదు. అద్దె ఇంట్లో ఉంటోంది.. వచ్చే కూలి డబ్బులు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆమె వాపోతుంది. సుజాత అనే మహిళ 20 ఏండ్ల నుంచి ఇక్కడే పని చేస్తోంది. ఈమెకు ఇద్దరు పిల్లలు. అద్దె ఇంట్లో.. ఇరుకు గదుల్లో ఉంటున్నారు. ఇలా చాలా మంది కుటుంబాలు గడవక.. పిల్లలను ఇతర పనులకు పంపిస్తున్నారు.కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో చేనేత మగ్గాలు 100 వరకు ఉండేవి. ఇక్కడ 300 మంది కార్మికులు పనిచేసేవారు. గిట్టుబాటు కాకపోవడం వల్ల చాలా మంది ఇప్పుడు నిర్మాణ రంగంతోపాటు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటున్నారు. మగ్గాలు మూత పడి భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని పునరుద్ధరిస్తే.. వందలాది మందికి ఉపాధి లభించడమే గాక ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఉపాధి అవకాశాలు కల్పించాలి

నిర్మలమ్మ, చేనేత కార్మికురాలు, నారాయణపేట

వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పథకాలు అమలు చేయాలి.

అప్పుల్లో ఉన్నాం.. ఆదుకోవాలి

సుజాత, చేనేత కార్మికురాలు, నారాయణపేట

25 ఏండ్లుగా నేను నేత పని చేస్తున్నా. నాకు ఇద్దరు పిల్లలు. రోజుకు రూ. 50 అయినా రావడం లేదు. కుటుంబం సగం పస్తులుండాల్సి వస్తోంది. ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఆస్తులూ ఏమీ లేవు. ప్రభుత్వం సహాయం చేస్తే... సొంతంగా మగ్గం పెట్టుకొని పని చేసుకుంటాం.

రుణాలు మంజూరు చేయాలి

బండమీది బాల్‌రాం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, నారాయణపేట

ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలి. మగ్గాలకు రుణాలు అందజేయాలి. సేట్లు వృత్తిలోకి వస్తున్నారు. నిజమైన వారికే రుణాలు ఇవ్వాలి. సహకార సంఘాలకు గిట్టుబాటు ధర పడటం లేదు. కార్మికులకు పీఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలి.

చేయూత అందివ్వాలి

అంబు, చేనేత కార్మిక నాయకులు

చేనేత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందివ్వాలి. ముఖ్యంగా కూలి రోజుకు రూ.500 వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ముడిసరుకును సబ్సిడీకి అందజేయాలి. నైపుణ్యం కోసం ప్రతి చేనేత కార్మికునికీ శిక్షణ ఇవ్వాలి. చేనేత ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

ట్రావెల్స్ బస్సులో నాలుగు కిలోల బంగారం చోరీ

రంగంలోకి దిగిన పోలీసులు

- రూ. 3 కోట్ల విలువైన ఆభరణాలున్నట్టు బాధితుడి ఫిర్యాదు
- సీసీ కెమెరాల్లో రికార్డైన చోరీ దృశ్యాలు
- మిగిలిన వారి బ్యాగులు ముట్టుకోకపోవడంతో అనుమానం
- ఇన్సూరెన్స్ కోసమేనా..?



నవతెలంగాణ-జహీరాబాద్

దాబా వద్ద నిలిపి ఉన్న ట్రావెల్స్ బస్సులో దొంగలు పడి నాలుగు కిలోల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్‌లోని కోహినూర్ దాబా వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలను జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ముంబయికి వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు కోహినూర్ దాబా వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆగింది. ఈ క్రమంలో నగల వ్యాపారి గుమాస్తా ఆశిష్ బస్సు దిగి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఆలోపు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నగలతో కూడిన ఆశిష్ బ్యాగును ఎత్తుకెళ్లారు. బస్సు ఎక్కాక బ్యాగు కనిపించక పోవడంతో బాధితుడు వెంట 100కి డయల్ చేసి రూ.మూడు కోట్ల విలువ గల నాలుగు కిలోల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదు చేశాడు. దాంతో పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బంగారం చోరీపై గుమాస్తా సహా ఆభరణాల వ్యాపారులు చిరాగ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం దాబాను సందర్శించి పరిశీలించారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదుదారు చెప్పిన విషయాలు అస్పష్టంగా ఉండటంతో, దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.గుజరాత్‌కు చెందిన వికాస్ ముంబయిలో బంగారం వ్యాపారం చేస్తూ స్థిరపడిపోయాడు. తన మేనత్త కుమారుడైన ఆశిష్‌ను గుమాస్తాగా పెట్టుకున్నాడు. వారు బంగారు నగలను హైదరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ లాంటి ప్రాంతాల్లో వ్యాపారులకు సరఫరా చేస్తారు. ఈ క్రమంలో ఈనెల 24న ఆశిష్ ముంబయి నుంచి నాలుగున్నర కిలోల బంగారు ఆభరణాలను తీసుకొని హైదరాబాద్‌లోని పలువురు వ్యాపారులకు అందించారు. మిగిలిన బంగారు నగలతో శుక్రవారం హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లడానికి ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. ఈ క్రమంలోనే దారి మధ్యలో బంగారం చోరీకి గురైంది. కాగా ఆశిష్‌తోపాటు బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉండగా.. వారిలో ఏ ఒక్కరి బ్యాగునూ దుండగులు ఎత్తుకెళ్లలేదు. కేవలం ఆశిష్ వద్ద ఉన్న నగల బ్యాగు మాత్రమే తీసుకెళ్లడం చూస్తుంటే.. ఇది పక్కాగా ప్రణాళిక ప్రకారం జరిగినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పైగా సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా.. నగల బ్యాగును ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్తున్నప్పుడు ఆశిష్ బస్సు డోర్ వద్దనే ఉన్నాడు. అతను ఆందోళన చేయడంగానీ, అరవడంగానీ చేయలేదు. దాంతో ఇన్సూరెన్స్‌ను క్లయిమ్ చేసుకునేందుకే పథకం ప్రకారం ఈ నాటకం ఆడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. 2002లో కూడా ఇదే మాదిరిగా జహీరాబాద్‌లోని ఒక దాబా వద్ద బస్సులో నుంచి నగల వ్యాపారి నగలు చోరీకి గురవ్వగా.. కేసు నమోదు చేశాక కేసును విత్ డ్రా చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. అయితే, దొంగలను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని డీఎస్పీ తెలిపారు.

నందిమేడారం నుంచి ఎత్తిపోతలు షురూ!

- శనివారం సాయంత్రానికి గాయత్రి పంప్‌హౌజ్‌కు చేరిన నీళ్లు
- అక్కడి నుంచి మధ్యమానేరు డ్యామ్‌లోకి ఎత్తిపోస్తున్న పంప్‌లు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కాళేశ్వరం నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్న క్రమంలో ప్రస్తుతం అక్కడ ఎత్తిపోతలు ప్రారంభించలేదు. అయితే, దానిపైన కీలకంగా ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కడెం, క్యాచ్‌మెంట్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ఎత్తిపోసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. శనివారం ఉదయమే ఎల్లంపల్లి నుంచి నందిమేడారానికి నీటిని తరలించి అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌజ్‌కు సుమారు 10వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. శనివారం సాయంత్రం 6గంటలకు చేరుకున్న నీటిని గాయత్రి పంప్‌హౌజ్ పంప్‌లు ఆన్‌చేసి మధ్యమానేరులోకి వదులుతున్నారు.

పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పరివాహక వాగులు, చెరువుల నుంచి వచ్చే వరద సహా నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు నుంచి కలుపుకుని రెండ్రోజులుగా 12,931క్యూసెక్కుల వరద వస్తోంది. అయితే, ప్రస్తుతం కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోయింది. శనివారం ఉదయం వరకు 4,195క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా మధ్యాహ్నానికి కడెం గేట్లు బంద్ చేశారు. అయినప్పటికీ ఈ నెల 18న 20.175టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ డ్యామ్‌లో 5.1409టీఎంసీల నీరు మాత్రమే ఉండగా.. ఈ తొమ్మిది రోజుల్లోనే కడెం, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నీరు రావడంతో ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో 17.3969టీఎంసీల నిలువకు చేరుకుంది. దీంతో సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు శనివారం మధ్యాహ్నం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నందిమేడారం పంప్‌హౌజ్‌కు నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు చేపట్టారు. నందిమేడారంలోని 4, 6 పంపులను ప్రారంభించిన అధికారులు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తొలుత 9,450 క్యూసెక్కుల నీటిని వదిలారు. సాయంత్రం నాటికి అది 12,931క్యూసెక్కులకు చేరింది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోసిన నీటిని వరద కాలువ ద్వారా మధ్యమానేరు ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. మిడ్‌మానేరు డ్యామ్ నిండిన తరువాత దిగువ ఉన్న ఎల్ఎండీ, ఆ తరువాత మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజయర్వాయర్‌కు.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు నీటిని తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం మహారాష్ట్రలోనూ వర్షాలు భారీగా కురుస్తున్నందున ఎస్ఆర్ఎస్‌పీలోకి కూడా వరద వచ్చే అవకాశం ఉంది. ఈలోపు క్యాచ్‌మెంట్ ద్వారా వచ్చే నీటిని వీలైనంతగా ఎల్లంపల్లి నుంచి మొదలుకుని మధ్యమానేరు, దిగువమానేరు, అంతగిరి, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ వరకూ తరలించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. తరువాత మహారాష్ట్ర నుంచి వచ్చే వరదను ఎస్ఆర్ఎస్‌పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నింపుకుని సమృద్ధిగా వాడుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

రాష్ట్రానికి అక్షింతలు తప్ప ఏమిచ్చారు ?


- కేంద్రానికి మంత్రి సీతక్క ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి అక్షింతలు తప్ప ఏమిచ్చిందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. 60 ఏండ్లు నిండిన రైతులకు పెన్షన్లు ఇస్తామంటూ బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన హామీలకు కేంద్ర బడ్జెట్‌లో కనీస నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ చేసిన విమర్శలను తిప్పి ఆమె కొట్టారు.

రైతులను కార్పొరేట్లకు అప్పగించేందుకు నల్ల చట్టాలు తెచ్చింద న్నారు. పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకరావాలని రైతులు ఆందోళన చేసినా కేంద్ర పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ 300 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.

ఉన్నత విద్యా రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్



కీలక అంచనాలు అందుకోవటంలో విఫలం

పేలవ కేటాయింపులు అనేక సమస్యలకు దారి తీస్తాయి

మేధావులు, నిపుణులు, విశ్లేషకుల ఆందోళన

న్యూఢిల్లీ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉన్నత విద్యా రంగాన్ని నిరాశకు గురి చేసింది. ఈ రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరపటంలో విఫలమవుతున్నది. దీంతో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విద్యావేత్తలు, నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కేంద్ర బడ్జెట్ 2024-25 ఉన్నత విద్యా రంగాన్ని విస్మరించటంపై విమర్శలు వస్తున్నాయి. గణనీయమైన నిధులు, సంస్కరణల వాగ్దానాలు ఉన్నప్పటికీ అనేక కీలక అంచనాలను అందుకోవటంలో బడ్జెట్ విఫలమైందని మేధావులు అంటున్నారు.

స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో విద్యపై ప్రభుత్వ వ్యయం చాలా తక్కువగా ఉన్నది. ఆర్థిక సర్వే 2023-24 కేవలం 2.7 శాతం కేటాయింపును హైలైట్ చేసింది. ఇది జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)- 2020 సిఫారసు ఆరు శాతం కంటే గణనీయంగా తక్కువగా ఉన్నది. "ఈ తక్కువ వ్యయం విద్య నాణ్యతను నేరుగా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వ సంస్థలు తీవ్రమైన వనరుల పరిమితులను ఎదుర్కొంటున్నాయి. ఈ లోటుపాట్లు, ఈ లోపాల ఫలితంగా ఏర్పడే సమస్యలను, ఎలా మెరుగుపరచాలనే దానిపై సూచనలను చర్చిస్తుంది" అని విద్యావేత్తలు, నిపుణులు చెప్పారు.

యూనియన్ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు నిధులను స్వల్పంగా పెంచారు. అయితే ఈ రంగానికి పెరుగుతున్న డిమాండ్ల దృష్ట్యా ఈ పెరుగుదల సరిపోదని విశ్లేషకులు చెప్తున్నారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ప్రకారం.. మొత్తం వ్యయం 6.1 శాతం మాత్రమే పెరుగుతుందని అంచనా వేయబడింది. రాబడి వ్యయం కేవలం 3.2 శాతం పెరుగుతుందని అంచనా. ఈ పరిమిత పెరుగుదల ద్రవ్యోల్బణం, విద్యాపరమైన అవస్థాపన, అధ్యాపకుల జీతాలు, పరిశోధనా నిధులకు సంబంధించి పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఉండటంలో విఫలమైందని నిపుణులు చెప్తున్నారు.

ఉన్నత విద్యలో పరిశోధన, అభివద్ధి(ఆర్ అండ్ డీ) క్లిష్టమైన ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, బడ్జెట్ ఈ రంగంలో గణనీయమైన పురోగతిని సాధించలేదని అంటున్నారు. మెరుగైన విద్యా ప్రమాణాలు, పెరిగిన పరిశోధన నిధుల అవసరాన్ని ప్రతిబింబిస్తూ ప్రపంచవ్యాప్తంగా టాప్ 200లో కేవలం మూడు భారతీయ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయి. గణనీయమైన పెట్టుబడి లేకుండా, భారతీయ సంస్థలు అంతర్జాతీయంగా పోటీపడటానికి కష్టపడవచ్చని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "విద్య అనేది పరిశ్రమ అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించటానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా బడ్జెట్ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఉపాధిని పెంపొందించడానికి 'బలమైన' వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల కోసం మేము సిఫారసులను చూసినప్పటికీ.. ఇక్కడ నిబంధనలు తక్కువగా ఉన్నాయి. స్కిల్ ఇండియా మిషన్ 1.4 కోట్ల మంది వ్యక్తులకు శిక్షణనిచ్చినప్పటికీ.. విద్యా ఫలితాలను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మార్చడానికి మరింత మద్దతు అవసరం" అని నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అట్టడుగున ఉన్న, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యకున్న సవాళ్లను కేంద్ర బడ్జెట్ తగినంతగా పరిష్కరించలేదని నిపుణులు, మేధావులు అంటున్నారు. "స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లు, ఆర్థిక సహాయ కార్యక్రమాలు గణనీయమైన మెరుగుదలను చూడలేదు. వెనుకబడిన నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులకు అవకాశాలను పరిమితం చేసింది. దీనికి బడ్జెట్ తగినంతగా సహకారాన్ని అందించలేదు. సరిపోని నిధులు, ఆర్ అండ్ డీ పట్ల నిర్లక్ష్యం, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి లేకపోవటం, ఈక్విటీ సమస్యలు, అర్థవంతమైన పరిపాలనా సంస్కరణలు లేకపోవటం వంటివి విద్యా రంగం సామర్థ్యాన్ని బలహీన పరుస్తాయి. భారత ఉన్నత విద్యా సంస్థలు అభివృద్ధి చెందటానికి, దేశం సామాజిక-ఆర్థిక పురోగతికి గణనీయంగా తోడ్పడటానికి ఈ లోపాలను పరిష్కరించటం అత్యవసరం" అని చెప్తున్నారు.

ప్రయివేటీకరణకు తలుపులు తెరవటం

దేశంలోని విస్తృత విద్యా అవసరాలను తీర్చేందుకు విద్యపై పెట్టుబడి పెంపు అవసరమని మేధావులు అంటున్నారు. "ప్రస్తుత బడ్జెట్ కేటాయింపు ఈ అవసరాలను తీర్చడంలో విఫలమైంది. దీంతో ఈ రంగంలో సంభావ్య వృద్ధి, ఆవిష్కరణలను అడ్డుకుంటుంది. మెరుగైన నిధులు మరిన్ని పరిశోధనా కేంద్రాల స్థాపనకు, డిజిటల్ అవస్థాపనను మెరుగుపరచటానికి, అట్టడుగు వర్గాలకు అవసరమైన సహాయాన్ని అందించటానికి, నాణ్యమైన విద్యకు తోడ్పాటునందిస్తుంది.

అయితే, ఈ రంగంలో బడ్జెట్ అసమర్థతలను జాబితా చేయటం ద్వారా, ప్రయివేటీకరణ కోసం పరిపక్వమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది. దీంతో, విద్య వంటి కీలకమైన రంగాలపై ప్రభుత్వం తక్కువ ఖర్చు చేయటం వల్ల ప్రయివేటీకరణకు దారి తీస్తుందనీ, ఇది రాబోయే మరిన్ని సమస్యలకు కారణమవుతుందని నిపుణులు, మేధావులు, విశ్లేషకులు అంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సీఎంకు సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని, ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తికి, మూసీ ఆధునీకరణకు తగిన నిధులు కేటాయించాలని, సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జి.నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసింది. 1963లో 4.6 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన మూసీ ప్రాజెక్టులో ఇసుక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని సీఎంకు వివరించారు. మూసీ కాలుష్యం కావడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మూసీని ఆధునీకరించి సుందరీకరణ చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచి నిధులు కేటాయించాలని కోరారు.

దుబ్బాక దయాకర్ రెడ్డికి మాతృవియోగం



- నివాళ్లర్పించిన ప్రజాప్రతినిధులు, సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు
- తల్లి మృతదేహాన్ని దానం చేసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మెన్, మాజీ సర్పంచ్, పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ అధినేత దుబ్బాక దయాకర్ రెడ్డి మాతృమూర్తి వజ్రమ్మ(88) శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. సమాజ సేవ, అభ్యుదయ భావాలు కలిగిన దయాకర్ రెడ్డి, ఆయన సోదరి కుకునూరి సరళ, కుటుంబం కలిసి వజ్రమ్మ మృతదేహాన్ని బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలకు అప్పగించారు. ఇదిలా ఉండగా, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వజ్రమ్మ మృతిపట్ల నివాళులర్పించారు. ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఉన్న సంప్రదాయాలకు అతీతంగా దయాకర్‌రెడ్డి తల్లి మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని నిర్ణయించడం ఎంతో ఆదర్శప్రాయం అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె.మల్లికార్జున్, సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సి.శోభన్, బుచ్చిరెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీరాములు, బి.వెంకట రామయ్య, ప్రగతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తదితరులు ఉన్నారు.

వజ్రమ్మ మృతిపట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. 1976లో చిట్యాల మండలం నేరడలో సీపీఐ(ఎం) ముగ్గురితో ప్రారంభమైందని, ఆ తర్వాత 1978లో 15 మందితో పార్టీ శాఖ ఏర్పడినప్పుడు వజ్రమ్మ సభ్యురాలుగా ఉన్నారని, తాను శాఖ కార్యదర్శిగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ఆమె భర్త అచ్చిరెడ్డి ఉభయ కమ్యూనిస్టు పార్టీలో నల్లగొండ ఆఫీసు సెక్రటరీగా పనిచేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తగా ఎంతో నిబద్ధతతో వజ్రమ్మ పనిచేశారని కొనియాడారు. తనపై దాడులు జరిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారని అన్నారు.

కుటుంబ సభ్యులకు మమతా మెడికల్ సైన్స్ అకడమీ యాజమాన్యం అభినందన

దుబ్బాక దయాకర్ రెడ్డి తన తల్లి మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించడం పట్ల కళాశాల యాజమాన్యం, మమత కాలేజ్ డీన్ హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ బి.నవీన్ కుమార్, అనాటమీ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ అభినందించారు. మనిషి మరణించిన తర్వాత దేహాన్ని కాల్చడం.. పూడ్చడం కన్నా మెడికల్ కాలేజీలకు ఇవ్వడం వల్ల ఎంతోమంది వైద్య విద్యార్థులకు ప్రయోజనం చేకూరి సమాజానికి ఉపయోగపడుతుందన్నారు.

హు.. ఉద్యోగ విస్ఫోటనమట !

(మొదటిపేజీ తరువాయి)

లాక్‌డౌన్‌లు విధించారు. ఇవి కూడా డబ్ల్యూపీఆర్ పెరుగుదలకు కారణమయ్యాయి. ఉపాధి విస్ఫోటనం అనేది నిరుద్యోగంపై ప్రజలను తప్పుదోవ పట్టించే ఎత్తుగడ మాత్రమే. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రజలు వ్యవసాయం, అనుబంధ గ్రామీణ సేవలు వంటి తక్కువ ఉత్పాదకతను అందించే ప్రాథమిక రంగాల నుండి వైదొలిగి పట్టణ, ఆధునిక రంగాలకు మారుతుంటారు. ఈ కారణాలన్నింటి వల్ల ఉపాధి కల్పన పెరిగి ఉండవచ్చు కానీ ఆర్‌బీఐ ఊహిస్తున్నంత స్థాయిలో మాత్రం కాదు.



నేతన్నలందరికీ వెంటనే ఉపాధి కల్పించాలి

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి :ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- యారన్ సబ్సిడీ, బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించాలి
- ఆర్డర్లు ఇవ్వాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ - ముషీరాబాద్

ఇందిరాపార్క్ వద్ద జేఏసీ ధర్నా

వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన నేతన్నలందరికీ వెంటనే ఉపాధి కల్పించాలని, సిరిసిల్ల పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమపై దాదాపు రెండు లక్షల మందికిపైగా కార్మికుల ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలతో ప్రపంచంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని అన్నారు. ఇటువంటి వస్త్ర పరిశ్రమ నేడు సంక్షోభం ఎదుర్కొంటున్నదని, పరిశ్రమలు మూతపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రాంతంలో 30 వేల మంది కార్మికుల ఉపాధి లేక రోడ్డున పడ్డారని, మరి కొంతమంది కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. పవర్‌లూమ్ పరిశ్రమలో 10 హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ అందించాలని, ఆపైన 4వ కేటగిరీ కింద పరిగణించి 50 శాతం సబ్సిడీ అందించాలని కోరారు. బతుకమ్మ చీరలు లేదా జనతా వస్త్ర పథకాన్ని ప్రవేశపెట్టి సంవత్సరానికి 15 కోట్ల మీటర్ల ప్రభుత్వ ఆర్డర్లు అందించి నేతన్నలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

యారన్ డిపో ఏర్పాటు చేసి ప్రభుత్వమే యారన్ సప్లై చేయాలని, సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల క్యాష్ క్రెడిట్ అందించాలని కోరారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన బకాయిలు, 2023 సంవత్సరం 10 శాతం యారన్ సబ్సిడీని అందించాలని డిమాండ్ చేశారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తిచేసి కార్మికులను యజమానులుగా మార్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యారన్ కొనుగోలుపై 20 శాతం సబ్సిడీ అందించి పరిశ్రమకు తోడ్పాటు అందించాలన్నారు. కార్మికుల సంక్షేమ పథకాలైన త్రిఫ్ట్, నేతన్నకు చేయూత, నేతన్న బీమా పథకాలను యథావిధిగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం సిరిసిల్లలో మార్కెట్ సౌకర్యం కల్పించే విధంగా నేత బజార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, పాలిస్టర్ అసోసియేషన్ సిరిసిల్ల అధ్యక్షులు ఆడెపు భాస్కర్, సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘ అధ్యక్షులు తాటిపాముల దామోదర్, సిరిసిల్ల యారన్ అధ్యక్షులు పిస్కా మధు, మ్యాక్స్ ప్రెసిడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్లండి శంకర్, పవర్‌లూమ్ ఆసాముల సంఘం అధ్యక్షులు సిరిసిల్ల రవి, సిరిసిల్ల పవర్ లూమ్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జేఏసీ కన్వీనర్ ముశం రమేష్, నాయకులు గొడవ రమణ పాల్గొన్నారు.

మహిళల్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సమాన పనికి సమాన వేతనమివ్వాలి : ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి



నవతెలంగాణ - కరీంనగర్

మహిళల్ని కేవలం ఓటర్లుగా వాడుకుంటూ, మహిళా చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. బేటి బచావో అని గొప్పలు చెబుతున్న నరేంద్ర మోడీ.. 'కుర్చీ బచావో' అనే విధంగా బడ్జెట్ పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళలని పూర్తిగా విస్మరించారని అన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లైంగికదాడులు, వివక్ష అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళల్ని వివస్త్రలను చేసి ఊరేగించినా నరేంద్ర మోడీ పెదవి విప్పకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలు వంటింట్లో ఉండాలని, నిరుద్యోగులు పకోడీ సమోసా బండ్లు పెట్టుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న అమిత్ షా, బీజేపీ మంత్రులు ఎందుకు పకోడీ బండ్లు పెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని విస్మరించిందని చెప్పారు.

పార్లమెంటులో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసినా అమలుకు నోచుకోకపోవడం చూస్తే మహిళల పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతోందని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మహిళల పట్ల వివక్షను అరికట్టాలని, లైంగిక వేధింపులను నియంత్రించి పటిష్ట చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. పని చేసే చోట లైంగిక వేధింపులు, గృహహింస, వరకట్న వేధింపులు అరికట్టాలని, భ్రూణ హత్యలను నివారించి ఆడపిల్లలను ఎదగనివ్వాలని అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నాలుగు రోజుల పాటు మహిళలకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, దీని ద్వారా మహిళలను రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం చేసి.. మహిళా సమస్యలపై మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కెఎన్.ఆశాలత, మాచర్ల భారతి, సహాయ కార్యదర్శులు పాలడుగు ప్రభావతి, ఎన్.రత్నమాల, కె.గీతారాణి, మద్దెల వినోద, నాగలక్ష్మి, అనురాధ, శశికళ, అహల్య, మహేశ్వరి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, దేవేంద్ర, రోజారాణి, తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తే మురుగు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కొద్దిపాటి వర్షాలకే గోదావరి ఉప్పొంగడం చూస్తున్నాం. డ్యాం నిర్మాణం చేపట్టినప్పటి నుంచి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి నీరు రావడం.. పటిష్టమైన పారిశుధ్య నిర్వహణ వ్యవస్థ లేకపోవడంతో గోదావరి పరిసరాల్లోని అనేక గ్రామాల్లో ఇండ్లల్లోకి నీరు చేరి..వ్యర్థ జలాలలో అవి మిళితమై పారిశుధ్యం లోపిస్తోంది. భద్రాచలంతో పాటు చర్ల, దుమ్ముగూడెం మండలంలోని అనేక గ్రామాల్లో కొద్దిపాటి వరదలకే పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. వరదలు మరింత తీవ్రరూపం దాల్చాయంటే అశ్వాపురం, పినపాక, బూర్గంపాడు మండలాల్లోనూ వరదకు తోడు మురుగు నీరు తోడై అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

రివర్స్ పంపింగ్ పునరుద్ధరణతోనే మేలు

భద్రాచలం పట్టణం నుంచి వెలువడే మురుగు నీరు స్లూయిజ్‌ల ద్వారా గోదావరిలో కలుస్తాయి. తద్వారా నదీ జలాలూ కలుషితమవుతాయి. కాబట్టి మురుగు నీటిని రివర్స్ పంపింగ్ చేసేందుకు రూ.2 కోట్లతో 15 ఏండ్ల కిందటి నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మురుగునీరు చేరే చోట బావి తవ్వి మోటార్లు బిగించారు. ప్రత్యేకంగా తవ్వించిన చెరువుల్లోకీ నీరు తరలించేవారు. అక్కడ నీటిని శుద్ధి చేసి పంట పొలాలకు వాడేవారు. తద్వారా ముంపు, మురుగు సమస్య తీరింది. ఆ తర్వాత విద్యుత్ బిల్లుల భారంతో దీన్ని వదిలేశారు. తిరిగి దీన్ని పునరుద్ధరించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతోపాటు కాలుష్య నియంత్రణ పథకాన్ని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

పరిష్కార మార్గాలు

మురుగు నీటిని ఎత్తిపోయడానికి ప్రస్తుతం 1,300 హెచ్‌పీ మోటార్లు ఉపయోగిస్తున్నారు. వీటి సామర్థ్యాన్ని 3వేల హెచ్‌పీలకు పెంచాలి. స్లూయిజ్‌లు, డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోవడంతో వరద నీరు రోడ్ల పైకి చేరుతోంది. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలి.. మురుగునీటి నిర్వహణ, పాత డ్రెయినేజీల పునరుద్ధరణ, మౌలిక వసతుల కల్పన చర్యలు వేగవంతం చేయడం ద్వారా మురుగు సమస్యకు పరిష్కారాన్ని చూపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

వికలాంగ అధికారులపై చిన్నచూపు తగునా?

- ఉద్యోగాలలో కోటా అవసరమా అంటూ ఎద్దేవా
- వివాదాస్పదమైన స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ఒక దశాబ్దం క్రితం దేశ రాజధానిలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో వికలాంగ మహిళలపై జాతీయ సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఓ బ్యూరోక్రాట్‌ను ఆహ్వానించారు. ఆయన షరా మామూలుగానే ఆలస్యంగా వచ్చారు. 'నేనేమీ నిపుణుడిని కాను' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వికలాంగుల డిమాండ్లను అపహాస్యం, అవహేళన చేసేలా మాట్లాడారు. అంతేకాదు...తన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకొని విధాన పత్రం రాయవచ్చునని ప్రగల్భాలు పలికారు. అధికారి మాటలతో సదస్సుకు వచ్చిన వారందరూ నిశ్చేష్టులయ్యారు. నాటి నుంచి నేటి వరకూ కొందరు సీనియర్ అధికారుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. దృష్టి వైకల్యంతో బాధపడుతున్న ఐఏఎస్ అభ్యర్థులు పోస్టింగుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఇప్పుడు దేశంలో వివిధ రకాల వైకల్యాలతో ఉన్న అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఎల్‌వీ సుభాష్, ఇరా సింఘాల్, ప్రాంజల్ పాటిల్, సుఖ్‌సోహిత్ సింగ్, ఉమ్మల్ ఖేర్ వంటి వికలాంగ అధికారులు తమకంటూ ఓ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయి పనులు నిర్వహించడంలో, పరిపాలనా సంబంధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో వారి సమర్థతపై సీనియర్ సహచరులు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

ప్రాణాంతక కోవిడ్‌తో పోరాదారు

2020 ఫిబ్రవరిలో కోవిడ్ సమయంలో ఇంటి నుంచి పనిచేసేందుకు స్మితా సబర్వాల్ సిద్ధమయ్యారు. కానీ అదే సమయంలో శారీరకంగా వికలాంగుడైన ప్రఖ్యాత అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ ఆర్ఎస్ రౌటేలా జీటీబీ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ప్రాణాంతక కోవిడ్ సంక్షోభ నివారణలో తన వంతు పాత్ర పోషించారు. ఓ వైపు అధికారుల ఉదాసీనతతో పోరాడుతూనే మరోవైపు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రోగుల బాగోగులు చూశారు. ఉత్తరప్రదేశ్ సరిహద్దులో నిలిచిపోయిన ఆక్సిజన్ ట్యాంకర్లను ఆస్పత్రికి రప్పించి రోగులకు వైద్య సేవలు అందించారు. వికలాంగులైన వైద్యులు కూడా ప్రజల ప్రాణాలు కాపాడేందుకే శిక్షణ పొందుతారు. కానీ భ్రష్టుపట్టిన వ్యవస్థకు చికిత్స చేయలేరు.

వీరందరూ వికలాంగులే

ఈ ప్రశ్నలకు జవాబేది?

నూతన ప్రభుత్వ తొలి వంద రోజుల పాలనలో సాధించిన విజయాల జాబితాను రూపొందించడంలో సామాజిక న్యాయ- సాధికారత మంత్రిత్వ శాఖ, సిబ్బంది-శిక్షణ శాఖ బిజీబిజీగా గడుపుతున్నాయి. అయితే 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్'పై మన నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఈ రెండు మంత్రిత్వ శాఖల్లో దేనికైనా ధైర్యం ఉన్నదా? 1968వ సంవత్సరపు అఖిల భారత సర్వీసుల ప్రవర్తనా నిబంధనల్లోని రూల్ 7 ప్రకారం తప్పు చేసే అధికారులను శిక్షించగలవా?.



వికలాంగుడైన ఓ సర్జన్‌పై మీరు విశ్వాసం ఉంచగలరా' అంటూ స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్‌పై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ముకేష్ శర్మ, యూరాలజిస్ట్ డాక్టర్ సుజిత్ జోష్, హెమటాలజిస్ట్ డాక్టర్ సురేష్ హనగవాది, జాతీయ టీబీ ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ సంగీతా శర్మ, సూపర్ స్పెషలిస్టులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ భమారే వంటి ప్రముఖ వైద్యులు కూడా వికలాంగులేనంటూ ఓ నెటిజన్ తిప్పికొట్టాడు. తన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు సభర్వాల్ తన 24 సంవత్సరాల అనుభవం గురించి ఓ ఎంపీతో గొప్పగా చెప్పుకొచ్చారు. అయితే కేరళలో గత 24 సంవత్సరాలుగా గ్యాస్ట్రో సర్జన్‌గా పనిచేస్తూ, కాలేయ మార్పిడి బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ ఆర్ఎస్ సింధు గురించి ఆమెకు తెలియదు. డాక్టర్ సింధు రెండు కాళ్లకూ పోలియో సోకింది. నడవడం కోసం ఆమె కాలిపర్లు, క్రచ్చర్లను ఉపయోగిస్తారు. పద్మశ్రీ డాక్టర్ సురేష్ అదానీ సేవలను గుర్తించడంలో కూడా నెటిజన్లు విఫలమయ్యారు. ఎందుకంటే వికలాంగులైన పలువురు ఫిజీషియన్లు తమ సమయంలో చాలా భాగాన్ని రోజువారీ అడ్డంకులతో పోరాడేందుకే వినియోగిస్తుంటారు.

ఆ మాజీ సీఈఓ చేసిందేమిటి?

వికలాంగుల కోటాపై నిటి ఆయోగ్ మాజీ సీఈఓ మండిపడ్డారు. కానీ జీడీపీలో ప్రజారోగ్యంపై పెడుతున్న ఖర్చును పెంచడానికి మాత్రం ఆయన చేసిందేమీ లేదు. మన దేశంలో ప్రజారోగ్యంపై పెడుతున్న ఖర్చు భూటాన్, నేపాల్, శ్రీలంక, మయన్మార్ దేశాల వ్యయంతో పోలిస్తే తక్కువే. పైగా అవేవీ సంపన్న దేశాలు కావు. సీనియర్ ప్రభుత్వ అధికారిగా సుప్రీంకోర్టు ఇచ్చిన నల్సా తీర్పు అమలు కోసం ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తున్న సమయంలో ట్రాన్స్‌జెండర్ కోటాకు సంబంధించిన సమీక్షపై కూడా ఆ మాజీ సీఈఓ ఓ ట్వీట్ చేశారు. జీ-20 షెర్పాగా అవకాశం వచ్చినప్పుడు కూడా వైకల్యం, ట్రాన్స్ సమాజం ప్రస్తావనలను ఢిల్లీ డిక్లరేషన్‌లో చేర్చలేకపోయారు.

వీరందరూ ఒకే కోవలోని వారే

వికలాంగుల బిల్లును సవరించేందుకు 2016లో మంత్రుల బృందం సమావేశాన్ని నిర్వహించింది. అందులో ఓ కేంద్ర క్యాబినెట్ మంత్రి కూడా ఇలాంటి చచ్చు ప్రశ్నలే వేశారు. మానసిక అనారోగ్యానికి గురైన వారికి ఉద్యోగాలలో కోటా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నిటి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ సైతం ఇలాంటి అభ్యంతరాలే లేవనెత్తేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే వాటిపై తీవ్ర విమర్శలు రావడంతో వెనక్కి తగ్గారు. తాజాగా తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగుల సమస్యలపై తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. వికలాంగులైన సహచరులను అవమానించారు. వీరందరూ ఒకే కోవకు చెందిన వారు. వికలాంగులను హేళన చేసి ఆత్మసంతృప్తి పొందుతుంటారు.

కష్టాల్లో ఉన్నవారి బాధను శ్రద్ధగా సానుభూతితో వినండి. అది వారికి చికిత్సలా పనిచేస్తుంది - మహాత్మా గాంధీ

కేంద్రం కాశ్మీర్ పట్ల అనుసరించిన అప్రజాస్వామిక విధానాలే పరిస్థితి దిగజారడానికి అసలు కారణమయ్యాయి. తీవ్రవాదాన్ని అణచివేసే పేరిట పౌర హక్కులపై దాడి చేయడం నిరసన పెంచుతున్నది. ఉదాహరణకు పూంచ్ జిల్లాలోనే సైనిక దళాలు ముగ్గురు పౌరులను అనుమానంపై నిర్బంధించడం, లాకప్‌లోనే వారు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర నిరసనకు దారితీసింది.ప్రధాని మోడీ పర్యటనకు ముందు కూడా అందరినీ అరెస్టు చేశారు. ఈ నిరంకుశ ధోరణి ఎంతవరకూ పోయిందంటే దశాబ్దాలుగా కాశ్మీరీలు ప్రత్యేకంగా నిర్వహించుకునే అమరవీరుల సంస్మరణ దినానికి కూడా అనుమతినివ్వలేదు. టెర్రరిజం పెరగడానికి కారణమైన పాలకులే దాన్ని సాకుగా చూపి పౌరుల, పార్టీల హక్కులను అణచివేస్తున్నారన్న మాట.

రెండవసారి అధికారానికి వచ్చీ రాగానే మోడీ సర్కారు 370ని ఏకపక్షంగా రద్దుచేసింది. అంతేగాక కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చింది.లడక్‌ను ప్రత్యేక ప్రాంతంగా విభజించింది. రాజ్యాంగ రీత్యా ఒక రాష్ట్ర విభజన హోదా మార్పు శాసనసభకు చెప్పిచేయాలి. అందులోనూ కాశ్మీర్ శాసన సభకు ప్రత్యేక ప్రతిపత్తి కూడా వుండింది. ఆ శాసనసభ ఉనికిలో లేనప్పుడు రాష్ట్రపతిపాలనలో భాగంగా గవర్నర్ రాజ్యం చేస్తున్నప్పుడు నిరంకుశంగా ఇవన్నీ కానిచ్చేశారు. మాజీ ముఖ్యమంత్రులతో సహా కీలక నేతలందరినీ జైళ్లపాలు చేసి గవర్నర్ చాటున బీజేపీ అనుకూల మతతత్వ పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. 370 స్ఫూర్తిని సవ్యంగా అమలు చేయకుండా కేంద్రం పెత్తనం చేయడం కాశ్మీర్ సమస్యలకు మూలం.

కేంద్ర నిరంకుశత్వమే కాశ్మీర్‌కు శాపం



తెలకపల్లి రవి

జమ్మూ కాశ్మీర్ 370వ అధికరణం రద్దుతో అద్భుతమైన అవకాశాలు ఆవిష్కరించ బడినట్టు, అక్కడ అభివృద్ధి వరవళ్లు తొక్కుతున్నట్టు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం టముకు వేసుకుంటుంటే అక్కడ పరిస్థితులు మాత్రం వేగంగా దిగజారిపోతున్నాయి. ఆర్థిక, సామాజిక,రాజకీయ రంగాల్లో సంక్షోభం మాత్రమే గాక మానవ హక్కుల విషయంలోనూ ఈ దిగజారుడు తీవ్రమవు తుందని ప్రజాస్వామిక వాదులు ఆందోళన చెందుతున్నారు మరోవైపున టెర్రరిస్టు కార్యకలాపాలు పెరుగుతున్నా యంటూ కేంద్రం,సైన్యం అణచివేత చర్యలు తీవ్రం చేశాయి. ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల ప్రత్యేకంగా ఉన్నత స్థాయిలో సమావేశమై సమీక్ష చేసి ఆగమేఘాల మీద అక్కడకు అధునాతన సైనిక దళాలను పంపించాలని నిర్ణయించారు. ఈ ఏడాది మొదట్లో కాశ్మీర్‌లో పర్యటించి అంతా గొప్పగా వుందనే ఆర్భాటం చేసిన మోడీనే స్వయంగా అత్యవసర చర్యలు ప్రకటించడంలో పరిస్థితి తీవ్రతతో పాటు కేంద్రం వ్యూహం కూడా కనిపిస్తోంది. తీవ్రవాద కార్యకలాపాలకు స్థావరాలుగా వున్న చోట్లకు సాయుధ బలగాలను మోహరించాలనీ, పహారా నిఘా కార్యక్రమాలు ముమ్మరం చేయాలనీ ఆదేశించారట. మొత్తంపైన 500 మంది కమెండోలు, 2000 మేరకు ఇతర దళాలు ఈ ప్రత్యేక చర్యలో పాల్గొంటున్నట్టు సమాచారం. భద్రతా దళాలు రాష్ట్ర పోలీసులు కలిసి గాలింపు చర్యలు ఇప్పటికే బాగా పెంచేశారు. అనుమానితులను విస్తారంగా అరెస్టులు చేస్తున్నారు. తీవ్రవాద కార్యకలాపాలను కాశ్మీర్ లోయ నుంచి జమ్మూ ప్రాంతంలోకి విస్తరించడం జరుగుతోందని కేంద్రం చెబుతున్నది. రాజకీయంగా జమ్మూలో బీజేపీ కేంద్రీకరణ, స్థానాలు తెచ్చుకోవడం తెలిసిన విషయమే. గతేడాది ఏకపక్షంగా నియోజకవర్గాల పునర్విభజన జరిపినప్పుడు కూడా జమ్మూలోనే సీట్లు పెరగడం విమర్శకు కారణమైంది, బీజేపీ మతతత్వ విభజన రాజకీయాలు దీనికి ఒక కారణమైతే రిజర్వేషన్ విధానం వల్ల గుజ్జార్లలో ఒక భాగం దూరం కావడం, గతంలో ఆఫ్ఘనిస్తాన్‌ను స్థావరంగా చేసుకున్న కొందరు తీవ్రవాదులు ఇటు మరలిరావడం వంటి ఇతర కారణాలుగా కూడా చెబుతున్నారు.

జమ్మూలో పరిణామాలు


ఏమైనా ఇదేదో ఊహించని పరిణామం కాదు. కేంద్రం కాశ్మీర్ పట్ల అనుసరించిన అప్రజాస్వామిక విధానాలే పరిస్థితి దిగజారడానికి అసలు కారణమయ్యాయి. తీవ్రవాదాన్ని అణచివేసే పేరిట పౌర హక్కులపై దాడి చేయడం నిరసన పెంచుతున్నది. ఉదాహరణకు పూంచ్ జిల్లాలోనే సైనిక దళాలు ముగ్గురు పౌరులను అనుమానంపై నిర్బంధించడం, లాకప్‌లోనే వారు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర నిరసనకు దారితీసింది.ప్రధాని మోడీ పర్యటనకు ముందు కూడా అందరినీ అరెస్టు చేశారు. ఈ నిరంకుశ ధోరణి ఎంతవరకూ పోయిందంటే దశాబ్దాలుగా కాశ్మీరీలు ప్రత్యేకంగా నిర్వహించుకునే అమరవీరుల సంస్మరణ దినానికి కూడా అనుమతి నివ్వలేదు. టెర్రరిజం పెరగడానికి కారణమైన పాలకులే దాన్ని సాకుగా చూపి పౌరుల, పార్టీల హక్కులను అణచి వేస్తున్నారన్న మాట. సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు మహ్మద్ యూసఫ్ తరిగామి జమ్మూ కాశ్మీర్ పరిస్థితి దిగజారడానికి కారణాలేమిటో స్పష్టంగా తెలియజేశారు. అయిదేండ్ల నుంచి ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలు లేకుండా పోవడమే ఇందుకు కారణమవుతోందన్నారు. "వివిధ రంగాల్లో తీవ్ర సంక్షోభానికిది దారితీసింది. గతంకన్నా ధరలు నిరుద్యోగం దారుణంగా పెరిగిపోవడమే గాక దారిద్ర్యం అప్పుల భారం తాండవిస్తున్నాయి. కాశ్మీర్‌లోయలో ఈ సమస్యలు రగులుతుంటే కేంద్రం మీడియా కూడా జమ్మూలో తీవ్రవాదం పెరుగుదల గురించి ఎక్కువగా మాట్లాడటం యాదృచ్ఛికం కాదు. గతంలోనూ వారి వ్యూహం అక్కడే కేంద్రీకృతమై వుంటోంది." కాశ్మీరీ పండిట్లపై హత్యలు అనేదాన్ని దేశ వ్యాపితంగా ఒక మతపరమైన కోణంలో చూపించడం అందులో భాగమే. వారికోసం గట్టిగా నిలబడి ప్రాణాలమీదకు తెచ్చుకున్నవారిలో తరిగామి ముందున్నారు. అనేక దాడులను తట్టుకుని నిలబడినందుకే ఆయన జమ్మూ నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే కాగలిగారు.

తలకిందులు వాదనతో...

రెండవసారి అధికారానికి వచ్చీ రాగానే మోడీ సర్కారు 370ని ఏకపక్షంగా రద్దు చేసింది. అంతేగాక కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చింది. లడక్‌ను ప్రత్యేక ప్రాంతంగా విభజించింది. రాజ్యాంగ రీత్యా ఒక రాష్ట్ర విభజన హోదా మార్పు శాసనసభకు చెప్పిచేయాలి. అందులోనూ కాశ్మీర్ శాసనసభకు ప్రత్యేక ప్రతిపత్తి కూడా వుండింది. ఆ శాసనసభ ఉనికిలో లేనప్పుడు రాష్ట్రపతి పాలనలో భాగంగా గవర్నర్ రాజ్యం చేస్తున్నప్పుడు నిరంకుశంగా ఇవన్నీ కానిచ్చేశారు. మాజీ ముఖ్యమంత్రులతో సహా కీలక నేతలందరినీ జైళ్లపాలు చేసి గవర్నర్ చాటున బీజేపీ అనుకూల మతతత్వ పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.370 స్ఫూర్తిని సవ్యంగా అమలు చేయకుండా కేంద్రం పెత్తనం చేయడం కాశ్మీర్ సమస్యలకు మూలం. అందుకు పూర్తి విరుద్ధంగా కాశ్మీర్ వెనకబాటుకు 370 కారణమని దుష్ప్రచారం చేశారు. 370 వల్ల కేంద్ర పథకాలు అమలు చేయడం సాధ్యపడటం లేదన్నారు. బయటవారు కాశ్మీర్‌లో వచ్చి వ్యాపారాలు, అస్తుల కొనుగోళ్లు చేయడానికి వీలుపడటం లేదన్నారు. పెట్టుబడులు రాకపోవడానికి అదే కారణంగా చూపించారు.దాన్ని రద్దుచేసిన అయిదేళ్ల తర్వాత ఇప్పుడు పరిస్థితి ఇంతగా దిగజారడం చూస్తే ఆ ప్రచారాలన్నీ కట్టుకథలని తేలిపోతుంది. ఎందుకంటే 370 వున్నా కేంద్ర పథకాలు అమలు చేయడానికి ఏ ఆటంకం వుండేది కాదు. గ్రామీణ ఉపాధి పథకం. ప్రధాని గ్రామీణసడక్ యోజన వంటివి అక్కడ అమలవుతుండేవి. ఇక బయట వారి పెట్టుబడులకు అది అడ్డంకిగా వుండేదన్న మాట కూడా నిజం కాదు. ఎన్నో దశాబ్దాలుగా కథువాలో బిర్లాల మిల్లు, శ్రీనగర్‌లో గ్రాండ్ లలిత్ హోటల్ వంటివి వుంటూనే వచ్చాయి.కేవలం కాశ్మీర్‌పై పూర్తి ఆధిపత్యం పెంచుకోవడానికి నేరుగా కేంద్రం పెత్తనంతో బీజేపీ బలం పెంచుకోవడానికి మాత్రమే ఈ నాటకం నడిపించారు.

శాసనసభ ఎన్నికలెప్పుడు?

కేంద్రం పెత్తనంలోకి వచ్చాక అన్నిటికన్నా తీవ్రమైన దెబ్బ తగిలింది మానవ హక్కులకే. కాశ్మీరియత్ అనే స్థానిక సంస్కృతిని, రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయడం ప్రజలలో నిరసన పెంచింది.అంతకుముందు అనేక మంది టెర్రరిజానికి వ్యతిరేకంగా మారారు. కానీ ఈ అసంతృప్తిని పెంచిన మోడీ సర్కారు చర్యలు, లెఫ్టినెంట్ గవర్నర్ నిరంకుశ పోకడలు మరోసారి విచ్ఛిన్న శక్తుల కుట్రలకు దేశ వ్యతిరేక శక్తులకు ఊతమిస్తున్నాయి.ఈ తప్పులను సరిదిద్దుకుని ప్రజలనూ పార్టీలనూ విశ్వాసంలోకి తీసుకునే బదులు కేవలం సాయుధ బలగాలు అణచివేత చర్యలను పెంచడం పరిస్థితిని మరింత దిగజార్చుతున్నది.



ఏ మాత్రం సందేహానికి గురైనా సామాన్య పౌరులను నిఘా వర్గాలు వెంటాడుతున్నాయి. డిజిటల్ నిఘా పరాకాష్టకు చేరింది.పోలీసులు సాయుధ దళాల బెదిరింపులు నిత్యకృత్యమయ్యాయి.మామూలు ప్రజల నుంచి మొబైల్ ఫోన్‌నెంబర్లు తీసుకోవడం రివాజుగా మారింది. సుదీర్ఘకాలం పాటు ఇంటర్నెట్ సౌకర్యంతో సహా సమాచార సంబంధాలు లేకుండా పోయాయి. ఎవరు ఏ కాస్త భిన్నస్వరం వినిపించినా, విమర్శ చేసినా నిర్బంధం చుట్టుముడుతున్నది. ఎన్నికైన ప్రభుత్వం రాజకీయ కార్యకలాపాలు లేకపోవడంతో నిరంకుశాధికార వర్గం రాజ్యం చేస్తున్నది.వీరిపై ఎలాటి ఆజమాయిషీ గానీ, అదుపాజ్ఞలు గానీ లేకుండా పోయాయి.ఈ అంశాలు పార్లమెంటులోనూ, సుప్రీం కోర్టుముందు కూడా చర్చకు వచ్చాయి. 370 రద్దును సవాలు చేసే రాజ్యాంగ కేసును విపరీతంగా ఆలస్యం చేసిన సుప్రీం కోర్టు ఆఖరుగా అది చెల్లుతుందని తీర్పునివ్వడం నిరుత్సాహపర్చింది. అయితే అదే సమయంలో సెప్టెంబరు 30 లోగా అక్కడ ఎన్నికలు జరిపి శాసనసభను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ప్రతిపక్షాల నిరసన

కాశ్మీర్‌లో జిల్లా అభివృద్ధి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో గుప్కార్ అలయన్స్ ఆధిక్యత సాధించగా బీజేపీ జమ్మూలో ప్రభావం చూపించింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనైతే జమ్మూలోని ఉద్దంపూర్, జమ్మూ స్థానాలు బీజేపీ గెల్చుకోగా, శ్రీనగర్, అనంతనాగ్ రాజౌరి నేషనల్ కాన్ఫరెన్స్ తెచ్చుకుంది. కాశ్మీర్ లోయలోని బారాముల్లా స్థానం నుంచి పిడిపిపై నేషనల్ కాన్ఫరెన్స్ తరపున ఒమర్ అబ్దుల్లా విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా వేర్పాటువాద అవామీ ఇత్తేహాద్ పార్టీ అభ్యర్థి, పూర్వపు ఎమ్మెల్యే షేక్ అబ్దుల్ రషీద్ ఇంజనీర్ స్వతంత్రుడుగా విజయం సాధించారు. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న ఆయన ప్రత్యేకంగా కోర్టు ద్వారా వచ్చి ప్రమాణ స్వీకారం చేయడం మీడియాను ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ప్రకారం చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ 36చోట్ల, బీజేపీ 29 చోట్ల ఆధిక్యతలో వుండగా మొహబూబా మఫ్తి పిడిపి కేవలం అయిదు చోట్ల, కాంగ్రెస్ ఏడు చోట్ల మాత్రమే ఆధిక్యత తెచ్చుకో గలిగాయి. కాంగ్రెస్, ఎన్‌సి 'ఇండియా'లో ఉన్నా ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేశాయి. ఈ రాజకీయ ఫలితాల ప్రభావం కూడా కేంద్ర బీజేపీ చర్యలను ప్రభావితం చేస్తున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు ఆదేశించినా ఏదో ఒకసాకుతో వాయిదా వేస్తూ వస్తోంది. పైగా లెఫ్టినెంట్ గవర్నర్ పాలనాధి కారాలు, నియామక అధికారాలు మరింత పెంచుతూ కొద్దిరోజుల కిందట హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.శాసనసభ ఏర్పాటు కావలసిన తరుణంలో ఈ విధంగా చేయడ మంటే రేపు రాబోయే ప్రభుత్వ అధికారాలను ముందుగా కత్తిరించడమే. పారిశ్రామిక విధానాన్ని సవరించి మరింత సులభంగా భూములు వాణిజ్యసంస్థలకు కేటాయించేందుకు గవర్నర్ యంత్రాంగం నిన్ననే తాజా ఉత్తర్వులు ఇచ్చింది. టెర్రరిజం అణచివేత పేరిట సైనిక దళాల చర్యలు,రాజకీయంగా గవర్నర్ అధికారాలు పెంపు, కార్పొరేట్లకు నజరానాల పెంపు,మతపరమైన విభజన తీవ్రం చేయడం ఈ సమయంలో కేంద్ర బీజేపీ వ్యూహంగా ఉంది.ఒక విధంగా ఇది జరగాల్సిన దానికి పూర్తి భిన్నమైన దిశలో ఉందని చెప్పాలి. జమ్మూకాశ్మీర్ ప్రతిపక్ష పార్టీలు ఈ ఏకపక్ష నిర్ణయాల విషయమై చర్చించేందుకు ఆగష్టు7న సమావేశమవుతున్నాయి. ఈలోగా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం ఏం చేస్తాయో చూడవలసి వుంటుంది. ■

> లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ప్రకారం చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ 36చోట్ల, బీజేపీ 29 చోట్ల ఆధిక్యతలో వుండగా మొహబూబా మఫ్తి పిడిపి కేవలం అయిదు చోట్ల, కాంగ్రెస్ ఏడు చోట్ల మాత్రమే ఆధిక్యత తెచ్చుకోగలిగాయి. కాంగ్రెస్, ఎన్‌సి 'ఇండియా'లో ఉన్నా ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేశాయి. ఈ రాజకీయ ఫలితాల ప్రభావం కూడా కేంద్ర బీజేపీ చర్యలను ప్రభావితం చేస్తున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు ఆదేశించినా ఏదో ఒకసాకుతో వాయిదా వేస్తూ వస్తోంది. పైగా లెఫ్టినెంట్ గవర్నర్ పాలనాధికారాలు, నియామక అధికారాలు మరింత పెంచుతూ కొద్దిరోజుల కిందట హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.శాసనసభ ఏర్పాటు కావలసిన తరుణంలో ఈ విధంగా చేయడమంటే రేపు రాబోయే ప్రభుత్వ అధికారాలను ముందుగా కత్తిరించడమే.

సంపాదకీయం

అంధులంటే ఎవరోకాదు, కళ్లుండీ వాస్తవాలను చూడలేని గర్వాంధులనే వ్యాఖ్య నిజమేననిపి స్తున్నది. తరతరాలుగా బలహీనులను ఎచీశీఅవగానంగా చూడటమనేది కొనసాగుతూనే ఉన్నది. ఈ రోజు వైకల్యం ఉన్నవారికి రిజర్వేషన్లు నిరాకరించేవారే, రేపు దళిత, బలహీనవర్గాలకు ఆ సౌకర్యాలు అవసరం లేదని, వారు ఆ ఉద్యోగాలకు సరిపోరని కూడా వాదిస్తారు. అన్ని శారీరకాంగాలు సరిగా ఉన్నవాళ్లకు మానసికాంగం మానవీయంగా లేకపోవడం ఒక విషాదం. సామర్థ్యాలనేవి సంకల్పం, నిజాయితీ, చిత్తశుద్ధిలోంచి వస్తాయి. వీటితో పాటుగా సాటి మనుషుల పట్ల ప్రేమ, గౌరవాలు లేకుండా అన్ని శరీరాంగాలు ఉన్నా ఏమి ప్రయోజనం!

ఎవరిది వికలత్వం!



'అపజయాలు కలిగిన చోటే, గెలుపు పిలుపు వినిపిస్తుంది. ఆకులన్ని రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది. అవరోధాల దీవుల్లో ఆనంద నిధి ఉన్నది, కష్టాల వారధి దాటిన వారికి సొంతమవుతుందీ' అని ఒక గొప్ప మనోధైర్యాన్ని బలహీన, సామర్థ్యరహితుల్లో నింపుతుంది పాట. పాటే కాదు, కొందరు వైకల్యాలనధిగమించి సాధారణ బలవంతులు చేయలేని పనులనూ చేసి చరిత్రనూ సృష్టించారు. వారందరూ ఎప్పటికీ ప్రేరణనిస్తూనే ఉంటారు. రెండు చేతులూ లేకుండానే గొప్ప చిత్రకారులుగా వెలుగొందిన వారిని చూసే వున్నాము. కలాన్ని చేత పట్టుకుని రాయలేకపోయిన సిరిసిల్ల రాజేశ్వరి కవితలు కాళ్లతోనే రాసి ఎన్నో అవార్డులు గెలుచుకోలేదూ! శరీరంలో ఏదో ఒక అంగం పుట్టుకతోకానీ మధ్యలోకానీ బలహీనంగానో, అసలు లేకుండానో బతుకుతున్నవాళ్లు లక్షలాదిమంది ఉన్నారు. వారు మరింత పట్టుదలతో, సాకల్యవంతులకంటే కూడా రాణిస్తున్న వాళ్లు కోకొల్లలు. మానసిక దృఢత్వంతోనే ఇవన్నీ సాధ్యమవు తుంటాయి. అందుకనే కవి, చెమటనీరు చిందగా మార్పులేనిదీ, మారిపోనిదీ ఏదీలేదని చైతన్యాన్ని అందిస్తాడు.

అట్లా వైకల్యాలను అధిగమించి గొప్ప పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న వాళ్లు ఎంతోమందిని మనం ఉదహరించుకోవచ్చు. భక్త కవి సూరదాసు, ద్వారం వెంకటస్వామి నాయుడు మన దేశంలోనే గొప్ప కళాకారులు. కాలు లేకుండానే అద్భుతమైన నృత్యంతో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న సుధాచంద్రన్ (మయూరి సినిమా), రెండు కాళ్లు లేని జైపాల్‌రెడ్డి కేంద్ర మంత్రిగా దేశమంతా పర్యటించిన ప్రముఖ రాజకీయ నాయకుడు. ప్రపంచానికే గొప్ప శాస్త్రాన్ని తన పరిశోధన ద్వారా అందించిన స్టీఫెన్ హాకిన్స్ తొంబై శాతమూ వైకల్యంతో జీవించినవారే కదా! ప్రఖ్యాత సిద్ధాంతవేత్త ఆంటోనియోగ్రాంసీ, విశ్వకవి బైరాన్, ఇలా ఎందరినైనా వివరిస్తూపోవచ్చు. అంతెందుకు, మన ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రపంచ విషయాల నుండి బస్తీ అంశాల వరకూ విశ్లేషణ చేసి సాకల్యంగా చెప్పడంలో దిట్ట కదా! సమ్మెట ఉమాదేవి రాసిన 'నికోలస్ జేమ్స్ వుయిచిచ్ విజయగాథ' చదివినా గానీ, స్వర్ణకిలారి వెలుగులోకి తెచ్చిన ఏడెండ్ల చిరుప్రాయంలోనే ఇండియన్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకున్న 'ఎడ్మండ్ థామస్ క్లింట్' చిత్రాలను చూసిన ఎంతో ప్రేరణ. ఇంతమంది ఇన్నిరకాలుగా తమ సామర్థ్యాలను నిరూపించుకుంటుంటే, వికలాంగులు ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలకు పనికిరారని ఒక సీనియర్ ఐఏఎస్ వాదించడం, వ్యాఖ్యానించడం అర్థరహితం, అవివేకమే అవుతుంది. మహారాష్ట్రలోని పూజాఖేద్కర్ అనే ఒక ఐఏఎస్ అధికారిణి, తన ఎంపిక సమయంలో వికలాంగురాలని, ఓబీసీ సర్టిఫికెట్లు తప్పుడివి సమర్పించిందనే సంఘటనను ఆధారం చేసుకుని మొత్తం అంగవైకల్యం కలిగిన వారిని కించపరిచే విధంగా, అవమానించడం దుర్మార్గం. ఆ పదవులకు వారు సరిపోయేదీ, సరిపోనిదీ నిర్ణయించడం ఆమె పని కాదు. పోనీ ఏ ఆధారంగా అలా వ్యాఖ్యానిస్తున్నదో కూడా తెలుపలేదు. ఉద్యోగులను నియమించే వ్యవస్థా, ప్రభుత్వమూ అనుమతించగా ఈమెకున్న ఇబ్బంది ఏమిటి? అసలు ఆ విధంగా ఒక నిర్ధారణకు ఎలా వస్తారు? ఇది కేవలం నోటి దురుసుతనం తప్ప మరేమీ కాదు. అంగవైకల్యం, రంగు, మతం, కులం, లింగ, ప్రాంత భేదాలతో మనుషులను అవమానించే చేష్టలు, మాటలు అమానవీయమైనవి. పరస్పర గౌరవాలతో బతకాల్సిన ఆధునిక వ్యవస్థలో ఇలాంటి ఆలోచనలకే తావుండకూడదు. ఎవరి సామర్థ్యాల మేరకు వారా పనులు సాగిస్తారు. అంగవైకల్యంతోనే ఎవరెస్టుపైకి ఎక్కిన కౌశిక్‌లా మీరెక్కగలరా? అని అడిగితే ఏం చెబుతారు!

అందుకనే ఆ ఐఏఎస్ అధికారిణి వ్యాఖ్యలకు, ఎంతోమంది ఐఏఎస్‌లకు శిక్షణనిస్తున్న బాలలత బాధపడ్డారు. ఇలాంటి అధికారులు ఉన్న కారణంగానే పన్నెండేండ్ల సివిల్ సర్వెంట్‌గా పనిచేసిన నేను రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. పదవిపొందాక వైకల్యం వస్తే, అప్పుడేం చేస్తారో చెప్పాలనీ ఆవిడ ప్రశ్నించారు. అంధులంటే ఎవరోకాదు, కళ్లుండీ వాస్తవాలను చూడలేని గర్వాంధులనే వ్యాఖ్య నిజమేననిపి స్తున్నది. తరతరాలుగా బలహీనులను హీనంగా చూడటమనేది కొనసాగుతూనే ఉన్నది. ఈ రోజు వైకల్యం ఉన్నవారికి రిజర్వేషన్లు నిరాకరించేవారే, రేపు దళిత, బలహీనవర్గాలకు ఆ సౌకర్యాలు అవసరం లేదని, వారు ఆ ఉద్యోగాలకు సరిపోరని కూడా వాదిస్తారు. అన్ని శారీరకాంగాలు సరిగా ఉన్నవాళ్లకు మానసికాంగం మానవీయంగా లేకపోవడం ఒక విషాదం. సామర్థ్యాలనేవి సంకల్పం, నిజాయితీ, చిత్తశుద్ధిలోంచి వస్తాయి. వీటితో పాటుగా సాటి మనుషుల పట్ల ప్రేమ, గౌరవాలు లేకుండా అన్ని శరీరాంగాలు ఉన్నా ఏమి ప్రయోజనం! ప్రభుత్వంలో ఒక స్థాయిలో పనిచేస్తున్న వాళ్లు విజ్ఞతతో మాట్లాడాల్సిన అవసరం ఉంది. 'కనపడే వైకల్యం కన్న, మదిలో వికలత్వం ఉన్న, అదే ప్రమాదకరమన్న' కవి వాక్కులు నిత్యసత్యం.

అందుక్కాదట! ఇందుకట!!

శాసనసభకు రా...రా అంటే వచ్చాడు. కూసున్నడు. మాట్లాడాడు. వెళ్లిపోయాడు. నిన్న రాలేదు. ఈ వ్యాఖ్యలు ఎవరి గురించో ఇప్పటికే అర్థమై ఉంటది. తెలంగాణ ఉద్యమ నేత, మన మాజీ సీఎం కేసీఆర్ గురించే. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించి మూడోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని ఎక్కుతాననే భ్రమల్లో ఉన్న ఆయన పార్టీ ఓటమితో ఊహించిన షాక్‌కు గురయ్యారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్, ప్రతిపక్షనేతగా కేసీఆర్‌కు కొత్త బాధ్యతలొచ్చాయి. కానీ ప్రతిపక్ష నేతగా ఆయన తొలి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. తొలి అసెంబ్లీ సమావేశాలు జరిగినన్నీ రోజులు సభకు కేసీఆర్ ఎందుకు రారు...రావాలి...రావాలి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఆయన రాకుండానే శాసనసభ సమావేశాలు ముగిశాయి. ఆరునెలల తర్వాత రెండో అసెంబ్లీ సెషన్స్ ప్రారంభమయ్యాయి. తొలి రెండు రోజుల సమావేశాలకు కూడా కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదనే చర్చ మొదలైంది. కాంగ్రెస్ సభ్యులు, నాయకులు కూడా సభకు రాని కేసీఆర్‌ను ఎద్దేవా చేయడం ప్రారంభించారు. ఎట్టకేలకూ కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యారు. పదేండ్లలో మీడియా పాయింట్ మొహం చూడని కేసీఆర్... ఏడంతస్తుల మెట్లు దిగి మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంత మొనగాడినైనా నేల చూపులు చూపించగలదు అనే దానికి కేసీఆర్ మీడియా పాయింట్‌కు రావడం ఒక నిదర్శనం. ఆ తర్వాత కూడా ఆయన శాసనసభ సమావేశాలు ముగిసేవరకు ప్రతీ రోజు వస్తారని భావించారంతా. కానీ మరుసటి రోజు హాజరు కాలేదు. కాంగ్రెసోళ్లు విమర్శించినందుకు అసెంబ్లీకి వచ్చారనుకున్నారంతా. కానీ ఆయన సభకు రావడానికి మరో కారణం ఉందట. కాంగ్రెసోళ్లు డిమాండ్ చేసినందుకు ఆయన రాలేదట. ఆయన సభకు రాకపోతే అనర్హత వేటు పడుతుందట. అందుకే ఏదో అట్లా వచ్చి ఇట్లా పోయారు. ఆయన వచ్చింది ప్రభుత్వం పిలిచినందుక్కాదట. అనర్హత వేటును రక్షించుకునేందుకట. ఇలా మీడియా పాయింట్‌లో పాత్రికేయులు గుసగుసలాడుకున్నారు.

-గుడిగ రఘు

'ఆత్మస్తుతి, పరనింద'

"గత సర్కార్ తప్పుల తడక, కుంభకోణాల మయమంటూ విమర్శలు గుప్పిస్తున్నాడు. ఇదంతా చూస్తున్న కార్యకర్తకు అనుమానం వచ్చి తమ నేతను అడిగాడు. సార్ వాళ్లు మనల్ని బండబూతులు తిడుతుంటే ఎలా ఆస్వాదిస్తూ చూస్తున్నారు. ఆయన ఒక చిరునవ్వు విసిరి.. పిచ్చివాడా వాడు తిడుతున్నది నన్ను కాదు, రాజకీయాన్ని అని అన్నాడు. అర్థం కానట్టు చూశాడు కార్యకర్త. నేడు పాలకుడికి ఉండాల్సిన లక్షణాల్లో "ఆత్మస్తుతి పరనింద" ముఖ్యమైనవి. ఇవి లేకుంటే మనం రాజకీయాల్లో మనలేం" అని నాయకుడు కార్యకర్తకు హితబోధ చేశాడు. ఇటీవల తెలంగాణ రాజకీయాల్లో ఇదే పదం బహుళ ప్రాచుర్యం పొందింది. ఎవరికి వారే ఎదుటి పక్షంపై దీన్ని ప్రయోగం చేస్తున్నారు. ప్రత్యర్థులపై రాజకీయ విమర్శనాస్త్రాలు సంధించే క్రమంలో "ఆత్మస్తుతి పరనింద" అనే పదాన్ని అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ఎస్ విరివిగా వాడుతోంది. గత కాలపు పాలన అవినీతిమయమని, సమస్యలను ఏకరువు పెట్టడడం, ప్రతిపక్షాలను తిట్టడం, మన పాలనని మనమే పొగుడుకోవడం, తద్వారా సమస్యని పక్కదారి పట్టించే క్రమంలో అధికార పక్షం ఈ పదాన్ని తరుచూ తమ ఖాతాలో వేసుకుంటున్నది. పదేండ్ల పాలన స్వర్ణ యుగమనీ, తామేమీ తప్పులు చేయలేదనీ, ప్రధాన ప్రతిపక్షం సైతం ఈ పదం యొక్క పేటెంట్ తమదే అన్నట్టు డంకాలు బజాయిస్తున్నది. తెలంగాణ శాసన మండలిలో శనివారం బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఈ పద ప్రయోగమే ఇరు పార్టీల వాదోప వాదాలకు కేంద్ర బిందువైంది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందనీ, దాన్ని గాడిలో పెట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నామనీ, బడ్జెట్లో కాంగ్రెస్ చెప్పడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూధనా చారి "ఆత్మస్తుతి, పరనిందా" అని కోట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఆది మీకే వర్తిస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంతే స్థాయిలో ఎదురుదాడికి దిగారు. "ఆత్మస్తుతి, పరనింద" రెండూ ఆత్మహత్యా సదృశ్యాలే అంటారు పెద్దలు. నిజాల్ని ఒప్పుకొని తప్పులు సరిదిద్దు కోవాలే తప్ప ఎదుటివారిపై తోసేస్తే ఎన్నికలప్పుడు ఈ పదం ఎవరికి వర్తిస్తుందో జనం తేలుస్తారు.

-ఊరగొండ మల్లేశం



జంధ్యాల రఘుబాబు
9849753298

"యాదగిరీ విన్నావా, త్వరలో సముద్రం మన హైదరాబాదు సిటీలో ప్రవహిస్తుందట" అని దస్తగిరి అంటూ ఉంటే దాన్ని మధ్యలో ఆపి అందుకున్నాడు యాదగిరి

"అరే సముద్రమెక్కడన్నా ప్రవహిస్తుందా, ఉన్నచోటే ఉంటుంది" అని సమాధానమిచ్చాడు. అయినా దస్తగిరికి మనసులో ఏదో అసంతృప్తి.

"అది కాదు యాదన్నా, మన నాయకుడు సముద్రంలో భాగమడిగాడు కదా, ఒకవేళ ఇచ్చారే అనుకో అప్పుడు సముద్రం మన ఎత్తిపోతల పథకాల్లా మనకు రాదూ?" అనేసరికి యాదగిరికి ఇంకా కోపమొచ్చింది.

"ఓ నా పిచ్చి దస్తగిరి, ఆ ఉప్పునీరు తెప్పించుకొని మనమేం చేస్తాం చెప్పు? ఆ సముద్రం మీద చేసుకునే వ్యాపారంలో మనకూ వాటా అడిగాడురా మన ముఖ్యమంత్రి" అనేసరికి,

"అంతేనంటావా నేను సముద్రమే మనకొస్తుందను కుంటున్నా "

"అలా పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసుపాడు చేసుకోవద్దు కాని, ఆ సముద్రంలో ఎంత నీరు వృథాగా పోతోందో దానిమీద పెట్టు దృష్టి" యాదగిరి

"....???" దస్తగిరి

"అదిగో పులి అంటే ఇదిగో తోక అనేవిధంగా ఉండొద్దు దస్తగిరీ. జర ఆలోచన చేయి. నిజంగా మనకేమి కావాలి? మనకేమి ఇస్తున్నారు ఈ నాయకులు అన్నది చూడు. అప్పుడన్నీ క్లియర్‌గా వినిపిస్తాయి, కనిపిస్తాయి"

"సరే యాదన్నా....."

****

నీరు...కన్నీరు

నాలుగు రోజుల ముందు పేపర్లో వచ్చిన "చంద్రుడిపై నీరు" అన్న వార్త బాగా ఆకర్షించింది. నిజం చెప్పుకోవాలంటే ఆ నీటిని మొదట ఆకర్షించింది మన భూమి. కొన్ని కోట్ల సంవత్సరాలు గడ్డకట్టి ఉన్న ఆ నీరు ఏర్పడ్డాకనే ఇక్కడ జీవం మొలకెత్తింది. ఏక కణ జీవులు, బహుకణ జీవులైన అమీబాలు, హైడ్రాలు, మాసు, ఫెర్ను లాంటి మొదటి తరం మొక్కలు ఈ నీటివల్లే జీవం పోసుకున్నాయి. ఈ సృష్టినంతా భగవంతుడు సృష్టించాడు అన్నది ఆ నీటి చరిత్ర చూస్తే మనకు తెలిసిపోతుంది.



'నీరు పల్లమెరుగు నిజం రాజకీయం ఎరుగు' అని పాత సామెతల్ని, జాతీయాల్ని తిరగరాయాల్సిన సమయం. నిజంగానే నీటికి పల్లమెటో తెలుసు కాబట్టి సముద్రంలోకి పోతూనే ఉంటుంది. కీచులాడుకునే అన్నదమ్ములు పిల్లులు రొట్టె కథలో లాగ, నాకెక్కువ కావాలని కోతి దగ్గరికి పోయినట్టు కేంద్ర సంస్థల దగ్గరికి పోయి మొరపెట్టుకుంటే వాళ్లు స్పందించేలోపు సముద్రుడు మంచి నీటిని తనలో కలిపేసుకునే ఉంటాడు. భూమి మీద ఉన్న నీళ్లని సరిగ్గా వాడుకోవడం చేత కాదు కాని అక్కడెక్కడో మన ఉపగ్రహం చంద్రుడి మీద, ఇంకో గురుగ్రహం మీద నీళ్లున్నాయా అని



పరిశోధనలు చూసి ఆశ్చర్యం కలుగుతుంది. ఐతే మన ఖగోళ శాస్త్రానికి సంబంధించిన సమాచారము, విషయ పరిజ్ఞానము కూడా మనిషికి అవసరమే. అయితే మొదట మన భూ గ్రహాన్ని కాపాడుకోవడం కూడా భూమిమీద బతుకుతున్న మనందరిదీ. ముఖ్యంగా అన్ని దేశాల ప్రభుత్వాలది, నాయకులది.

నదుల నీటిని సరిగా వాడుకోలేక పోయిన నాయకులను ఇంతకుముందు చూస్తే, ఆ సముద్రంలో నాకూ భాగముందని అరిచే నాయకుల "గొడవ" నేడు చూస్తున్నాం. నిజంగా అంత జాతీయతా భావం చూస్తే సంబురమేస్తుంది మనసులో. అలాగే ఫలానా గుళ్లో, దాని ఆదాయంలో తమ్ముడిగా వాటానడిగితే అవతలినుండి చార్‌మీనారు, నీ దగ్గర ఉన్న దేవుడి గుళ్లు, హైటెక్కు సిటీ, రవీంద్ర భారతి ఇలా చిట్టా ఇచ్చి వాటిలో నా వాటా కూడా తేల్చు అనే ప్రమాదముంది. కాస్త వాళ్ల గొడవ కూడా చూడాలి నాయకుడంటే. ఈపాటికే హైటెక్కు సిటీ కట్టించింది నా ముందు చూపేనని పెద్దాయన అంటూనే ఉంటాడు. ఇలా ఈ చర్చలు జరుగుతూనే ఉంటాయి, వర్షాలు పడుతూనే వుంటాయి, నదులు పారుతూనే ఉంటాయి, సముద్రం మన నాయకుల మూర్ఖత్వం చూసి నవ్వుతూనే ఉంటుంది. అప్పుడు నీరు కాదు, కన్నీరే మిగిలేది. వర్షాకాలంలో నీరు పారినట్టు, ప్రవాహంలా మారినట్టు ఎన్నికలప్పుడు కూడా వరదలా మాటలు ఎగిసిపడతాయి, మర్యాదల ఆనకట్టలు దాటి ప్రవహిస్తాయి. తరువాత అంతా ఉత్తుత్తిదే అన్నట్టు.

"కళ్లలో ఉన్నదేదో కన్నులకే తెలుసు, రాళ్లలో ఉన్న నీరు కళ్లకెలా తెలుసు, నాలో ఉన్న మనసు నాకు గాక ఇంకెవరికి తెలుసు" అని అంతులేని కథ చిత్రంలో ఆత్రేయగారు రాసిన పాట ఎలా ఉన్నా ఇప్పుడు సముద్రంలో కలుస్తున్న నీటి లెక్కలు మాత్రం నాయకులకు బాగా తెలుసు. ఒక పక్క భూమి వాతావరణం వేడెక్కి పోతుండంటూనే ఇలా వృథాగా పోతున్న నీటితో ఎన్ని చెట్లు నాటచ్చునన్న విషయం కూడా లెక్కవేసి చూసుకోవచ్చు. కానీ ఆ విషయం రాజకీయ లెక్కలముందు తేలిపోతోంది. అదే సమస్య. ఒక సమస్య బబుల్‌గంలా సాగుతూ ఉంటేనే వాళ్ల రాజకీయ జీవితం సాగుతూ ఉంటుందన్నది వాళ్లెరిగిన సత్యం.

ప్రజలకు తెలిసిన సత్యాలు కొన్ని ఉంటాయి. వాళ్ల బాగు అంటే ప్రజలందరి బాగు కోరుకుంటారు. వీళ్ల పోతే వాళ్లు, వాళ్ల పోతే ఇంకొకరు అని మంచి చేసేవారు రాకుండా ఉంటారా అని వేచి చూసే దాతృత్వం ప్రజలది. అలాగని వాళ్లను విస్మరించి తమ ఇష్టమొచ్చినట్టు ఆడితే వాత ఎప్పుడు పెట్టాలో అప్పుడు పెడతారు. కీలెరిగి వాత పెట్టడం కూడా వారికి తెలుసు. ■

> ఈపాటికే హైటెక్కు సిటీ కట్టించింది నా ముందు చూపేనని పెద్దాయన అంటూనే ఉంటాడు. ఇలా ఈ చర్చలు జరుగుతూనే ఉంటాయి, వర్షాలు పడుతూనే వుంటాయి, నదులు పారుతూనే ఉంటాయి, సముద్రం మన నాయకుల మూర్ఖత్వం చూసి నవ్వుతూనే ఉంటుంది. అప్పుడు నీరు కాదు, కన్నీరే మిగిలేది. వర్షాకాలంలో నీరు పారినట్టు, ప్రవాహంలా మారినట్టు ఎన్నికలప్పుడు కూడా వరదలా మాటలు ఎగిసిపడతాయి, మర్యాదల ఆనకట్టలు దాటి ప్రవహిస్తాయి. తరువాత అంతా ఉత్తుత్తిదే అన్నట్టు.



త్రివేణి పాఠశాలలో ఆషాడ మాసం బోనాల పండుగ వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

ఆషాడ మాసం సందర్భంగా త్రివేణి పాఠశాలలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి బోనాలతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాల్లో అత్యంత ప్రముఖమైన పండుగలో బోనాలు పండుగ విశిష్టమైందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతులు, సాంప్రదాయాల విలువలు విద్యార్థిని విద్యార్థులకు తెలపడం ఎంతో ఆవశ్యకమని, తెలంగాణ జీవన విధానంలో బోనాలు పండుగ ఒక భాగమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా ,శ్రీదేవి , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెజోనెన్స్‌లో హెన్నాజోల్ వేడుకలు

నవతెలంగాణ ఖమ్మం

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజోనెన్స్ స్కూల్లో ఆషాఢ మాసం సందర్భంగా హెన్నాజోల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో తెలుగువారందరూ ఎంతో ఇష్టంగా గోరింటాకు పెట్టుకుంటూ కుటుంబ సభ్యులందరితో ఆనందాన్ని పంచుకుంటారు. మెహందీ తెలుగు వారి సంస్కృతి, సాంప్రాదాయల్లో ఒక భాగంగా ఉన్నదంటూ అలాంటి మెహందీని విభిన్న ఆకృతులలో కళాత్మకంగా పెట్టుకొని రంగురంగుల దుస్తులలో వచ్చి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల విలువలను విద్యార్థులలో పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు 'రాయల'కు సన్మానం



నవతెలంగాణ - ఖమ్మం :

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన రాయల నాగేశ్వరరావు అభినందన సభ స్థానికంగా ఉన్న ఓ రిసార్ట్స్ లో ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్న రాయల నాగేశ్వరరావును ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించనున్నామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఉప్పునూతల వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి దొడ్డ రాకేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షులు నరేష్ మోహన్ నాయుడు ఆధ్వర్యంలో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సమావేశం త్రీ టౌన్ ప్రాంతంలోని లారీ యూనియన్ ఆఫీస్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుమ్మల యుగంధర్, సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటేశ్వర రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పాషా, సెక్రటరీ గజ్జి సూరిబాబు, లారీ యూనియన్ ఆఫీస్ కన్వీనర్ దగ్గు శ్రీనివాసరావు, కోశాధికారి ఉమామహేశ్వరరావు , జాయింట్ సెక్రటరీ రంజాన్ పాల్గొన్నారు.



రాటకొండ హైమావతి ఆశయ సాధన కోసం పోరాడుతాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవ తెలంగాణ ఖమ్మం కార్పొరేషన్

సీపీఐ(ఎం) సభ్యురాలు రాటకొండ హైమావతి ఆశయ సాధన కోసం పోరాడుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. ఇటీవల కాలంలో ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబం మొత్తం పార్టీలో కార్యకర్తలుగా మరియు సానుభూతిపరులుగా ఉంటున్నారని ఎర్రా శ్రీకాంత్ అన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసినివాళి అర్పించారు. ఆమె కుటుంబానికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, ఆర్.ప్రకాష్, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) పట్టణ నాయకులు వాజేనేపల్లి శ్రీనివాసరావు, ఎస్కే బాబు, ఎస్కే సైదులు, బివికే వాసిరెడ్డి వీరభద్రం పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కార్యదర్శి విశేష కృషి

నవతెలంగాణ-కల్లూరు

విధుల్లో సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందిస్తే ఆ ఉద్యోగి ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో నిలుస్తారని, కార్యదర్శిగా శ్రీనివాస్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు కొనియడారు. శనివారం మండల పరిధిలో కొర్లగూడెం గ్రామ కార్యదర్శిగా ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీ కావడంతో మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. బైరెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో చంద్రశేఖర్ విచ్చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేష్ బాబు, మాజీ ఉపసర్పంచ్ చిత్తలూరి నాగేశ్వరరావు, సొసైటీ వైస్ చైర్మెన్ పాపర్తి సిద్ధు కృష్ణ, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఐకెపి ఏపిఎం వెంకట రామారావు, సహాయ వ్యవసాయ అధికారిని అనూష, ఉపాధి హామీ జేఈ పుల్లారావు, నాయకులు చాట్ల సునీల్, కోట సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ చాట్ల సుధాకర్, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం జీపీకి అప్పగింత

కొర్లగూడెం గ్రామంలో అన్ని వర్గాలలోను ఎవరైనా చనిపోయినప్పుడు వారిని తీసుకువెళ్లేందుకు ప్రముఖ వైద్యులు మానవతావాది సురపురెడ్డి సీతారామిరెడ్డి వారి తల్లిదండ్రులు సూరపరెడ్డి వెంకయ్య, సురపరెడ్డి సీతారావమ్మ జ్ఞాపకార్థంగా సుమారు నాలుగు లక్షల రూపాయల విలువ కలిగిన వైకుంట రథమును ఎంపీడీవో చంద్రశేఖర్ సమక్షంలో గ్రామ పంచాయతీకి అప్పగించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఎవరికి దక్కేనో ?

- ముందు వరుసలో సూరంశెట్టి కిషోర్ ?
- పోటీలో పలువురు ఆశావహులు
- రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల పోటీలో పలువురు

నవతెలంగాణ - బోనకల్

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మధిర మండలం మర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కుమార్ ను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. అయితే ఈసారి ఎర్రుపాలెం మండలానికి చైర్మెన్ పదవి ఇవ్వాలని ఆ మండల బీసీ కాంగ్రెస్ నాయకులు గట్టిగా పట్టుపడుతున్నట్లు తెలిసింది. మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో భట్టి విక్రమార్కకు ఎర్రుపాలెం మండలమే మెజార్టీ సంపాదించి పెట్టింది. అయితే కిషోర్‌తో పాటు బండారు నరసింహారావు, చిదిరాల వెంకటేశ్వరరావు, చావల రామరాజు కూడా పోటీలో ఉన్నట్లు తెలిసింది.

మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల నుంచే చైర్మెన్ పదవిని భర్తీ చేయవలసి ఉంది. ఈ మూడు మండలాల పరిధిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన సూరంశెట్టి కిషోర్ కుమార్ గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడిగా ఉంటూ వస్తున్నారు. కిషోర్ కుమార్ తండ్రి నాగభూషణం గతంలో కాంగ్రెస్ మధిర మండల జడ్పిటిసిగా పని చేశారు. కిషోర్ కుమార్ కుటుంబం ప్రారంభం నుంచి కాంగ్రెస్ లోనే ఉంటూ వస్తుంది. భట్టి విక్రమార్కకు కిషోర్ కుమార్ అత్యంత ఆప్తుడు. పది సంవత్సరాల పాటు కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా కిషోర్ కుమార్ కాంగ్రెస్‌ను అంటిపెట్టుకొని మధిర మండలంలో కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ వచ్చారు. దీంతో కిషోర్ కుమార్‌కు మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అందరికంటే ముందు వరుసలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కిషోర్ కుమార్ పేరును ఖరారు చేసినట్లు అధికారికంగా ప్రకటించవలసి ఉందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం పాలకవర్గం పదవీ కాలాన్ని ఏడాది నుంచి రెండు సంవత్సరాలకు పెంచింది. దీనికి తోడు ఆరేసి నెలల చొప్పున రెండుసార్లు పదవీ కాలాన్ని పెంచుతూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఉంది. ఈ ఉత్తర్వుల ప్రకారం చైర్మెన్ గా నియమించబడిన వ్యక్తి మూడు సంవత్సరాలు పాటు ఆ పదవుల్లో ఉండే అవకాశం ఏర్పడింది.

అదేవిధంగా పలు దేవాలయ కమిటీలకు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పదవులు ఆశిస్తున్న నాయకులు సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. మధిర నియోజక వర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, పైడిపల్లి కిషోర్ కుమార్, మొండితొక సుధాకర్, కోటా రాంబాబు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు రాష్ట్ర స్థాయి పదవులు దక్కించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా గట్టిగా చేస్తున్నారు. మధిర నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పదవి దక్కుతుందా? ఒకవేళ దక్కితే ఆ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం.

వ్యవసాయ కార్మికులకు కూలిరేట్లు పెంచాలి

- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్
- వ్యకాస ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు కూలిరేట్లు పెంచాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మదర్ థెరెసా టెక్నో స్కూలులో వ్యకాస ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్‌తో పాటు వ్యకాస జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ కూలిరేట్లు పెంచుతామని వాగ్దానం చేసిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆ వాగ్దానాల అమలుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. వ్యవసాయ కూలిపనులు తగ్గుతున్న తరుణంలో ఉన్న పనులకు కూడా గిట్టుబాటు కూలిరాక వ్యవసాయ కూలీల కుటుంబ జీవనం అస్తవ్యస్తంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు యేడాదికి రూ. 12వేలు ఇస్తామని, యేడాదిలో 150రోజులు పనిదినాలు కల్పిస్తామని, కూలి వేతనం రూ. 400లుగా నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం ఆచరణలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు మోరంపూడి పాండురంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు



చంద్రశేఖర్, రైతుసంఘ జిల్లా నాయకులు రావుల రాజబాబు, మాల మహానాడు నాయకులు సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు, సింగరేణి నాయకులు రమణ, ప్రకాశ్, ఐద్వా నాయకురాళ్లు జాజిరి జ్యోతి, పాకలపాటి ఝాన్సీ, కుమారి, కవిత, వ్యకాస మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, సనందనరావు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి త్రిమూర్తి, రఘు పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యత ఇవ్వని కేంద్ర రాష్ట్ర బడ్జెట్

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో యువతకు ప్రాధాన్యత లేకుండా దేశం అభివద్ధి ఎలా అవుతుందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. శనివారం ఖమ్మంలోని టూ టౌన్ ప్రాంతంలో 49, 50వ డివిజన్ల కార్యకర్త సమావేశం యాట రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బషీరుద్దీన్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం పైగా యువత ఉంటే యువతకు పని కల్పించకుండా దేశం ఎలా అభివృద్ధి అవుతుందని ప్రశ్నించారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, ఖేల్ ఇండియా నినాదాలు ఎటుపోయాయని, వాటికి బడ్జెట్లో ఎందుకు నిధులు సరిగా కేటాయించలేదని ప్రశ్నించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ హామీ ఎటు పోయిందని, ఉద్యోగాలు ఇవ్వాలంటే బడ్జెట్లో నిధులు కేటాయించాలి కదా అని ప్రశ్నించారు. కనీసం ఉపాధి కోసమైనా బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చేతులు దులుపు వేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్లో కూడా యువతకు నిరాశ మిగిలిందని యూత్ డిక్లరేషన్ పేరుతో అధికారం రాకముందు ప్రచారం చేసిన కాంగ్రెస్



అధికారం వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని ఆయన అన్నారు. నిరుద్యోగ భృతి ఏమైందని, జాబ్ క్యాలెండర్ హామీ ఎటు పోయిందని, యూత్ కమిషన్, ఉపాధి మార్గాలు ఎటుపోయాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ నిర్మల సీతారాం, రాష్ట్ర బడ్జెట్ బట్టి విక్రమార్క కేవలం అంకెల గారిడితో యువతను మోసం చేశారని అన్నారు. యువత దీనిపై స్పందించాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా ఉపేందర్ నాయక్ మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కొర్లపూడి రాజేష్, 49 50వ డివిజన్లో కార్యకర్తలు వెంకన్న, నాగులు, పుష్ప రాజ్, నవీన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

విద్యాశాఖ అధికారికి వినతి పత్రం

నవతెలంగాణ-తల్లాడ



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేసి, మండల విద్యాశాఖ అధికారి నిమ్మకంటి దామోదర్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ జిల్లా నాయకులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం నుండి రావలసిన మెనూ చార్జీలు ఇంతవరకు రాలేదన్నారు. గత ఎనిమిది నెలలుగా పెండింగ్లో ఉన్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను ప్రతి పిల్లవాడికి రూ.25లు ఇవ్వాలని, వంటగ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంట పాత్రలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా 10 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు వెంకటమ్మ, పద్మ, మరియమ్మ భాగ్యవతి, నక్షత్రం, లక్ష్మి, కనకమ్మ శిరోమణి వెంకటమ్మ, విమల, టి.రాణి, తదితరులు పాల్గొన్నారు.

కంటతడిపెట్టిన మంత్రి తుమ్మల

- జక్కంపూడి కృష్ణమూర్తికి నివాళి
- అసెంబ్లీ నుండి హుటాహుటిన తరలివచ్చిన తుమ్మల

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని బిల్లుపాడుకు చెందిన జక్కంపూడి కృష్ణమూర్తి అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీ సమావేశాల నుండి హుటాహుటిన బయలుదేరి బిల్లుపాడు చేరుకొని మిత్రుని కడసారి చూసి, విలపించారు. కృష్ణమూర్తి, తుమ్మల నాగేశ్వరరావుకు ఆప్త మిత్రుడు. తెలుగుదేశం ఆవిర్భావంతో ఒకే సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటినుండి జక్కంపూడి తుమ్మల, ఆర్‌వి మంచి స్నేహితులుగా ఉండేవారు. కొంతకాలం తర్వాత ఆర్‌వి తుమ్మలకు దూరమైన, జక్కంపూడి తుమ్మల స్నేహం కడవరకు కొనసాగింది. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. కడవరకు తుమ్మల వెంటే ఉన్నారు. జక్కంపూడి పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్



కొండ బాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, బీఆర్ఎస్ జోనల్ చైర్మెన్ దిశాల దాసు రావు, గుత్తా వెంకటేశ్వరరావు, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, నల్లమల్ల వెంకటేశ్వరరావు, నివాళులర్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్

నవతెలంగాణ-ఖమ్మం లీగల్



న్యాయస్థానాల్లో జరుగుతున్న కేసుల విచారణ ప్రక్రియలో వీడియో కాన్ఫరెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం న్యాయమూర్తి పోలీసు, ఎక్సైజ్, జైలు అధికారులు, న్యాయమూర్తులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల అమలు నిమిత్తం పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కోర్టులు జారీ చేసిన నాన్ బెయిల్ వారెంట్లను పోలీసుల సకాలంలో అమలు చేసి కేసుల సత్వర విచారణకు సహకరించాలని అన్నారు. జైళ్లలో మగ్గుతున్న విచారణ ముద్దాయిల కేసులలో సంబంధిత పోలీసు అధికారులు సత్వరం చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. కె.ఉమాదేవి, కె.దీప, బి.రజిని, వై.బిందుప్రియలతో పాటు పోలీసు ఎక్సైజ్, జైలు అధికారులు పాల్గొన్నారు.



నేడు ముదిగొండ భూపోరాట అమరుల 17వ వర్ధంతి

నవతెలంగాణ-ముదిగొండ

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముదిగొండ భూపోరాట అమరుల 17వ వర్ధంతి సభను ముదిగొండ అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఆదివారం నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2007 జూలై 28న సీపీఐ(ఎం) పార్టీ పిలుపు మేరకు పేద ప్రజలు ఇండ్లు, ఇంటి స్థలం కావాలని, జానెడు జాగా కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పేదలపై ఆనాటి సీఎం రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్‌లు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి ఏడుగురు పేదలను పొట్టనపెట్టుకొని, 16 మందిని గాయాలపాలు చేసిందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే వర్ధంతి సభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్ పాల్గొంటారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

క్రీడల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

పాఠశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే క్రీడలలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎర్రుపాలెంలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వలె బాల బాలికులకు మండల స్థాయిలో కబడ్డీ- ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించాలని అన్నారు. ఎర్రుపాలెం ఉన్నత పాఠశాలలో క్రీడలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, క్రీడల చేయూత సభ్యులు దండెం సత్యనారాయణ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, జమలయ్య, సాంబశివారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నాగేశ్వరరావు, షేక్ అజీమ్, త్రిపుర, రవికుమార్, జహీర, పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ధరణిలో తలెత్తుతున్న భూ సమస్యలను ఏ రీతిగా పరిష్కరిస్తున్నారని అదనపు జాయింట్ కలెక్టర్ మధు సూదన్ నాయక్ తహసీల్దార్ మన్నే ఉషా శారదను అడిగి తెలుసుకున్నారు. ఎర్రుపాలెంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. వీలు ఉన్నంతవరకు రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. తొలుత జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవి, సర్వేయర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పంచామృతాలతో అభిషేకం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో సర్వంగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి పట్టు వస్త్రాలు ధరింపచేసి పూల మాలలు అలంకరింపజేసి అంగరంగ వైభవంగా అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శనివారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారి ఆలయంతో పాటుగా అన్ని ఉప ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మహిళా భక్తులు పొంగళ్ళు చేసి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఎదుట నివేదన చేసి స్వామివారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీ అలివేలు మంగ పద్మావతి దేవేరాలతో స్వామివారికి భక్తుల సమక్షంలో భక్త కళ్యాణ కార్య క్రమాన్ని కొరవి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహనరావు, ఆలయ పర్యవేక్షకురాలు కె.విజయ కుమారి, ఆలయ సిబ్బంది, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

రూ.6వేలు కడితే.. రూ. 1లక్ష రుణం..?

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

రూ. 6వేలు కడితే 8 శాతం వడ్డీ చొప్పున రూ.1లక్ష రుణం మంజూరు చేస్తామని, వడ్డీని ప్రతినెలా కడుతూ.. అసలు 5 ఏళ్లలో ఎప్పుడైనా కట్టుకోవచ్చని చెబుతూ పేద, మధ్యతరగతి ప్రజలు నుంచి కొన్ని రోజులుగా ఓ సంస్థకు చెందిన వ్యక్తులు డబ్బులు కట్టించుకుంటున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఓ సంస్థకి చెందిన ఏజెంట్లు మండలంలో పలు గ్రామాల్లో ప్రజలను కలిసి పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు ఆసరాగా ఉంటాయని, వారికి ఆశ కల్పించారు. దీంతో తాము బయట రూ.2 నుంచి రూ.5ల వరకు వడ్డీకి డబ్బులు తెచ్చుకుంటున్నామని, తక్కువ వడ్డీకి డబ్బులు వస్తాయనే ఆశతో కొంత మంది ముందుకు వచ్చి ఆ స్కీంలో జాయిన్ అయ్యారు. అయితే ఇక్కడ ప్రజలు కట్టిన రూ.6 వేలకు ఎటువంటి రశీదు ఇవ్వడం లేదు. సంస్థకు 6 వేలు డబ్బులు చెల్లించినట్లు ప్రజల వద్ద ఎటువంటి ఆధారం కూడా లేదు..

బోగస్ సంస్థల మాటలు నమ్మవద్దు- డీవైఎఫ్ఐ

మాయమాటలు చెప్పి ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసే బోగస్ సంస్థల మాటల నమ్మవద్దని భారత ప్రజాతంత్ర యోజన సమైక్య కం(డీవైయఫ్ఐ) ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు జక్కంపూడి కృష్ణ ప్రజలను కోరారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే సంస్థలలో ఎటువంటి పెట్టుబడులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఇలాంటి బోగస్ సంస్థల మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రధానోపాధ్యాయులు జానుమియాకు ఘన సన్మానం

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ఎంపీపీఎస్ చిరుమర్రి (ఎస్సీ కాలనీ)కి ప్రధానోపాధ్యాయులు ఎస్కె జానీమియ బదిలీలో భాగంగా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి పాఠశాలకు వెళుతున్న సందర్భంగా శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎన్వికె ప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎస్కె నాజర్, పి.సుమలత, సిఆర్పి జి.ప్రవీణ్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐబీ కార్యాలయంలో 'కోనోకార్పస్' మొక్కల తొలగింపు

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రజల ఆరోగ్యాలను హరించే కోనో కార్పస్ మొక్కలను తొలిగించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇచ్చిన పిలుపు మేరకు గతంలో పట్టణ పరిధిలో నాటిన అయా మొక్కలను తొలగించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే గత వారం రోజులుగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏపుగా పెరిగిన కోనో కార్పస్ మొక్కలను మున్సిపల్ సిబ్బంది దాదాపుగా తొలగించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల పరిధిలో ఉన్న మొక్కలను తీసేసే కార్యక్రమం ఇంకా కొనసాగుతోంది. ఇదే క్రమంలో ఎమ్మెల్యే పిలుపునందుకున్న స్థానిక నీటిపారుదలశాఖ అధికారులు తమ కార్యాలయ ఆవరణలో ఉన్న కోనో కార్పస్ మొక్కలను ఈఈ సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శనివారం తొలగించారు. తొలగించిన మొక్కల స్థానంలో వేరే రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సంపతి వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సీఐ కిరణ్

పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తుపల్లి సీఐ కిరణ్ పేర్కొన్నారు. శనివారం ఆయన సత్తుపల్లి బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్టును డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో మహిళలు, విద్యార్థినిల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లయితే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. బస్టాండ్‌లో దొంగతనాలు జరగకుండా చూసేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఉపయోగపడుతుందన్నారు. దొంగతనాల నివారణకు, ఆకతాయిల ఆట కట్టించేందుకు పోలీసు అవుట్ పోస్టు ఉపయోగపడుతుందని డిపో మేనేజర్ రాజలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయ శ్రీ, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి ఏడీసీలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సమస్యలకు కేరాఫ్‌గా సంక్షేమ వసతి గృహాలు

- 34 రూపాయలతో రెండు పూటల భోజనమా..?
- పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్లో అధ్యయన యాత్రలు
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం



సమస్యలకు కేరాఫ్ అడ్డాగా సంక్షేమ వసతి గృహాలు నెలకొన్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2 500కు పెంచాలని, పాకెట్ మనీ 1000 రూపాయలు ఇవ్వాలని, జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్ సమస్యలపైన అధ్యయన యాత్రలు నిర్వహిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ తెలిపారు. శనివారం ఖమ్మంలోని ఎస్సి హాస్టల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, ప్రస్తుతం ఉన్న మెనూను సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు సరైన పోషకాహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్లో సురక్షిత మంచినీటి సౌకర్యం లేదని, నల్లా నీళ్లు తాగుతున్నారన్నారు. దోమల నివారణకు దోమ తెరలు, కిటికీలకు జాలీలు లేకపోవడంతో దోమలు విపరీతంగా కుడుతున్నాయని విద్యార్థులు సర్వేలో వాపోయారు. బాలుర ఆనంద నిలయంలో గదులు కురుస్తున్నాయని, బాలికల ఏ హాస్టల్‌లోని గదులలోని స్లాబులు లీకై నీటి చెమ్మ వచ్చి కురుస్తూ విద్యార్థినులకు కరంటూ షాక్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. అదనపు గదులను, డైనింగ్ హాళ్లను నిర్మించాలన్నారు. అన్ని హాస్టల్లో క్వాలిఫై ట్యూటర్‌లను తక్షణమే నియమించాలని, విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్‌ను, ఆట వస్తువులను వెంటనే ప్రభుత్వం అందించాలన్నారు. హాస్టల్లో ఉదయం పూట పెట్టాల్సిన టిఫిన్ ప్రతిరోజు కిచిడీ మాత్రమే పెడుతున్నారని, కనీసం ఇడ్లీ, వడ, పూరి, దోష వంటి టిఫిన్లకు విద్యార్థులు నోచుకోవట్లేదని విమర్శించారు. విద్యార్థులకు సన్న బియ్యం వండటం లేదని, నాసి రకమైన బియ్యం, సరుకులతో చాలిచాలని ఆహారాన్ని అందిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం లేకపోవడంతో చదువులపై దాని ప్రభావం పడుతుందన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులు హాస్టళ్లను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని, స్థానిక హాస్టల్స్ సమస్యలన్నీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపుదలకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలన్నారు. హాస్టల్‌కు ప్రభుత్వ వైద్యాధికారులు నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ సమస్యల సాధనకై జిల్లావ్యాప్తంగా సర్వేలు చేసి భవిష్యత్ కార్యాచరణ, దశల వారిగా పోరాటాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల సాగర్, నాయకులు గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

అప్పల కుప్పకు రైతును రాజు చేశారు

- సిద్ధాంత నిబద్ధతకు కట్టుబడి కార్యకర్త లాలయ్య
- ఆకాల మృతి తీరని లోటు
- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, పీ.సోమయ్య

నవతెలంగాణ-కారేపల్లి



రైతును రాజు చేస్తామని ఎన్నికల అవసరానికి హామీలు గుప్పించి గద్దెనెక్కిన తర్వాత రైతును అప్పుల కుప్పకు రాజును చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పీ.సోమయ్య, అన్నారు. ఇటీవల ఇంజక్షన్ వికటించి మృతి చెందిన రేపాకుల లాలయ్య సంస్మరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ వ్యవసాయం సబ్సీడీలు తగ్గిపోయి, వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు వ్యవసాయం విడిచివేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మారుతున్న రైతు సమస్యలకు పరిష్కారం లభించటం లేదన్నారు. మాణిక్యారం శాఖ కార్యదర్శిగా అందిరిని మెప్పించి, ఒప్పించి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన అమరజీవి రేపాకలు లాలయ్య సైతం వ్యవసాయంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని గిట్టుబాటు కాక వాచ్ మెన్‌గా ఉండాల్సి వచ్చిందన్నారు. సీపీఐ(ఎం) కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సిద్ధాంత నిబద్ధతకు కట్టుబడి కార్యకర్త లాలయ్య అని కొనియాడారు. శాఖ కార్యదర్శిగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించటంలోను, పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అందరితో కలివిడిగా ఉంటూ పార్టీ ప్రత్యార్థులను మెప్పించే సామర్థ్యం లాలయ్య సొంతమన్నారు. లాలయ్య మృతి కుటుంబానికేకాక పార్టీకి తీరని లోటన్నారు. లాలయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుదన్నారు. పోతర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, జిల్లా నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, మండల నాయకులు వజ్జా రామారావు, రేగళ్ల మంగయ్య, దాసరి మల్లయ్య, పండగ కొండయ్య, కే.ఉమావతి, కరపటి సీతారాములు, దమ్మాలపాటి ప్రభాకర్, గ్రామ పెద్దలు మేకల వీరన్న, శివలింగం, ఈదర కోటేశ్వరరావు, భూక్యా రంగారావ్, అజ్మీర శోభన్‌నాయక్, రాజు, వీరబాబు, లాలయ్య కుటుంబ సభ్యులు భార్య వీరమ్మ, కూతురు నవ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సెల్ఫ్ మేనేజ్మెంట్ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- బీ హాస్టల్‌కు చుట్టూ ప్రహరీ నిర్మించాలి
- గిరిజన వసతి గృహాలను సందర్శించిన గిరిజన సంఘం నేతలు

నవతెలంగాణ-ఖమ్మం



గిరిజన సెల్ఫ్ మేనేజ్మెంట్ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని, బీ హాస్టల్‌కు చుట్టూ ప్రహరీ నిర్మించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, డివిజన్ కార్యదర్శి భూక్యా కృష్ణ నాయక్, గిరిజన సంఘం నగర నాయకులు భూక్యా ఉపేందర్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని ఎన్ఎస్పి క్యాంప్‌లో ఉన్న గిరిజన విద్యార్థుల సెల్ఫ్ మేనేజ్మెంట్ హాస్టల్‌లో ఉన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మిషన్ భగీరథ ద్వారా అందుతున్న తాగునీరు కలుషితంగా ఉందని, వెంటనే గిరిజన శాఖ అధికారులు ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తగిన స్థాయిలో గదులలో ఫ్యాను లేవని, వంట మనుషులు తగిన స్థాయిలో నియమించాలని, వెంటనే స్థానిక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆగస్టు 9న గిరిజన భవన్‌లో జరిగే ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం ను కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గిరిజన సంఘం హాస్టల్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం గిరిజన సంఘం హాస్టల్ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మాలోత్ శ్యామ్, భూక్యా గాంధీలను ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు భూక్యా గాంధీ నాయక్, మాలోత్ శ్యామ్, కారం ప్రశాంత్, పాల్ ప్రకాష్, ఎం.శ్రీను, ఇస్లావత్ వెంకటేష్, బారిన వెంకట్, ధరావత్ మోహన్, భూక్యా హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం
- విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు తప్పవు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్

నవతెలంగాణ-ముదిగొండ

విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ చూపిస్తూ బడ్జెట్లో నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో విద్యారంగంపై చూపిన వివక్షతను నిరసిస్తూ జూనియర్ కళాశాల నుండి ర్యాలీ నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర 2023-24 బడ్జెట్లో విద్యారంగానికి 7.6 శాతం నిధులు కేటాయిస్తే 2024-25 బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7.3 శాతం నిధులే కేటాయించిందన్నారు. 2.91 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం విద్యారంగానికి 21,292 కోట్లు (7.3 శాతం) మాత్రమే కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 8,243 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలున్నాయని, విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపు గురించి బడ్జెట్లో ప్రస్తావనే లేదని, పెండింగ్లో ఉన్న మధ్యాహ్న భోజనపథకం బిల్లులు, రాష్ట్ర యూనివర్సిటీలకు రూ .500 కోట్లు మాత్రమే కేటాయించారని, రూ 500 కోట్లు కేవలం యూనివర్సిటీ సిబ్బంది వేతనాలు, పెన్షన్లు, నియామకాలకే సరిపోతాయని, ప్రగతి పద్దు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంతభవనాలు ఏర్పాటు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సంక్షేమ వసతి గృహాలలో కనీస సౌకర్యాలు గురించి, బడ్జెట్ సమావేశాల్లో కనీసం చర్చించడంలేదని, ఇటువంటి అనాలోచిత చర్యలతో రాష్ట్ర ప్రభుత్వము విద్యారంగానికి తీరని అన్యాయం చేసిందని పీ. సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పురిమెట్ల సాయిరాం, నాయకులు బంక శ్రీచరణ్, బొడ్డు అఖిల్, వినయ్, మధునాయక్, నవీన్, ప్రసాద్, నాగరాజు, మహేష్, నాగేంద్రబాబు, నాగచైతన్య, చరణ్, స్వాతి, నవ్య, మల్లేశ్వరి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ

కూసుమంచి : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రేరంలోని జెవియర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బంక శ్రీ చరణ్, సాయిరాం, నవీన్, ప్రవీణ్, రాజేష్, కీర్తి, శ్రావణి, భద్రకాళి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు ఫుల్ వీల్స్‌తో రోడ్లపై తిప్పవద్దు

ఎస్సై సాయికుమార్

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలో ఫుల్ విల్స్‌తో రహదారులపై ట్రాక్టర్లను నడపవద్దని ఎస్సై సాయి కుమార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫుల్ విల్స్‌లతో రోడ్లపై ట్రాక్టర్లను తిప్పితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లైసెన్స్‌డ్, సీనియార్టి డ్రైవర్‌లతోనే ట్రాక్టర్‌లు నడపాలని సూచించారు. ట్రాక్టర్ యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు.

జక్కంపూడికి మాజీ ఎమ్మెల్యే సండ్ర నివాళి

నవతెలంగాణ-తల్లాడ

జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి చిత్ర పటానికి శనివారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆర్.వీర మోహన్ రెడ్డి, దుగ్గిదేవరా వెంకట్ లాల్, ముప్వ మురళి, జక్కంపూడి వీరభద్రరావు, సతీష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి
- డాక్టర్లు నెల్లూరి చందన, శిరీష

నవతెలంగాణ-కామేపల్లి

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్లు నెల్లూరి చందన, శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తీసుకోవాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. చల్లార్చి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, మురుగునీరు నిలవ లేకుండా చూసుకోవాలని, దోమలు లేకుండా చూసుకోవాలని, అప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని పేర్కొన్నారు. తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

విద్యార్థుల జుట్టు కత్తిరించిన ఉపాధ్యాయురాలు

- సస్పెండ్ చేయాలంటూ తల్లిదండ్రులు ఆందోళన
- సస్పెండ్ చేసిన డీఈఓ

నవతెలంగాణ-కల్లూరు



ఎన్నిసార్లు చెప్పినా విద్యార్థులు జుట్టు పెంచుకొని పాఠశాలకు హాజరవుతుంటే విసుగు చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు తానే కత్తెరతో విద్యార్థుల జుట్టు కత్తిరించారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 15 మంది విద్యార్థులకు పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న డీ.శిరీష తన మాట వినటం లేదని ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు 15 మంది విద్యార్థులకు అక్కడక్కడ జుట్టు కత్తిరించారు. బార్బర్ షాప్‌కి వెళ్లి మంచిగా కత్తిరించుకోవాలని చెప్పింది. దీంతో ఆ విద్యార్థులు గ్రామంలో తమ పరువు పోయినట్టు భావించి విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఏ విషయమైనా తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలి కానీ ఇలా జుట్టు కట్ చేస్తే విద్యార్థులు ఏమైనా అగత్యానికి పాలు పెడితే ఎవరు బాధ్యులు అంటూ ఉపాధ్యాయురాలుని నిలదీశారు. పాఠశాల ఉపాధ్యాయురాలుపై జిల్లా అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్కూల్లో ఆందోళనకు దిగారు. తనకు ఎలాంటి ఉద్దేశం లేదని విద్యార్థిని క్రమశిక్షణలో పెట్టే విధిగా అలా చేస్తే కటింగ్ షాప్‌కి వెళ్లి కటింగ్ చేసుకుంటారని చేశాను తప్ప వేరే ఉద్దేశం తనకు లేదని ఉపాధ్యాయురాలు తల్లిదండ్రులకు చెప్పారు. తనది తప్పేనని క్షమాపణ చెప్తున్నట్లు తల్లిదండ్రులు చెప్పారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ వివరణ కోరగా ఈ సంఘటన జరిగినప్పుడు ఏడో తరగతిలో పాఠం చెబుతున్నానని, బయటకు వచ్చిన తర్వాత తెలిసిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి ఆందోళన విరమింపజేశారు.

ఉపాధ్యాయురాలును సస్పెండ్ చేసిన డీఈవో

పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న శిరీషను శనివారం సస్పెండ్ చేస్తూ డీఈఓ సోమశేఖర శర్మ ఆదేశాలు జారీ చేశారు. 15 మంది విద్యార్థులకు జుట్టు కత్తిరించారని తల్లిదండ్రుల ఆందోళన దిగటంతో సస్పెండ్ చేసినట్లు సస్పెండ్ ఆర్డర్స్‌లో పేర్కొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో జనరల్ బాడీ ఎలక్షన్స్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



పట్టణంలోని స్థానిక ట్రంకు రోడ్డులో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్లో జనరల్ బాడీ ఎలక్షన్స్ శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రతి ఒక్క పిల్లవాడు చాలా సంతోషకరంగా పాల్గొని తమ బ్యాలెట్ ద్వారా హెడ్ బాయ్ అండ్ హెడ్ గర్ల్స్, హౌస్ మానిటర్స్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రవి, పాఠశాల చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య ఏజీఎం చేతన, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి, గౌతమీ, డీన్ హర్షరాజు, ప్రైమరీ ఇంచార్జ్ మనీ, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్‌లో వేడుకగా బోనాల సంబురం

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలైన బోనాల సంబురాన్ని నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం వేడుకగా నిర్వహించారు. కొత్త బోనాల మట్టి కుండలో నైవేద్యాన్ని వండి బోనాల కుండపై ప్రమిదను ఉంచి బోనాల కుండలతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. బృందాలుగా బోనాలతో పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు బోనాలు నెత్తిన పెట్టుకొని పురవీధులలో ప్రదర్శనగా అమ్మవారి గుడి వద్దకు చేరుకున్నారు. పాఠశాల విద్యార్థులు పోతురాజు వేషధారణలో ప్రత్యేక అలంకరణతో చేతిలో చంద్రకోల పట్టుకొని బోనాల ప్రదర్శనకు ముందు నడిచారు. సాంప్రదాయ దుస్తుల్లో బోనాలతో ఉన్న విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయినీలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ప్రత్యేకంగా సెట్టింగ్‌లో అమ్మవారిని ఉంచి చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి, అమ్మవారికి బోనాల మొక్కలు చెల్లించారు. బోనాలు నెత్తిన పెట్టుకున్న ఉపాధ్యాయినీలు ప్రదర్శనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ఖమ్మం

రైతు భీమా-2024 (7వ పాలసీ సంవత్సరం) కోసం అర్హత గల రైతులందరూ ఆగస్టు 5 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం. విజయనిర్మల శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 28 లోపు ధరణి పోర్టల్ ద్వారా ధృవీకరించిన నూతన పట్టాదారు పాస్ బుక్, ఆర్వోఎఫార్ పొందిన రైతులు, గతంలో పోర్టల్ నందు పేర్లు నమోదు చేసుకోని రైతులు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత గల రైతులు రైతుభీమా దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆర్వోఎఫార్ జిరాక్స్ ప్రతి, రైతు ఆధార్ కార్డ్ జిరాక్స్ నకలు, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్ నకలులతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, రైతుభీమాకు పేర్లు ఆగస్టు 5 లోగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



ఇంకుడుగుంతల నిర్మాణ పనుల తనిఖీ

నవతెలంగాణ-ఖమ్మం

సహజ వనరుల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్ నిర్మిస్తున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూగర్భ జలాల వృద్ధికి ఇంకుడుగుంతలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న బస్ షెల్టర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలు, ఉద్యోగుల సౌకర్యం కొరకు కలెక్టరేట్ వద్ద అన్ని బస్సులు ఆగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బస్ షెల్టర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి వెంకట రమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

- వైద్య సేవ సమితి సేవలు అభినందనీయం : చైర్ పర్సన్ లత

నవతెలంగాణ-మధిర



బోడేపూడి భవనంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ వైద్య బృందంచే నెలలో 4 శనివారం హెల్త్ క్యాంప్‌లో భాగంగా బోడెపుడి వైద్య సేవ సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మొండితోక లత మాట్లాడుతూ సీపీఐ(ఎం) సేవలు వెలకట్టలేనివని, పేద ప్రజలకు అండదండగా ఉంటూ ప్రతి సమస్యపై పోరాడుతూ అనే సమస్యలపై ఉద్యమాలు చేస్తుందని, ప్రజలకు ఈ ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించడం వల్ల పేద ప్రజలకు చాలా లాభం చేపడుతుందని పార్టీని అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ వారి కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, గైనిక్ స్పెషలిస్ట్, ఐ స్పెషలిస్ట్, ఖమ్మం అంకుర హాస్పటల్ చిల్డ్రన్ స్పెషలిస్ట్, బీపి, షుగర్ డాక్టర్లు, ప్రతిభ సంతోషిని, రమాదేవి, జాన్ బాబు పాల్గొని తమ సేవలందించారు. ఈ సందర్భంగా వైద్య సేవ అందించిన డాక్టర్లకు బోడెపుడి సేవాసమితి నుండి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ హెల్త్ క్యాంపులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో శీలం నరసింహారావు, మంద సైదులు, మండవ పనింద్ర కుమారి, పడకంటి మురళి, వాసిరెడ్డి సుందరయ్య, మద్దాల ప్రభాకర్, తేలబ్రోలు రాధాకృష్ణ, మధు, విల్సన్, రామకిషోర్, చారి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత బస్ సౌకర్యంతో ఉపాధి కోల్పోయాం

- నెలకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేయాలి
- ఆటో కార్మికుల రాస్తారోకో

నవతెలంగాణ-బోనకల్



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రతినెల ఆర్థిక సహాయం చేసే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్‌లో శనివారం గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బోనకల్ టు ఖమ్మం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మంద యాదగిరి, సీనియర్ ఆటో డ్రైవర్ ఉంగుటూరు రమేష్ మాట్లాడుతూ గతంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లేని సమయంలో తమకు ఉపాధి లభించిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలందరూ బస్సు మాత్రమే ఎక్కుతున్నారని, మహిళలు ఎవరు ఆటోలు ఎక్కటం లేదని తెలిపారు. దీంతో తమ పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోయామన్నారు. గతంలో డీజిల్ అరుగుదల పోను రోజుకి సుమారు 300 నుంచి 400 రూపాయలు ఆదాయం వచ్చేదని చెప్పారు. కానీ ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు ఆటో తోలిన రూ.300 కూడా రావటం లేదన్నారు. డీజిల్, ఆటో అరుగుదల పోతే తమకు రోజు 100 రూపాయల కూడా ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నెల రోజులు ఆటో వెళ్లిన ఆటో కిస్తీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి తమను ప్రభుత్వం రోడ్డున పడేసిందని, తమకు ప్రతినెల రూ. 20 వేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు షేక్ మస్తాన్, వైస్ ప్రెసిడెంట్ ఏ.నరేష్, ప్రధాన కార్యదర్శి డీ.వెంకట్ గౌడ్, కోశాధికారి జీ.సుధాకర్, సలహాదారులు ఎస్. ప్రభాకర్, బంధం ఆదినారాయణ, రమేష్, రాంబాబు, బోయినపల్లి పున్నయ్య, నిమ్మ తోట జనార్దన్‌రావు, నిమ్మతోట సునీల్, బోయన ఉపేందర్, పలువురు ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.






భద్రగిరిపై గోదారమ్మ ఆగ్రహం..!

మూడవ ప్రమాద హెచ్చరికను దాటిన ప్రవాహం

- సరిహద్దు సమస్యతో మునుగుతున్న భద్రాచలం
- వరద బాధితులకు అండగా సీపీఐ(ఎం)

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గత 20 రోజుల నుండి భద్రగిరిపై ప్రతాపాన్ని చూపిస్తున్న గోదారమ్మకు ఆగ్రహం చల్లారేలాగా కనిపించడం లేదు. ఎగువన ఉన్నటువంటి మేడిగడ్డ, ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుండి లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు రావడంతో పాటు కిన్నెరసాని, తాలిపేరు తదితర ఉపనదులు పొంగి తమ ప్రతాపాన్ని చూపించడంతో భద్రాచలం వద్ద గోదావరి అంతకంతకు పెరిగి భద్రాచలం ఏజెన్సీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. మూడవ ప్రమాద హెచ్చరికను సైతం దాటుకొని ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నేపథ్యంలో భద్రాచలం పట్టణంతో పాటు విలీల మండలాలైన కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు, ఎట్టపాక మండలాలు చిగురుటాకులాగా వనికి పోతున్నాయి. శనివారం సాయంత్రానికే భద్రాచలం వద్ద తుది హెచ్చరికను జారీ చేసిన అధికారులు భద్రాచలం నుండి కూనవరం, వీఆర్‌పురం చింతూరుకు వెళ్లే మార్గాలను నిలిపివేయడంతో పాటు ఇటు కుక్కునూరు, వేలేర్ పాడు మండలాల సైతం రాకపోకలు నిలిపివేశారు.

పట్టణంలోని ముంపుకి గురైన కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలలో ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించేందుకు పట్టణ సీఐ సంజీవరావుతో పాటు పట్టణ ఎస్సై తదితర సిబ్బంది ప్రజల అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు.

సరిహద్దు సమస్యతో భద్రాచలానికి ముంపు

పోలవరం ముంపు పేరుతో భద్రాచలం డివిజన్‌ని ముక్కలకు అభివృద్ధి ఇచ్చిన పాపం వరదల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కరకట్ట నిర్మాణం చేపట్టినప్పుడు ఏర్పాటు చేసిన స్లూఈజ్‌లలో ఏడు భద్రాచలం పట్టణంలో ఉండగా ఒక్క స్లూఈజ్ మాత్రం ఐదు లాకులకు గాను రెండున్నర లాకులు



ఆంధ్ర ప్రాంతం, రెండున్నర లాకులు తెలంగాణలో ఉండటంతో దాని మరమ్మతులు అటు ఆంధ్ర ప్రభుత్వం గానీ, ఇటు తెలంగాణ ప్రభుత్వం గానీ పట్టించుకోని ఫలితంగా శనివారం ఉదయం భారీగా వరద నీరు లీకై ఏఎంసీ కాలనీ, కొత్త కాలనీ వరద ముంపుకి గురైన పరిస్థితి నెలకొన్నది. ఆంధ్ర భూభాగంలో ఉన్న స్లూఈజ్ వద్ద ఎటువంటి మరమ్మతు చర్యలు చేపట్టని అనంతరం అంతర్రాష్ట్ర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భద్రాచలం ఇరిగేషన్ అధికారులు చేతులెత్తగా స్లూయిస్‌ల నుండి ముంపుకి గురి అయ్యే ప్రాంతం తెలంగాణలో ఉండటంతో మాకేం సంబంధం అని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

జలదిగ్బంధంలో ముంపు మండలాలు

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న గోదావరి ఉగ్రరూపానికి పట్టణంతో పాటు పోలవరం ముంపు మండలాలు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కూనవరం, వీఆర్పురం, చింతూరు మండలాలలో అనేక గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోగా కూనవరం పట్టణం సైతం ముంపునకు గురైన పరిస్థితి నెలకొన్నది. ఇటు వీఆర్‌పురం మండలాలలో కూడా అనేక ఏజెన్సీ గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించగా చింతూరు మండలంలో కూడా లోతట్టు ప్రాంతాలు ముంపుకి గురవుతున్నాయి. ఇప్పటికే విలీన మండలాలకు భద్రాచలం పట్టణ నుండి రాకపోకలు నిలిచిపోగా చింతూరు నుండి ఒడిస్సా, ఛత్తీస్గఢ్ కెళ్లే జాతీయ రహదారి సైతం గోదారి ముంపుకి గురైన నేపథ్యంలో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. మరొపక్క ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేర్పాడు మండలాలలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ప్రజా ప్రతినిధుల బృందం హుటాహుటిన లోతట్టు ప్రాంత ప్రజలను మెరకు ప్రాంతాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

వరద బాధితులకు అండగా సీపీఐ(ఎం)

ఆంధ్ర-తెలంగాణ అధికారుల సమన్వయ లోపంతో పట్టణంలోని అశోక్ నగర్, కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీ శుక్రవారం అర్ధరాత్రి నుండి వరద ముంపుకి గురి కావడంతో స్థానిక ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సీపీఐ(ఎం) బృందాని సంప్రదించగా వెంటనే స్పందించిన పార్టీ పట్టణ నాయకత్వం ముంపు ప్రాంతాలలో శనివారం పర్యటించారు. ప్రజలను అప్రమత్తం చేసి అధికారులను ముంపు ప్రాంతానికి రప్పించడమే కాక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయించి పంచాయతీ ట్రాక్టర్‌లతో బాధితులను తరలించారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట్ రామారావుతో పాటు స్థానిక నాయకులు జలదిరిగ్బంధంలో చిక్కుకున్న నివాస గృహాలలోని నిత్యవసర వస్తువులను ప్రత్యక్షంగా మోసి ప్రజలకు అండగా నిలిచారు. ముంపుపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ప్రవీదుల వద్ద పనిచేయని మోటార్ల పట్ల అధికారులను హెచ్చరించి వెంటనే మరమ్మతులు చేపించారు. పోలవరం ముంపు నుండి భద్రాచలానికి శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని ఒకవైపు ఆందోళనలు పోరాటాలు చేస్తూనే మరోపక్క వరద బాధితులకు చేదోడు, వాదోడుగా ఉంటూ అండదండలు అందిస్తున్న పార్టీ పట్టణ నాయకత్వంపై ముంపు ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

చట్టాలను నిరంతరం అధ్యయనం చేయాలి

- ఐఏఎల్ స్టడీ సర్కిల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-కొత్తగూడెం



న్యాయవాదులు నిరంతరం చట్టాలను అధ్యయనం చేయాలని కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ న్యాయవాదులకు పిలుపు నిచ్చారు. కొత్తగూడెం ఐఎంఏ హాల్ నందు సీనియర్ న్యాయవాది వై.ఉదయ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లాస్థాయి స్టడీ సర్కిల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ మాట్లాడుతూ ప్రస్తుత యుగంలో చట్టాలు రోజు రోజుకీ మారుతున్నాయని, హైకోర్టు, సుప్రీంకోర్టులో తీర్పులు కూడా చాలా వస్తున్నాయని కనుక న్యాయవాదులు చట్టాలతోపాటు తీర్పులను కూడా నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. సత్వర న్యాయంకోసం న్యాయవాదులందరూ కృషి చేయాలన్నారు. మూడవ అదనపు మెజిస్ట్రేట్ శివానాయక్ మాట్లాడుతూ కొత్తగా తీసుకువచ్చిన చట్టాలలో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ చాలా ప్రాముఖ్యమన్నారు. గతంలో ఉన్న చట్టాలకు ఇప్పుడు ఉన్న చట్టాలకు తేడాలను న్యాయవాదులు గుర్తించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు గంటా విద్యా సాగర్ రెడ్డి, కెవికె గుప్తాలు మాట్లాడుతూ నూతన చట్టాలతో సత్వర న్యాయం బదులుగా న్యాయం మరింత ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోట్ల మాధవరావు, బొమ్మగాని ప్రభాకర్‌లు మాట్లాడారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ భారతదేశంలో 70 శాతం మంది ప్రజలకు చట్టాల మీద అవగాహన లేదన్నారు. ఇప్పటికైనా చట్టాలను అవగాహన కల్పించి అమలు చేయటానికి సాహసించాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మేము చట్టాలకు, శిక్షలకు వ్యతిరేకం కాదని, తప్పు చేసినవారికి శిక్ష పడాల్సిందేనని, కానీ అప్రజా సమీకంగా అమాయకులను శిక్షించడానికి మాత్రం వ్యతిరేకం అన్నారు. ప్రజలకు అనుకూలమైన చట్టాలు తెస్తే వ్యతిరేకత రాదని, ప్రజలకు అవగాహన వచ్చేవరకు ఈ చట్టాలను రద్దుచేసి మరలా ప్రజా ఆమోదంతో ప్రజా అనుకూల కొత్త చట్టాలను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ భానుమతి, జూనియర్ సివిల్ జడ్జ్ రామారావు, రెండవ అదనపు మెజిస్ట్రేట్ సాయిశ్రీ, పీపీలు ఆర్.విజయ్ కుమార్, నాగిరెడ్డి, పోసాని రాధాకృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, జిల్లా ఐ.ఎల్.ఏ.అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

బిట్టు తండా గ్రామంలో వైద్య శిబిరం


నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బేతాళ పాడు గ్రామ పంచాయతీలోని బిట్టు తండా గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 86 మందికీ వైద్యం పరీక్షలు చేయగా వీరిలో ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నారని గుర్తించారు. రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఎఎన్ఎమ్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని జలాశయానికి వరద పోటు

- 403.60 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇన్ ఫ్లో 5 వేల 500ల క్యూసెక్కులు
- నాలుగు గేట్ల ఎత్తివేత
- 16,000 క్యూసెక్కుల నీటి విడుదల

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



కిన్నెరసాని జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుండాల, నర్సంపేట ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు పెద్ద ఎత్తున జలాశయానికి చేరుతోంది. శనివారం ఉదయం ఏడు గంటలకు 402.70 అడుగులుగా ఉన్న నీటిమట్టం, 9 గంటలకు 402.90 అడుగులు, 10 గంటలకు 403, మధ్యాహ్నం 1.15 గంటలకు 403.30 అడుగులుగా, సాయంత్రానికి 403.60 అడుగులకు చేరుకుంది. డ్యామ్ పరిరక్షణ రీత్యా రాత్రి 10 గంటలకు రిజర్వాయర్ నాలుగు గేట్లు ఎత్తి 5500ల క్యూ సెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేయనున్నట్లు కేటీపీఎస్ డ్యామ్ సైట్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేసినట్టు తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో టీటీడీ దేవస్థాన సత్రంలో నూతనంగా ఏర్పాటు చేసి మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో కాళీగా వున్న సీట్లు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీఓ అంజలి, డీసీఓ బ్యూలా రాణి, స్పెషల్ ఆఫీసర్ బురాన్ అన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ బురాన్ మాట్లాడుతూ డిగ్రీలో చేరేందుకు ఎంపీసీ, బీజెడ్‌సీ, బీకాం కోర్సుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ క్యాటగిరిలో విద్యార్థులకు అవకాశం ఉందని తెలిపారు. డిగ్రీ కోర్సులో చేరేందుకు ఎంట్రన్స్ పరీక్ష రాసిన వారితో పాటు పరీక్ష రాయని వారు కూడా ఈ నెల 31వ తేదీలోపు అన్నపురెడ్డిపల్లి టీటీడీ దేవస్థాన సత్రం గల కళాశాల నందు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వివరాలకు 9059490623, 8328498711, 8500006021 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తున్న సింగరేణి సీఅండ్ఎండీ

- పాలాభిషేకం చేసిన కాంట్రాక్టు కార్మికులు

నవతెలంగాణ-కొత్తగూడెం

కాంట్రాక్ట్ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం కృషి చేస్తున్న సింగరేణి సిఅండ్ అండ్ ఎండికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుల కాంట్రాక్టు కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఆశా కిరణం మా బలరాముడుఅని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి పదంలో నడిపించుటకు సింగరేణి సంస్థ అధికారులను, కార్మిక సంఘాలను, కార్మికులను కలుపుకొని సింగరేణి సంస్థని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిబెట్టి ముందుండి నడిపిస్తూన్నారని చెప్పారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల బీమా సదుపాయం కల్పించి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వారి కుటుంబాల కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో ఇనపనూరి నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, బుల సత్యనారాణ, సిహెచ్ శ్రీనివాస్, కే.చంద్రశేఖర్, పిట్టల శేఖర్, శివ, సిద్ధు, వీరు, రాజేష్, కళావతి, సుగుణ, మార్కెట్ అనిత, పంగా రాములు, అరుణ్, రాజశేఖర్, భాగ్యలక్ష్మి, అరుణ, మాధురి, సుభద్ర, సంతోష్, సందీప్, వెంకటేష్, గోపి, మల్లేష్, రూతు, రమాదేవి, అనూష తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ శుద్ధి జలం అందించాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట

హర్ ఘర్ హర్ జల్ నినాదంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారోగ్యంలో భాగంగా ఇంటింటికీ శుద్ధి జలం సరఫరా చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. కార్యదర్శి బంగారు సందీప్ అధ్యక్షతన శనివారం పంచాయతీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. ఈ పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహశీల్దార్ వి.క్రిష్ణప్రసాద్ హాజరై మాట్లాడారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపద్యంలో తరుణ వ్యాదులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వైద్యం ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత పై ఆశాలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ గ్రామ సభలో పంచాయతీ గుమస్తా ముశికి రమణతో పాటు ఏఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కర్షకుడికి 'కన్నీళ్లు' తెప్పిస్తున్న వానలు

గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలకు కర్షకుడి కంట కన్నీళ్లు కనిపిస్తున్నాయి. దీంతో పాటు జనజీవనం సైతం అతలాకుతలమవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో రైతుల వ్యవసాయ పనులు సైతం ముందుకు సాగని పరిస్థితి.

- ముందుకు సాగని వరి నాట్లు
- ఎర్రబారుతున్న పత్తి మొక్కలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



దుమ్ముగూడెం మండలం పూర్తిగా వ్యవశాయ ఆధారిత మండలం, ఇక్కడ రైతులు అధిక మొత్తంలో పత్తి, వరి సాగుతో పాటు మిర్చి, అపరాల వంటి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన తొలకరి వర్షాలకు రైతులు అదునుగా దుక్కులు దున్ని పలుచోట్ల పత్తి గింజలు వేసినప్పటికీ కొన్ని రోజులపాటు వానలు ముఖం చాటేసాయి. దీంతో తిరిగి రైతులు రెండవసారి పత్తి గింజలు వేయాల్సి వచ్చింది. మరలా అడపాదడప కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల పైచిలుకు రైతులు పత్తి సాగు చేశారు. వరి సాగు చేసే రైతులు సైతం అదునుగా పొడి దుక్కులు, దమ్ము దుక్కులు దున్ని నార్లు పోసారు. గత 15 రోజులుగా కురుస్తున్న మోస్తరు భారీ వర్షాలకు పలువురి రైతులకు చెందిన వరి నారుమల్లు సైతం కొట్టుకుపోయాయి. దీంతో రైతులు తిరిగి రెండవసారి వరి నార్లు పోసుకోవలసి వచ్చింది.

ఎర్రబారిన పత్తి చేలు

భారీ వర్షాలకు చాలాచోట్ల పత్తి మొక్కలు ఎర్రబారి పోతున్నాయి. పత్తి చేలకు పై పాటు నిర్వహించి మందులు వేసి మొక్కలు పెరుగుతున్న సమయంలో అధిక వర్షాలకు వర్షపు నీరు పంట చేలలో నిల్వ ఉండి మొక్కలు ఏపుగా పెరగకపోవడంతో పాటు ఎర్రబారి పోతుండటంతో పత్తి రైతులు లబోదిబోమంటూ తలలు పట్టుకుంటున్నారు.

ముందుకు సాగని వరి నాట్లు

మండల వ్యాప్తంగా రైతులు గత పది రోజులుగా వరి నాట్లు వేసే పనిలో ఉన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు వరి నాట్లు సైతం ముందుకు సాగడం లేదు. వేసిన వరి నాట్లు సైతం పలుచోట్ల వర్షం వరదలకు కొట్టుకుపోయాయి. ఏది ఏమైనా కుండపోతగా కురుస్తున్న వర్షాలు కర్షకుడికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయని చెప్పవచ్చు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రతి సంవత్సరం రైతులు ప్రకృతి ప్రకోపాలకు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల రైతులు ఒకటికి రెండుసార్లు పత్తి విత్తడంతోపాటు, వరి నార్లు పోసి తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలకు పత్తి చేలు ఎర్రబారి పోవడంతోపాటు వేసిన వరి నాట్లు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

: సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య



ప్రజా సమస్యలపై పోరాడటమే బీజీ నాగరాజుకిచ్చే నివాళి

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజా సమస్యలపై నికరంగా పోరాడటమే జిబి.నాగరాజుకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. అమరజీవి కామ్రేడ్ జిబి.నాగరాజు ప్రథమ వర్ధంతి కార్యక్రమం రుద్రాంపూర్‌లో శనివారం నిర్వహించారు. ముందుగా నాగరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రంపూర్ ప్రాంతంలో యువజన ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాడని, ప్రజా కళల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ పాలకుల దోపిడీని గుట్టు రట్టు చేసిన వ్యక్తి అని తెలిపారు. రుద్రంపూర్‌లో ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాడని, ఈ క్రమంలో గుండాల దాడిని సైతం ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. భౌతిక దాడులను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పని చేశాడని అన్నారు. ప్రస్తుతం బీజేపీ మతోన్మాద విధానాలను కళారూపాల ద్వారా ఎదుర్కొనే నేపథ్యంలో నాగరాజు లేకపోవడం తీరని లోటని అన్నారు. నాగరాజు ఆశయ బాటలో నడుస్తూ రుద్రంపూర్ ప్రాంతంలో పార్టీ విస్తరణకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేష్, రమేష్, నాయకులు యాసా నరేష్, కాళంగి హరికృష్ణ, భాస్కర్, సుబ్బారావు, ఆంజనేయులు, క్రాంతి, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

భయాందోళన వద్దు

- అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
- తహసీల్దార్ స్వర్ణ

నవతెలంగాణ-అశ్వాపురం



గోదావరి పెరుగుతున్న నేపథ్యంలో మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలలో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అన్ని వసతులు సమకూరుస్తామని తహసీల్దార్ స్వర్ణ అన్నారు. శనివారం గోదావరి ముంపు ప్రాంతాలైన నెల్లిపాక, అమెర్ద, బట్టీల గుంపు గ్రామాలలో ఆమె పర్యటించారు. ప్రస్తుతం గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆమె అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. మండలంలో 55 నుండి 60 అడుగుల మేరకు గోదావరి వరదలు సంభవిస్తే గ్రామాలలోకి వరదనీరు వచ్చే అవకాశం ఉన్నందున ఆమె నెల్లిపాక జెడ్పీఎస్ఎస్ స్కూల్, మిట్టగూడెం జడ్పీహెచ్ఎస్ స్కూల్, సీతారామపురం, మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్, ఎస్‌కేటీ ఫంక్షన్ హాళ్లను పునరావాస కేంద్రాల కోసం సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా ముంపు ప్రాంతాల ప్రజల కోసం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పదిమంది పడవ కార్మికులను సిద్ధం చేసినట్టు ఆమె తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రిజిస్టర్ నెంబర్ 1630/1982 సర్వసభ్య సమావేశం శ్రీరాంపూర్‌లోని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఫిట్ కమిటీ బ్రాంచ్ కమిటీ సెంట్రల్ కమిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో అసోసియేషన్ కార్యక్రమాలు చర్చించారు. కార్మికుల సమస్యల పైన యాజమాన్యంతో సమస్యల పరిష్కారానికి నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా జనరల్ సెక్రెటరీగా గంగారపు లింగమూర్తి, (గోదవరిఖని) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోడ రమేష్‌ని కార్పొరేట్ (కొత్తగూడెం) ఏరియా వీరిద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి గంగారపు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్ మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

వరద బాధితులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పునరావాస కేంద్రంలోని ముంపు కుటుంబాల ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. శనివారం ముంపునకు గురైన కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ ప్రజలను నన్నపనేని మోహన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఏర్పాట్లును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలోని కుటుంబాలకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరిరక్షణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వరద పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితి ఏర్పడే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ప్రజలకు భరోసా కల్పించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ ఈవోకు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ బాగా చేస్తున్నారని ఈవోని సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమాలలో రెవెన్యూ ఆర్ఐ నరసింహారావు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా సింగరేణి సంస్థను కాపాడుకుంటాం

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జనక్ ప్రసాద్

నవతెలంగాణ-మణుగూరు

ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ గుండెకాయ సింగరేణి సంస్థలు కాపాడుకుంటామని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ బి.జనక్ ప్రసాద్ కార్మికులకు తెలిపారు. శనివారం ఏరియా ప్రాతినిధ్య సంఘం సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో మణుగూరులో వివిధ గనులు డిపార్ట్మెంట్‌లలో జరిగిన పిట్ మీటింగ్‌లలో ఆయన పాల్గొన్నారు. ఓసీ 2లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రామగుండం ఏరియాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు పనులు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర వేతన సలహా మండలి చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా మునుగూరు సందర్శించిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఎంఎల్‌యూ ప్రధాన కార్యదర్శి చిన్నయ్య త్యాగరాజన్, మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండి రజాక్ పాషా, పీతాంబరం, ఏరియా ప్రధాన కార్యదర్శి, అసంఘటితరంగా ఏరియా అధ్యక్షులు సిల్వేరు గట్టయ్య యాదవ్, నాయుడు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ అమలు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

విద్యుత్ సంస్థల్లో ఆగస్టు 31, 2004 లోపు విధుల్లో చేరిన ఉద్యోగులందరికీ జీపీఎఫ్ అమలు చేయాలని ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం 2004వ సంవత్సరం లోపు విధుల్లో చేరిన విద్యుత్ ఉద్యోగులందరికీ జీపీఎఫ్ అమలు చేయాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో మణుగూరులోని బీటీపీఎస్‌లో చీఫ్ ఇంజనీర్ భూక్యా బిచ్చన్నకు వినతిపత్రం అందచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు బి.మంగీలాల్, సి.హెచ్ రాజబాబులు ప్రసంగించారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో 2004వ సంవత్సరం వరకు జీపీఎఫ్ అమలవుతుందని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.భీమ్య, కె.కోటేశ్వరరావు, పీ.రవీందర్ రెడ్డి, అంబాల శ్రీనివాస్, పివి.సురేష్, వి.ప్రసాద్, యం.రాజమనోహర్, బి.సత్యనారాయణ, ఎస్కే సాదిక్, వీరస్వామి, నాగేశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేయడం ఎంతో మేలు

- డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్

నవతెలంగాణ-కొత్తగూడెం

గుండె పోటుకు గురైన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేయడం ఎంతో మేలు కలుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. శనివారం డాక్టర్ ఏ.పీ.జె.అబ్దుల్ కలాం జ్ఞాపకార్థం పునర్జన్మ-కార్డియో పల్మనరి రీసుసిటేషన్ (సీపిఆర్) కార్యక్రమం కొత్తగూడెం మెడికల్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డియో పల్మనరీ రిసాసిటేషన్ (సిపిఆర్) అనేది కృత్రిమ శ్వాసలను ఇవ్వడం, చాతిని నొక్కడం తద్వారా గుండె శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తాన్ని సరఫరా చేస్తుంది గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయిన తర్వాత కూడా వ్యక్తిని సజీవంగా ఉంచడానికి సహాయపడుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, చాతకొండ బెటాలియన్ పోలీసులకు, రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కె. రాజా కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.మధువరన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉల్వనూరు వైద్య అధికారి తేజస్విని పాల్గొన్నారు.

ఆర్టీసీలో బ్రీతింగ్ ఎనైలజర్ మిషన్‌ను వెంటనే మార్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



ఆర్టీసీ డ్రైవర్లకు ప్రతి రోజు ఉదయం బ్రీతింగ్ అనలైజర్ ఆల్కహాల్ టెస్ట్ మిషన్‌ను ఉపయోగిస్తున్నప్పుడు అది పనిచేయడం లేదని, ఆల్కహాల్ సేవించక పోయినప్పటికీ తప్పుడు సమాచారం ఇస్తూందని, ఆ మిషన్ వల్ల డ్రైవర్లకు ఆల్కాహాల్ తాగినట్లు పాయింట్స్ నమోదు అవుతున్న ఫలితంగా కార్మికులకు పనిష్మెంట్ కింద వారం నుండి, రెండు నెలల వరకు డ్రైవర్లకు డ్యూటీలు లేక ఆర్థిక ఇబ్బందులతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల వారి ఆత్మాభిమానం దెబ్బతిని ఈ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేని స్థితిలో ఉన్నారు. వెంటనే ఆ మిషన్‌ను మార్చాలని, హైర్ బస్ డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కన్వీనర్ డి.వీరన్న, అద్దె బస్సుల గౌరవ అధ్యక్షులు భూక్య రమేష్ మాట్లాడుతూ అసలు ఆల్కాహాల్ అలవాటు లేని డ్రైవర్లకు సైతం ఆల్కాహాల్ సేవించినట్లు పాయింట్స్ చూపెట్టడం విడ్డురంగా కనిపిస్తుందన్నారు. వెంటనే తప్పుడు సమాచారం ఇస్తున్న బ్రీతింగ్ మిషన్‌ను మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు లిక్కీబాలరాజు, యూనియన్ నాయకులు కత్తి నరసింహ రావు, సైదులు, శివ, జోజీ, సాదిక్ పాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల ఉత్సవాలు

పాల్వంచ : మున్సిపల్ పరిధి దమ్మపేట సెంటర్ త్రివేణి పాఠశాలలో శనివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంబరాన్నంటాయి. పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ కవిత పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులు అమ్మవారి వేషధారణలో అలరించారు. పాఠశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించారు. పోతురాజుల విన్యాసం ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వీరేంద్ర చౌదరి, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకులు, బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

భద్రాచలం రూరల్ : స్థానిక సెయింట్ పాల్స్ లూథరన్ పాఠశాల నందు శనివారం ఘనంగా బోనాలు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు డాక్టర్ కే.రాధా మంజరి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అబ్రహం, డైరెక్టర్ ఎస్.రాజేష్ మాట్లాడారు. విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి

- ఏఐటీయూసీ పట్టణ 2వ మహాసభలో సాబీర్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత, అసంఘటిత కార్మిక లోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏఐటీయూసీ పాల్వంచ పట్టణ 2వ మహాసభ నిర్వహించారు. తొలుత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అరుణ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరటి ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బండి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండలం కార్యదర్శి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు వి.పద్మజ, భూక్య శ్రీను, నాయకులు వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి-వ్యాధులు బారిన పడకండి

మణుగూరు : పరిశుభ్రత పాటించి, వ్యాధుల బారిన పడకుండా ఉండాలని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కూనవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎంపీటీసీ మాట్లాడారు. గత పది రోజులు నుండి వర్షాలు పడడం వలన మురుగు నీరు నిల్వలు ఎక్కువగా ఉండి దోమలు, ఈగలు పెరిగిపోయి విష జ్వరాలు, వాంతులు విరోచనాలు, అంటువ్యాదులు బారిన పడకుండా ఉండాలంటే ప్రజలందరూ మీ ఇంటిని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ మంగయ్య, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, లైట్లు వితరణ

గుండాల : మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్ మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం నాలుగు ఫ్యాన్లు, లైట్లు వితరణ చేశారు. ఈ ఫ్యాన్లు, లైట్లను వాసవి క్లబ్ అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పుల్లఖండం ఉపేందర్, ట్రెజరర్ అనుమోలు, వెంకటేశ్వర్లు స్పాన్సర్ చేశారు. అదేవిధంగా ఆస్పత్రిలోని రోగులకు పుల్లఖండం ఉపేందర్, తేరాల రాజేశ్వరరావు బ్రెడ్, అరటి పండ్లను రోగులకు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి మనీష్ రెడ్డి మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రికి నాలుగు ఫ్యాన్లు, లైట్లు అందించడం సంతోషకరమని అభినందించారు. ఈ కార్యక్రమంలో మానాల వీరన్న, మానాల ప్రభాకర్, మానాల శ్రావణ్, గౌరిశెట్టి సత్యనారాయణ, గౌరిశెట్టి ప్రభాకర్, అయిత శ్రీశైలం, నాగమల్లయ్య, పూజిత్, తవిడిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- పెద్దమ్మ గుడి దేవాలయ ప్రాంతంలో ఘటన

పాల్వంచ రూరల్ : ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన మండల పరిధి జగన్నాధపురం పెద్దమ్మ గుడి ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ ములుగూడెం గ్రామానికి చెందిన వాడే ప్రవీణ్ (21) పెద్దమ్మ గుడి ప్రాంత ఓ ఫంక్షన్ హాల్‌లో రేకుల షెడ్డుకు తాడుతో ఉరేసుకుని, విగత జీవిగా కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ములుగూడంకు చెందిన వాడే ధర్మయ్య, రమణ దంపతుల కుమారుడిగా పోలీసులు గుర్తించారు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాబా హోటల్‌పై ఎక్సైజ్ దాడులు

అశ్వాపురం : మండల కేంద్రంలోని దాబా హొటలపై శనివారం మణుగూరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాబాలలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేపట్టడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

రోటరీ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ

భద్రాచలం రూరల్ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు రోటరీ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో రోటరీ మండేటరీ ప్రోగ్రాం సందర్భంగా రోటరీ క్లబ్ భద్రాచలం అధ్యక్షుడు దార బాలాజీ రావు అధ్యక్షతన ప్రోగ్రాం చైర్మెన్ డా.ముదిగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది గర్భిణీకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్స్ పి.శ్రీ మహాలక్ష్మీ, యశోద రాంబాబు, రఫీ, మధు, జకరయ్య, నాగేశ్వరరావు, మునికేసవ్, సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఫారెస్ట్ టాస్క్ ఫోర్స్ దాడులు

- రూ.1.60 లక్షల విలువైన టేకు కలుప పట్టివేత

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలో జిల్లా టాస్క్ ఫోర్స్ ఎఫ్ఆర్ఓ టీ.వీ.వీ.ఎస్.కే.ప్రసాద్, అశ్వాపురం రేంజ్ అధికారి రమేష్‌లు సంయుక్తంగా శనివారం చేపట్టిన దాడులలో సుమారు రూ.1.60 లక్షల విలువైన టేకు కలపతో పాటు ఫర్నిచర్‌ను పట్టుకున్నారు. పట్టుకున్న ఫర్నిచర్, టేక్ కలపను భద్రాచలంలోని ఫారెస్ట్ కలప డిపోకు పంపించారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా టేకు కలపతో ఫర్నిచర్ చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ దాడులను నిర్వహించినట్టు వారు తెలిపారు. కార్పెంటర్‌తో పాటు భారజల కర్మాగారంలోని ఓ మాజీ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో ఉన్న కలపను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కలప వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

వరదల నుండి భద్రాచలాన్ని కాపాడుకుంటాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- పట్టణంలోని ముంపు ప్రాంతాలలో పర్యటించిన తుమ్మల

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





గోదావరి వరదలు 75 అడుగులు వచ్చినా భద్రాచలం పట్టణానికి, ఇతర మండలాలకు వరద ముంపు వాటిల్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం భద్రాచలంలోని గోదావరి వరదల ప్రదేశాలను, నూతనంగా నిర్మిస్తున్న కరకట్టను పరిశీలించిన అనంతరం సబ్ కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి వరదల సమయంలో సరైన కరకట్ట లేకపోవడం వలన భద్రాచలం పట్టణం గ్రామాలు ముంపునకు గురి అవుతున్నాయని, ప్రజలు ఎన్నోమార్లు విన్నవించుకున్నారని వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు ఆయన దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. గోదావరి వరదలు భద్రాచలం పట్టణంలోకి రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో కూనవరం రోడ్డులో యుద్ధ ప్రాతిపదికన కరకట్ట నిర్మాణం చేపడుతున్నామని ప్రస్తుతానికి ఈ రోడ్డును మూసివేసినట్టు తెలిపారు. వచ్చే సంవత్సరానికి పూర్తిస్థాయిలో కరకట్ట నిర్మాణం పూర్తి చేస్తామని ప్రస్తుతం 30 గ్రామాలకు లక్ష్మీపురం ద్వారా రోడ్డును పునరుద్ధరిస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేస్ వి.పాటిల్ దగ్గరుండి అన్ని పనులు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదు గ్రామపంచాయతీలు ఆంధ్రాలోకి వెళ్లిపోయినాయని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేక సమావేశమై ఆ ఐదు గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలుపుతామని అన్నారని తెలిపారు. ప్రస్తుతం గోదావరి వరద 53 అడుగులు దాటి మూడో ప్రమాద హెచ్చరిక నడుస్తున్నదని చుక్క నీరు భద్రాచలం పట్టణంలోకి రాకుండా అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. ముంపు మండలాలలో కరెంటు సమస్య రాకుండా చర్యలు తీసుకున్నామని, వరదలకు రోడ్లు తెగిపోకుండా మండలాలలోని అప్రోచ్ రోడ్లను వరదల సమయంలో మూసివేసి వరదలు తగ్గగానే మరల రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరదల వలన రైతుల పంట పొలాలలో నీరు ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులు, యూరియా, డీఏపి విత్తనాలు అందించడానికి సిద్ధంగా ఉంచామని వైద్యశాఖ పరంగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకున్నామని, అన్ని పీహెచ్సీలలో సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలకు వైరల్ ఫీవర్స్ గాని విష జ్వరాలు గానీ ప్రబలకుండా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరికీ పరీక్షలు జరిపి సరిపడ మందులు అందజేస్తున్నారని అన్నారు. సివిల్ సప్లై ద్వారా పునరావాస కేంద్రాలకే కాక వరద ముంపు 07 మండలాలకు అడ్వాన్సుగా 4వేల క్వింటాళ్ల బఫర్ స్టాక్ సిద్ధం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులకు ఎస్‌హెచ్‌జి గ్రూప్ మహిళల ద్వారా మంచి ఆహారాన్ని సరఫరా చేస్తున్నామని అన్నారు. పంచాయతీరాజ్ రోడ్లు స్కూల్ భవనాలు, ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ బీసీ వెల్ఫేర్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆ శాఖలకు సంబంధించిన అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. వరద అనేది చెప్పి రాదని ఏ సమయం కైనా వరద పెరగవచ్చనే ఆలోచన మనసులో అనుకొని ఆ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని ఏ సంఘటన జరిగినా వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకొని రావాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఏ సమస్య వచ్చినా ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన అధికారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్పీ అంకిత్, ఆర్డీవో దామోదర్ రావు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణకు ఇస్తాం...

- ప్రాజెక్ట్‌కు ఎవరు ఇవ్వాలి అనేది ఆలోచన చేస్తున్నాం
- ఆంధ్రా మంత్రులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రాజెక్ట్ కింద సాగు విస్తీర్ణం ఆంధ్రాలోనే అధికంగా ఉంది, ఆ ప్రాజెక్ట్ గండితో అత్యధికంగా నష్టపోయిన గ్రామాలు మావే అని అవి పరిశీలించడానికి వచ్చామని, నిర్వహణ కోసం కొంత వ్యయం భరించడానికి సిద్ధమే కానీ ప్రాజెక్ట్ తెలంగాణలో ఉన్నందు తెగిపోయిన కట్ట మరమ్మతులు ఎవరు భరించాలని ఆలోచన చేస్తున్నాం అని ఆంధ్రా మంత్రులు వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్ట్ వరద ముంపు ఆంధ్రా గ్రామాలను పరిశీలించి, నిర్వాసితులను పరామర్శించడానికి శనివారం విపత్తు నిర్వహణ శాఖ, ఉప ముఖ్యమంత్రి వంగలపుడి అనిత, జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజులు ఏలూరు జిల్లా వెలేరుపాడు, కుక్కునూరు మండలాల పర్యటనకు వెళ్తూ అశ్వారావుపేటలోని కెమీలాయిడ్స్ అతిథిగృహంలో కొద్ది సమయం సేదతీరిన అనంతరం అల్పాహారం స్వీకరించిన సందర్భంగా అశ్వారావుపేట మీడియాతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖలు సమావేశం ఏర్పాటు చేసి ఏ నిర్ణయం అయినా ప్రకటిస్తామని అన్నారు. తెలంగాణ తేదేపా అశ్వారావుపేట నియోజక ఇన్‌చార్జి కట్రం స్వామి దొర, మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీను వాసు రావు, అంకోలు వెంకటేశ్వరరావు, పోతురాజు నానిలు ఆంధ్రా మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసారు.

పాఠశాలలో రెయిన్ డే...

కొత్తగూడెం : కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని న్యూ గొల్లగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్ నందు శనివారం వర్షాకాలం సందర్భంగా" రెయిన్ డే సెలెబ్రేషన్స్" జరిగాయి. ఇందులో భాగంగా రంగు రంగుల గొడుగులతో పిల్లలు రెయిన్ కోట్లను ధరించారు. రెయిని డేలో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. కరస్పాండెంట్ రామిశెట్టి వెంక టేశ్వర రావు వర్షాకాలంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రిన్సిపాల్ మౌని ప్రియ, ఉపాధ్యాయులు ధర్మపియ. పృథ్వీలత, మహేశ్వరి, అన్నపూర్ణ, చందన, మౌనిక రెయినిడే టిటిని వివరించి, ఉత్సాహంగా పిల్లలతో చేయించారు.

అక్రమ రవాణా దారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి : అక్రమ రవాణా చేసే వారి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఐ సురేష్ శనివారం మండల ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఏఐడీ) సంస్థ ఆధ్వర్యంలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది నానాటికి వివిధ రూపాల్లో మారుమూల గ్రామస్థాయిలో కూడా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెరుగు శ్రీనివాస్ మాట్లాడారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అనుమానం వస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి, లేదా డైల్ 100 నెంబర్‌కు, లేదా 1098కు ఫోన్ చేసి తెలపాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఏఐడీ సంస్థ బాధ్యులు కుటుంబరావు, మాన్ సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.







కార్మిక నేత కూకట్ల శంకర్ ధన్యజీవి

సేవలు మరువలేనివి సంతాప సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

- నివాళులర్పించిన ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు

నవతెలంగాణ-ఇల్లందు



నిరంతరం కార్మికుల పక్షాన సమస్యలపై పోరాడిన నేత కూకట్ల శంకర్ ధన్యజీవని వారి సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) ఉమ్మడి ఇల్లందు డివిజన్ నేత కూకట్ల శంకర్ అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక 2 నంబర్ బస్తీలోని వారి గృహంలో శనివారం సంతపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, రాష్ట్ర నాయకులు పీ.సోమయ్య, కాసాని ఐలయ్య, గిరిజన సంఘం నేత వీరభద్రంలు శంకర్ మృతదేహాన్ని సందర్శించారు. శంకర్ భార్య రత్న కుమారి, కొడుకు సునీల్, అక్కలు, ఈశ్వరమ్మ మేనమ్మలను ఓదార్చారు. కుటుంబానికి సంతాపం తెలిపారు. మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో మాట్లాడారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ సీపీఐ(ఎం), సింగరేణి, భవన నిర్మాణ సంఘాలను బలోపేతం చేయడంలో ఎనలేని కృషి సల్పారని అన్నారు.

క్రమశిక్షణ, పోరాట పటిమ గల నేత కూకట్ల శంకర్

సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు

క్రమశిక్షణ, పోరాట పటిమగల నేత కూకట్ల శంకర్ అని సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు అన్నారు. శనివారం శంకర్ మృతదేహాన్ని ఎం.సాయిబాబు, సింగరేణి కాలరీస ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు, గౌరవాధ్యక్షులు పి.రాజారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, పాండు, జాజిరి శ్రీనివాస్, కొడిశాల రాములు, మహబూబాబాద్ జిల్లా సీఐటీయూ నేత కుంట ఉపేందర్, నవతెలంగాణ ఖమ్మం రూరల్ ఇన్‌చార్జి గుమ్మడి నరసయ్య శంకర మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఐటీయూ రాష్ట్ర, జిల్లా కమిటీల తరపున సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో పాల్గొని ప్రసంగించారు. సీఐటీయూ ఇచ్చిన పిలుపులో పాల్గొంటూ క్రమశిక్షణ, పోరాట పటిమగల నేతగా కూకట్ల శంకర్ పని చేశారని కొనియాడారు.

చిన్న తనం నుండి పార్టీ బాధ్యతలు చేపట్టారని ఎమర్జెన్సీ కాలంలో పర్స సత్యనారాయణ, ఏలూరి లక్ష్మీనారాయణకు కొరియర్‌గా పని చేసిన మహనీయుడు అని అన్నారు. కార్మిక సమస్యలపై అవగాహనతో ఎత్తుగడలు వేసి పనిచేసే వారని అన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు.

మున్సిపల్ చైర్మెన్, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, టీడీపీ నేతలు నివాళి

మున్సిపల్ చైర్మెన్ దమ్మాల పాటి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ డిండిగల రాజేందర్, సీపీఐ నాయకులు సింగు నరసింహారావు, డీ.శంకర్, బంధం నాగయ్య, విద్యా వేత్త నాగిరెడ్డి, ఐఎన్టీయుసీ నేత వెంకటనారాయణలు, ముద్రగడ వంశీ కూకట్ల శంకర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో మాట్లాడారు.

సీఐటీయూ, సీపీఐ(ఎం), ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మండల కమిటీలు నివాళి

నిరంతర శ్రమజీవి, కార్మిక నేత కూకట్ల శంకర్ మృతదేహానికి సీపీఐ(ఎం) నియోజకవర్గ ఇన్‌చార్జి దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి అబ్దుల్ నబి, సీఐటీయూ మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్, రావు, సంధ్య, సుల్తానా, వెంకటమ్మ, మాదారపు వెంకటేశ్వర్లు, జైబున్నిస, అబ్బాస్ మరియా, హరికృష్ణ, అభిమన్యు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంతిమయాత్ర కన్నీటి వీడ్కోలు

శంకర్ అంతిమయాత్ర శనివారం జరిగింది. తమ ప్రియతమ నేతను కడసారి చూసేందుకు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పార్టీలకతీతంగా ప్రజలు, సింగరేణి, భవన నిర్మాణ, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, రిటైర్డ్ కార్మికులు తరలివచ్చారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం), సీఐటీయూ నేతలు ఎర్రజెండాలు చేతబూని అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆశయాలు సాధిస్తాం, కుకట్ల శంకర్ అమర్ రహే అంటూ నినాదాలు ఇచ్చారు.

గోదావరి జల వలయం...

- భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి పైకి వరద నీరు
- స్తంభించిన రాక పోకలు
- వరద నీటిలో తేలాడుతున్న సీతా నార చీరల కుటీర ప్రదేశ సముదాయాలు





నవతెలంగాణ-దుమ్ముగూడెం

గోదారమ్మ ఉగ్రరూపం దాల్చి జల వలయంలా గ్రామాలను, రహదారులను చుట్టు ముట్టేసింది. దీంతో ఆయా గ్రామాలకు రాక పోకలు పూర్తిగా నిలిచి పోగా భద్రాచలం ప్రదాన రహదారిపై పలు చోట్ల గోదావరి వరద చేరడంతో వాహన రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి.

గత 15 రోజులుగా ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఎగువనున్న ప్రాజెక్టుల నుండి భారీగా లక్షల క్యూసెక్కుల వరద నీరు గోదావరిలోకి రావడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి తూరుబాక, బుర్ర వేముల, పర్ణశాల వెళ్లే రహదారిలో సబ్ స్టేషన్, చర్ల మండలం టపా వాగు గోదావరి వరద ముంచెత్తడంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతోపాటు సున్నం బట్టి బైరాగులపాడు గ్రామాల మధ్య గోదావరి వరద నీరు చేరడంతో సున్నంబట్టి గ్రామస్తులు నాటు పడవల ద్వారా రాకపోకలు సాగించారు. పర్ణశాల వద్ద సీతానార చీరల ప్రదేశ దుకాణ సముదాయాలు పూర్తిగా నీట మునిగాయి. పర్ణశాల విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు, గంగోలు డబుల్ బెడ్ రూమ్ ఆవరణ చుట్టు గోదావరి వరద నీరు చేరుకుంది. తహసీల్దార్ మణిధర్, బొడ్డు అశోక్ ఇతర మండల అధికారులు గోదావరి ముంపు గ్రామాలైన సున్నం బట్టి, కాశినగరంతో పాటు పర్ణశాల సబ్ స్టేషన్ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు పునరావస కేంద్రాలకు కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఇష్టమైన క్రీడలలో తర్ఫీదు ఇచ్చి, రాష్ట్రస్థాయి కాక జాతీయస్థాయిలో పథకాలు సాధించే విధంగా సంబంధిత కోచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పాల్వంచ డివిజన్లోని కిన్నెరసాని క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు వారికి నచ్చిన క్రీడలకు సంబంధించిన క్రీడలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సంబంధిత కోచులు, క్రీడల అధికారి విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడలలో పాల్గొన్నప్పుడు వారి నైపుణ్యాలను పరిశీలించాలని అన్నారు. క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు మెనూ ప్రకారం వారికి బలవర్ధకమైన ఆహారం ప్రతిరోజు అందించాలని అన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాకారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ క్రీడలకు సంబంధించిన పరికరాలు అందిస్తానని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాలరావు, వాలీబాల్ కోచ్ వాసు, అథ్లెటిక్ కోచ్ రాంబాబు, ఆర్చరీ కోచ్ ప్రసాద్, కబడ్డీ కోచ్ కల్తీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29న ఉచిత బస్ పాస్ శిబిరం

నవతెలంగాణ-టేకులపల్లి

ఈ నెల 29న మండల కేంద్రమైన టేకులపల్లిలోని బోడు సెంటర్ సమీపంలో వికలాంగులకు ఉచిత బస్ పాసుల శిబిరం కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ మలగం దేవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు శనివారం శిబిరం నిర్వాహకులు ఇసనపల్లి శ్యాముల్, బి.నరేందర్ కుమార్‌లు తెలిపారు. మండలంలో అర్హులైన వారికి ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత బస్ పాస్ పంపిణీ చేయబడునని తెలిపారు. అర్హులైన వికలాంగులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, ఒక ఫోటో, ఆన్లైన్ చార్జీ కోసం రూ.50 వారి వెంట తీసుకు రాగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న వికలాంగులు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

త్రివేణి పాఠశాలలో బోనాల జాతర

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



లక్ష్మీదేవి పల్లిలో ఉన్న త్రివేణి పాఠశాల ప్రాంగణంలో ఆషాడం బోనాల వేడుక నిర్వహించారు. ఈ వేడుకల్లో పోతురాజుల వేషధారణ, శివశక్తుల పూనకాలతో పాటు బోనాలను నెత్తిన మోస్తూ సాంప్రదాయ దుస్తులతో చిన్నారులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొనియాడుతూ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీష్, సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ సింగ్, వై.వి.సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, ఫాతిమా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి కోసం కొనసాగుతున్న రిలే దీక్షలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మండల కేంద్రంలో వంద పడకల హాస్పటల్ కొనసాగించాలని కోరుతూ అఖిల పక్ష నాయకులు చేపట్టిన దీక్షలు శనివారానికి ఐదోరోజుకు చేరుకుంది. ఈనెల 29న జరిగే మహాధర్నాకు అఖిలపక్ష నాయకుల పిలుపునిచ్చారు. ఈ దీక్షను ఉద్దేశించి టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొండ బాల కరుణాకర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు తిమ్మిరి హనుమంతరావు, సీపీఐ జిల్లా నాయకులు పగిళ్ల వీరభద్రం, బీఆర్ఎస్ మండల నాయకుడు గంట కృష్ణ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, మాస్ లైన్ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము పుల్లయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

నవతెలంగాణ-ములకలపల్లి

మోటర్ల దొంగతనం కేసును శనివారం ఎస్ఐ కే.రాజశేఖర్ చేధించారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములకలపల్లి మండలం జిన్నెల్లగూడెం గ్రామంలో ఈనెల 15న 4 మోటర్లు దొంగతనం జరిగిందని జిన్నెలగూడెం గ్రామానికి చెందిన రైతులు మీడియం గోపాలరావు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా శనివారం కంపగూడెం క్రాస్ రోడ్డు నందు కె. రాజశేఖర్ వాహన తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా నలుగురు తారాసపడ్డారు. అట్టి వ్యక్తులను విచారణ చేయగా మోటర్లు దొంగతనం చేసినది మేమేనని చెప్పారు. ఒక్కొక్క మోటర్‌ను రూ.14 వేలకు అమ్మినట్లు తెలియజేశారు. నిందితులని రిమాండ్ చేసినట్లు చెప్పారు. మోతు శీల అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలియజేశారు.

భూత వైద్యం పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసం

బైండోవర్ కేసు నమోదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భూత వైద్యం పేరుతో అమాయక ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బొడ్డు అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.... దమ్మపేట మండలానికి చెందిన రేపల్లె తిరుపతి అనే వ్యక్తి మండలంలో గత కొంతకాలంగా తిరుగుతూ భూత వైద్యం పేరుతో భూతం పట్టిందని ప్రజలను నమ్మిస్తూ, దానిని తాను తరిమికొడతానని, అందుకు 5 వేల వరకు ఖర్చు అవుతుందని నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇందులో భాగంగా పసుపుకు వాషింగ్ సోడా కలపగా వచ్చే ఎరుపు రంగును ఆసరాగా చేసుకుని మీ ఇంట్లో భూతం ఉందని లేదా దీనివల్ల మీకు అనారోగ్యం ఉందని నమ్మించి డబ్బులు వసూలు చేసేవాడు. అలాగే సంతానం లేని వారిని, అనారోగ్యంగా ఉన్న వారిని గమనించి సంతానం కలిగేలా చేస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసేవాడు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన స్థానికులు మోసగాడని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దుమ్ముగూడెం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ప్రజలు మూఢ నమ్మకాలు నమ్మవద్దు అని అన్నారు. ఇటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలు పోలీసు వారికి సమాచారం ఇస్తే అట్టివారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విధి నిర్వహణలో ఏఎస్సైకి గుండె పోటు

చికిత్స పొందుతూ మృతి

నవతెలంగాణ-చండ్రుగొండ

విధి నిర్వహణలో ఉన్న ఏఎస్సై గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చండ్రుగొండ పోలీస్ స్టేషన్ లో ఏఎస్సై గా విధులు నిర్వహిస్తున్న ఉబ్బన శ్రీనివాసరావు (60) శుక్రవారం అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండల పర్యటనలో విధి నిర్వహణలో భాగంగా బందోబస్తు కు వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జి స్వప్న సందర్శించి నివాళులర్పించారు.

వరద ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

ఎంపీఓ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పినపాక

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సహకరించాలని ఎంపీఓ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం టీ కొత్తగూడెం, సింగిరెడ్డిపల్లి, జానంపేట, రాయి గూడెం, ఎల్చిరెడ్డిపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యువత స్వచ్ఛంద సంస్థ సభ్యులు సహకారం అందించాలని కోరారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉన్నట్లు తెలియజేశారు. పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవ తెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేస్తున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్ స్టేషన్ పరిధిలోని ఏదులాపురం, తెల్దారుపల్లి, మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉపకేంద్రం ఏఈ క్రాంతిసింహా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దతండాలో చెట్లకొమ్మలు తొలగింపు చేపడుతున్నందున జలగంనగర్ లో కూడా ఉదయం 8 గంటల ఉదయం 11గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతుని కుటుంబానికి బియ్యం వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

బీక్యాతండాకు చెందిన మృతుడు దారావత్ ప్రశాంత్ కుటుంబానికి సేవా పౌండేషన్ క్వింటా బియ్యంను శనివారం అందజేసింది. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచనలతో స్పందించిన సేవా పౌండేషన్ అధినేత డాక్టర్ గుగులోత్ శంకర్‌నాయక్ బియ్యంను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సపావట్ నాగులు, భూక్యా బాలు, వాంకుడోత్ రవి, కస్నా తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత జూనియర్ కళాశాల విద్యార్థులు అబ్దుల్ కలాం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మోదుగు వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్కంపూడి కృష్ణమూర్తికి పోతినేని నివాళి

నవతెలంగాణ-తల్లాడ



జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి శనివారం ఉదయం అనారోగ్యంతో బిల్లుపాడులోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కంపూడి మరణం జిల్లాకు తీరని లోటని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణ కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య, ముచ్చింతల చెన్నయ్య, గుంటుపల్లి వెంకటయ్య, మన్నేపల్లి రామారావు, పేరసాని వెంకటయ్య తదితరులు ఉన్నారు.

జలశక్తి అభియాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ

భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా చేపడుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని క్యాచ్ ద రైన్, వేర్ ఇట్ ఫాల్స్, వెన్ ఇట్ ఫాల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశం మందిరంలో జలశక్తి అభియాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో క్యాచ్ థ రైన్ వెన్ ఇట్ ఫాల్స్ అంశం పై కేంద్రం ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం తీసుకోవాల్సిన చర్యల పై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ జల్ శక్తి అభియాన్ అనేది దేశంలో నీటి భద్రత, నీటి సంరక్షణను నిర్ధారించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం అన్నారు. గ్రామాలలో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మాణం, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం, అటవీ పునరుద్ధరణ వంటివి చేపట్టాలని తెలిపారు. జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి జలశక్తి అభియాన్ క్యాచ్ థ రైన్ క్యాంపెయిన్ చేపట్టాలి అన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలలో అవగాహన పెంచాలని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలు అమలు చేయాలని తెలిపారు. గ్రామసభల ద్వారా గ్రామాలలో నీటి సంరక్షణ పనులను గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి కిష్ట గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కే. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందన, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, నీటి పారుదుల శాఖ ఈ ఈ అర్జున్ రావు, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్.రవి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, పాల్వంచ ఇల్లందు మణుగూరు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం వద్ద 3వ ప్రమాద హెచ్చరిక జారీ

భద్రాచల పట్టణం వద్ద శనివారం సాయంత్రం 4:16 గంటలకు నీటి ప్రవాహం 53 అడుగుల స్థాయికి చేరుకోవడంతో మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు జిల్లా యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. అధికార యంత్రాంగం, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలు ఇళ్ళ నుండి బయటకి రావొద్దని, అత్యవసర సేవలకు కంట్రోల్ రూము నంబర్లుకు కాల్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ -కూసుమంచి



తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పాలేరు గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం జుజ్జుల్‌రావుపేటలో, తురకగూడెం నుంచి కిష్టాపురం వరకు, తురకగూడెం నుంచి చింతల తండా గ్రామాల వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగే సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభకు, ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగే శేషు కుమార్ సంవత్సరీకానికి మంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 5:30 గంటలకు చింతకాని మండలం జగన్నాథపురంలో కోలేటి సూర్య ప్రకాష్ రావు కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ఖమ్మంలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద ఖలీల్ తల్లి చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదారుస్తారని తెలిపారు. మంత్రి పాల్గొనే ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ విద్యార్థుల చేతిలో డిగ్రీ విద్యార్థి మృతి

పాత కక్షల నేపథ్యంలోనే హత్య నా..?

మరే కోణం ఏదైనా ఉందా..?

నవతెలంగాణ - పాల్వంచ రూరల్



విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారి తీసింది. సంఘటన మండల పరిధి లక్ష్మీదేవి పల్లి పంచాయతీ డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి యానం బైలుకు చెందిన అల్లూరి విష్ణు(21) పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం డిగ్రీ విద్యార్థి విష్ణు తో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. గొడవ నేపథ్యంలో మూకుమ్మడిగా విష్ణు ను కొట్టి, తీవ్రంగా గాయపర్చారు. సహ విద్యార్థులు విష్ణును హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు సూచించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య చోటు చేసుకుందా..? లేక మరో కోణం ఏదైనా ఉందా.. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగా తల్లిదండ్రులు అల్లూరి రామ్మూర్తి, స్వరూప లకు విష్ణు ఏకైక సంతానం. రామ్మూర్తి ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటుండగా, తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో భద్రాద్రి బ్యాంక్

నవతెలంగాణ-ఖమ్మం



అభివృద్ధి పథంలో భద్రాద్రి బ్యాంక్ ప్రయనిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ డా.కృపాసాగర్ అన్నారు. భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 27వ వార్షిక మహాజన సభ శనివారం వాసవి నగర్‌లోని వాసవి గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జస్టిస్ కృపాసాగర్ హాజరై మాట్లాడుతూ.. పరస్పర సహకరంతోనే మానవ మనుగడ ఆదిమ యుగాల నుంచి అత్యున్నత నాగరిక యుగంలోకి ప్రవేశించిందని అన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన బ్యాంకు చైర్మెన్ చెరుకూరి కృష్ణమూర్తి బ్యాంకు 27వ వార్షిక నివేదిక ద్వారా బ్యాంకు అభివృద్ధిని తెలియజేశారు. ప్రత్యేక అతిథిగా జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షిద్ పాల్గొని బ్యాంక్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్, డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రాజగోపాల్, బ్యాంక్ వైస్ చైర్మెన్ వేములపల్లి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు రేఖల భాస్కర్, దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, సాంబమూర్తి, నర్మద, కపిల్‌వాయి జయప్రద, పనస శిల్ప, బ్యాంకు పాలన ప్రధాన అధికారి దాసరి వేణుగోపల్, వివిధ శాఖల మేనేజర్లు సత్యనారాయణ, నరసింహారావు, శ్యామ్‌సుందర్, రామారావు, గణేష్ బాబు పాల్గొన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసాద్ వందన సమర్పణతో సభ ముగిసింది.

పంట పొలాల సందర్శన

• జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

నవతెలంగాణ-కల్లూరు

ఖరీఫ్‌లో సాగుచేసిన పంట పొలాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల సందర్శించారు. మండల పరిధిలోని పడమర లోకవరం గ్రామంలో సాగుచేసిన వరి, పత్తి, మామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కరివేద చల్లడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. కరివేద సాగుచేసిన రైతులు వరిలో కలుపు నివారణ కావడం లేదని దానివల్ల ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రెండుసార్లు కలుపు మందు పిచికారి చేయాలని సూచించారు. పత్తి పంటను పరిశీలించి రైతుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వం రుణమాఫీ చేసిందని రుణమాఫీ రైతుల్ని వారి గృహాలకు వెళ్లి రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. పుల్లయ్య బంజర కల్లూరు పట్టణం కూడా పలు రైతులని కలిసి అభిప్రాయలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మలను శాలవా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రూపా, ఏఈఓ దీపిక, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కల్లూరు పట్టణ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ పరిశీలిన

నవతెలంగాణ-కూసుమంచి

మండల కేంద్రంలోని ఎస్టి హాస్టల్‌ను శనివారం గిరిజన సంఘం నాయకులు గన్యనాయక్ సంఘం సభ్యులులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గన్యనాయక్ మాట్లాడుతూ...హాస్టల్‌లో ప్రధానమైన సమస్యలు గుర్తించడం జరిగిందని, హాస్టల్లో నిబంధనల ప్రకారం ఐదుగురు వర్కర్లు పనిచేయాలని, కానీ ఇద్దరు వర్కర్లతోనే హాస్టల్ నిర్వహణ నిర్వహిస్తున్నారని తెలిపారు. బిల్డింగ్ పెచ్చులు ఊడుతున్నాయి, లెట్రిన్ బాత్రూం సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టల్ ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన సంఘం నాయకులు అజ్మీర శంకర్ నాయక్, అజ్మీర సైదుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

• జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం

ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులపై పెట్టిన అక్రమ కేసులు బేషరతుగా ఎత్తివేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి ప్రభుత్వం నిధులు తగ్గించిందని జనగామ జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించాలని సరిపోవని నినదించారని ఆందోళనలలో పాల్గొంటే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఐ శ్వేతపై ఒత్తిడి తెచ్చి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం పై అక్రమ కేసులు బనాయించారని, ఈ అక్రమ కేసులు తక్షణమే బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేసులు ఎత్తివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై వర్క్ షాపు

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే. అబ్దుల్ కలాం తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా సీపీఆర్‌పై వర్క్ షాపు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ.మాలతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులందరికి సీపీఆర్‌పై రాష్ట్ర శిక్షకుడు డాక్టర్ బాలకృష్ణ శిక్షణను ఇచ్చి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.మాలతి మాట్లాడుతూ సీపీఆర్ అనేది మనిషికి ఆపద కాలములో ఆదుకునే పునర్జన్మ లాంటి సహకారం అని చెప్పారు. ప్రతి ఉద్యోగి తమ పని వేళలో పని చేసుకుంటూ, మధ్యలో దొరికిన సమయాన్ని ఉత్సవాస నిశ్వాస ప్రక్రియలో నిగం నిమగ్నం అవుతూ మెడిటేషన్ చేసుకుంటూ, ఉపరితిత్తుల సమస్య నుంచి దూరంగా ఉండాలని చెప్పారు. ప్రతి ఉద్యోగి సీపీఆర్ శిక్షణను నేర్చుకొని ఎవరికైనా హార్ట్ ఎటాక్ సంఘటనలు ఎదురైనప్పుడు ఆ వ్యక్తి ప్రాణాన్ని కాపాడవచ్చు అన్నారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద క్యాజువాలిటీ కేసులలో 1.5 మిలియన్ కేసులు సీపీఆర్‌పై అవగాహన లేనందుకు తన ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలాం వర్ధంతి రోజున దేశమంతటిలో సీపీఆర్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించినట్టు తెలిపారు. శిక్షకుడు డాక్టర్ బాలకృష్ణ సిబ్బంది అందర్నీ ప్రత్యక్షంగా మ్యాని క్వీన్‌నీ ఉపయోగించి సీపీఆర్ ఎలా చేయాలో నేర్పించారు. ఈ వర్క్‌షాప్ అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామారావు, డాక్టర్ భాస్కర్, డాక్టర్ రమణ, డాక్టర్ మోతియా, డెమో కాశీనాథ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించే సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ ను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సభలో కేంద్ర కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, నాయకులు రమ, కేజీ రామచంద్ర, కే. రంగయ్య, గుమ్మడి నరసయ్య, గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడతారని తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం గుట్టల బజార్లో గల ఏసి ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఏర్పడిన ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుమ్మడి శ్రీనివాస్ వారి పాలకవర్గం కార్యవర్గం ప్రమాణ స్వీకారం మహోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ విచ్చేసి సంఘ పాలకవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...నగర ఆర్యవైశ్య సంఘ తక్షణ మాజీ అధ్యక్షులు గోల రాధాకృష్ణమూర్తి, ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామిగా నిలిపి రికార్డు స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన గుమ్మడెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యక్ష ఎన్నికల్లో నాకు ఓటు వేసిన ఆర్యవైశ్య సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులుగా గోళ్ళ రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాశెట్టి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాయపూడి రవికుమార్, కోశాధికారి రాయపూడి జయరాం, ఉపాధ్యక్షులు వూటూరి లక్ష్మీనరసింహారావు , ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటుపల్లి దివాకర్ గుప్తా , అదనపు కార్యదర్శి ఎడమ కంటి రామారావు, అదనపు కోశాధికారి కూరా శ్రీనివాస్ , ప్రోగ్రాం కమిటీ చైర్మెన్ బూర్లె పుల్లారావు, యువజన విభాగం అధ్యక్షులుగా పబ్బతి ప్రదీప్, విద్యానిధి చైర్మెన్‌గా డాక్టర్ డి పి సి రావు మరియు వివిధ కమిటీలకు చైర్మన్‌గా కో చైర్మన్గా సంఘ ఉపాధ్యక్షులుగా సంయుక్త కార్యదర్శి కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారందరికీ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవీ ప్రమాణం చేసిన ఆర్యవైశ్య కార్యవర్గం నుండి పేద ఆర్యవైశ్యులకు ఒక కుటుంబానికి కుట్టు మిషన్, ఒక కుటుంబానికి గ్రైండర్ ఏడుగురు విద్యార్థులకు స్కాలర్షిప్ల, 20 మంది పేద ఆర్యవైశ్య కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించారు.

జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కారేపల్లి

ఇండోటిబెట్ బోర్డర్ పోలీస్ కి చెందిన తేజావత్ బాలజీ ఇటివల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఐటీబీపీ 2007 బ్యాచ్, తెలుగు మిత్రులు కలిసి రూ. 1.20 లక్షలను శనివారం అందజేశారు. ఆర్థికసాయాన్ని ఐటీబీఐ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ హలవత్ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్, కారేపల్లి ఎస్సై ఎన్. రాజారాం చేతుల మీదుగా జవాన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన తేజవత్ బాలాజీ ఐటీబీపీ జవాన్ గా 2007 నుండి ఫోర్సులో 17 ఏండ్లు దేశంలోని అతి కఠినమైన ఇండియా, చైనా సరిహద్దులో దేశానికి సేవలు అందించారు. ఈనెల 19 వ తేదీన అనారోగ్యం మృతి చెందారు. ఆయన కుటుంబానికి మేమున్నామంటూ ఐటీబీపీ 2007 బ్యాచ్ అక్కడి తెలుగు మిత్రులు మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీబీపీ జవాన్లు కిషన్, సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

• రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

నవతెలంగాణ-బోనకల్



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బంధం నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు కోరారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని కొండా నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, మల్టీ పర్పస్ వర్కర్ మండల అధ్యక్షుడు మరీదు పుల్లయ్య, రైతు సంఘం మండల నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, సీఐటీయూ మండల నాయకులు బూర్గుల అప్పాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అన్ని వర్గాలకు హామీల వర్షం కురిపించిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఆటో యూనియన్ నాయకుడు ఉంగుటూరు రమేష్ మాట్లాడుతూ ఉచిత బస్సు సౌకర్యం వలన ఆటో డ్రైవర్లు ఉపాధి లేక వీధిని పట్టారని, ప్రతి డ్రైవర్‌కు నెలకి రూ. 20 వేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎస్టీయూసీ మండల అధ్యక్షుడు బంధం అనిల్ కుమార్, రావినూతల మాజీ ఎంపీటీసీ గండు సైదులు, గీత కార్మిక సంఘం నాయకులు పెద్దపోలు కోటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రావుట్ల రామాచారి, ఏఐటీయూసీ మండల నాయకులు ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 7.31 శాతం నిధులు కేటాయించడం అన్యాయం

నవతెలంగాణ-ఖమ్మం

విద్యారంగానికి 7.31 శాతం నిధులు కేటాయించడం అన్యాయం అని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర కోతలను మిగిల్చారని ఆరోపించారు. ఈ కేటాయింపులు విద్యారంగా అభివృద్ధికి ఏమాత్రం సరిపోవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఉమాశంకర్, సర్వేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కామేపల్లి

మండలపరిధిలోని జోగూడెం ప్రభుత్వ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు సాగర్, నాగయ్యలను గ్రామస్తులు, ఆపాఠశాలకు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగు వారి విధుల్లో సమర్ధవంతంగా పనిచేసినప్పుడు ప్రజలమన్ననలు పొందుతారు. వారు ఇంతకాలం పని చేసిన సేవలను గుర్తించి గ్రామస్తులు సన్మానించడం అభినందనియం. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జర్పల రవిందర్, ఆ పాఠశాలల విద్యాకమిటి చైర్మెన్ భద్రి, రేషన్ డీలర్ ద్రౌపతి, ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులు మున్య, గ్రామస్తులు రమేష్, అశోక్, వినోద్, విజయ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నా...

- వాస్తవ పరిస్థితులను అంగీకరించిన తీరు భేష్
- విద్యారంగ మెరుగుదలకు సూచనలు స్వీకరించాలి :ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్వాగతించారు. రాష్ట్రానికి ఉన్న అప్పులను చెబుతూ, వాటిని అధిగమిస్తామన్న తీరు బాగుందని అభినందించారు. శాసనమండలిలో శనివారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎక్కువ కాలం పాలించామనీ, సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకుంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్న ఆత్మవిశ్వాసాన్ని కనబరిచారని తెలిపారు. గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాదిరిగా ఉరుములు, మెరుపులు లేకుండా సాదాసీదాగా ప్రస్తుత బడ్జెట్ ఉందని చెప్పారు. ప్రజలను సంపన్నులను చేసే భావనను వ్యక్తీకరించిన సర్కారు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఐదు బడ్జెట్ సమావేశాల్లో తాను రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై హెచ్చరిస్తూనే ఉన్నప్పటికీ పట్టించుకోలేదని గుర్తుచేశారు. 2023-24 బడ్జెట్ ప్రసంగంలో ...వైద్యరంగంలో అగ్రగామిగా ఎదుగుతూ మూడో స్థానంలో ఉన్నట్టు చెప్పుకున్నారని తెలిపారు. 2024-25 బడ్జెట్ ప్రసంగంలో... అందుకు భిన్నంగా వైద్యవ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని వాస్తవాన్ని



అంగీకరించారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం చేయకుండా పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలెందుకని తాను సూచించినట్టు తెలిపారు. పట్టణాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు సేవలందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తాజా బడ్జెట్‌లో విద్యారంగం బలోపేతం దిశగా పాఠశాలలు, కళాశాలలకు సదుపాయాలు సమకూరుస్తామని హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో విద్య అంటే కేవలం గురుకులాలే అన్నట్టుగా మాట్లాడారని విమర్శించారు. గత పదేండ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల శాతం తగ్గి ప్రయివేటు బడుల్లో పెరిగిందని తెలిపారు. 2014లో ప్రభుత్వ బడుల్లో 51 శాతం మంది చదువుకుంటే 2024 నాటికి అది కాస్తా 46 శాతానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో సమూల మార్పుల కోసం పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మార్పుల కోసం తమ సూచనలను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీన జీతాలిస్తున్నందుకు ప్రభుత్వాన్ని అభినందించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ సమయానికి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఏడాది రూ.వెయ్యి చొప్పున వారి జీతాలు పెంచాలని పీఆర్సీ చేసిన సిఫారసును అమలు చేయాలని అన్నారు. గురుకులాలు, కేజీబీవీల్లో నైట్ డ్యూటీల కోసం ప్రత్యేకంగా కేర్ టేకర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రీ ప్రైమరీ విద్యను ప్రైమరీ పాఠశాలల్లోనే కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. మిడ్డే మీల్స్ బిల్లులను సకాలంలో చెల్లించాలనీ, గురుకులాలకు కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆటంకాలు లేనందున ఎంఈవో, డిప్యూటీ ఈవో పదోన్నతులు చేపట్టి ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదించి కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాల పెంపునకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ స్కూళ్లుగా మార్చిన హాస్టళ్లకు అదనపు పోస్టులను మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోడల్ స్కూళ్లు, గురుకుల ఉపాధ్యాయులు 010ను అమలు చేయాలని కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పండిట్‌లను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలనీ, సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. సాంకేతికత సాధ్యమయ్యే అవకాశమున్న 2003 డీఎస్సీ నోటిఫికేషన్‌లో సెలెక్టెడ్ వారికి ఓపీఎస్ అమలును పరిశీలించాలని సూచించారు.

ఉరుములు, మెరుపులు.. కాంగ్రెస్ బడ్జెట్‌లోనే.. :దేశపతి శ్రీనివాస్

గత బీఆర్‌ఎస్ బడ్జెట్ ఉరుములు, మెరుపులతో ఉందని అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పడం సరికాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తప్పుపట్టారు. కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన ప్రస్తుత బడ్జెట్‌లోనే ఉరుములు, మెరుపులు కనిపిస్తున్నాయని చెప్పారు.

రైతాంగంపై ప్రభుత్వానికి సోయిలేదు

- వ్యవసాయంపై ఒక్క మంత్రికీ అవగాహన లేదు
- మేడిగడ్డతో కాదు పోలవరంతోనే భద్రచలానికి ముంపు
- కాంగ్రెస్ హయాంలో ఆర్థిక పరిస్థితి దివాళా : అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైత్యాంగంపై సోయిలేదని, వ్యవసాయంపై ఒక్క మంత్రికీ అవగాహన లేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, బీఎల్‌ఆర్‌తో కలిసి శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. మంత్రులు కలెక్షన్స్‌లో పోటీ పడుతున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణకు రూ.3.47లక్షల తలసరి ఆదాయం వచ్చేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని అన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని, రైతుబంధు లేదని, విద్యుత్ ఇవ్వడం లేదని విమర్శించారు. అన్నీ అబద్ధాలే చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. కాంగ్రెస్‌లోని కీలక నాయకులంతా ఆంధ్రా బాసుల మోచేతి నీళ్లు తాగే వాళ్లని, తెలంగాణ గురించి వారికేం తెలుసని విమర్శించారు. గోదావరిలో నీళ్లు వృథాగా పోతున్నా లిఫ్ట్ చేయడం లేదన్నారు. కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రా కోసమే పుట్టినట్టుగా గతంలో పాలకులు వ్యవహరించారని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఆ నీళ్లను లిఫ్ట్ చేసి తెలంగాణకు తరలించామని చెప్పారు. కన్నెపల్లి వద్ద పంప్‌హౌస్ నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు ఎండిపోతున్నాయన్నారు. మేడిగడ్డ వద్ద 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెబుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరంపై నాటకాలు ఆడుతున్నాయన్నారు. కేటీఆర్ నాయకత్వంలో మేడిగడ్డకు తాము వెళ్లినందుకే ప్రభుత్వం సమీక్ష చేసిందన్నారు. మీకు చేతకాకపోతే చెప్పండి.. జలాశయాల వద్ద పనులను ఎలా చేయించాలో చూపిస్తామని అన్నారు. మేడిగడ్డతోకాదు పోలవరంతోనే భద్రచలానికి ముంపు ప్రమాదం ఉందని, ఆంధ్రాలో మీ బాస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది కాబట్టి పోలవరంపై మాట్లాడాలని సీఎంకు సూచించారు.

2029 నాటికి పాతబస్తీలో మెట్రో

మెట్రోలోనే చాంద్రాయణగుట్ట వచ్చి ఓట్లడుగుతాం : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ పాతబస్తీలో 2029 నాటికి మెట్రోరైల్ నిర్మాణం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శాసనసభలో శనివారం 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, పాతబస్తీ మెట్రోరైల్ నిర్మాణ పనులపై అసహనం వ్యక్తం చేశారు. ఆ పనులు ఎందుకు చేపట్టట్లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా సీఎం మెట్రోరైల్ నిర్మాణంపై హామీ ఇచ్చారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో మెట్రోరైల్‌లోనే చాంద్రాయణగుట్టకు వచ్చి కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు వేయాలని అడుగుతామని చెప్పారు. మెట్రో నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం 15 శాతం నిధులు కేటాయించాలనీ, అవి ఇవ్వకున్నా, ఆ ప్రాజెక్టును ఎలా పూర్తిచేయాలో తమవద్ద ప్రణాళికలు ఉన్నాయని స్పష్టంచేశారు. అలాగే ఎన్నికల సందర్భంగా ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిన్న పిల్లలతో ప్రచారం చేయించారనే కేసును వెనక్కి తీసుకున్నారనీ, తనపై పెట్టిన కేసులో మాత్రం చార్జిషీట్ దాఖలు చేశారని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు. దీనిపై కూడా సీఎం స్పష్టత ఇచ్చారు. అమిత్‌షా, కిషన్‌రెడ్డిపై కేసులు పెట్టింది తమపార్టీ ఉపాధ్యక్షులు నిరంజన్ అనీ, ఆ కేసులో విచారణ జరిపిన పోలీసులు ఆ కార్యక్రమ నిర్వాహకులపై కేసులు పెట్టి, కేంద్రమంత్రుల పేర్లు తొలగించారని చెప్పారు. వారిపేర్లు తొలగించడానికి వీల్లేదని తాము న్యాయపోరాటం చేస్తున్నామనీ, ఎక్కడా కేసును ఉపసంహరించుకోలేదని స్పష్టం చేశారు. ప్రధాని మోడీని పెద్దన్న అని పిలిచారనీ, దీనిపై తమకు రాజకీయ సందేహాలు ఉన్నాయని అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలపైనా సీఎం స్పందించారు. ఆదిలాబాద్‌లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో తాను ప్రధాని మోడీని పెద్దన్నలా వ్యవహరించాలని చెప్పాననీ, ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలన్నింటికీ ప్రధానమంత్రే పెద్ద కాబట్టి అలా వ్యాఖ్యలు చేసినట్టు వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మోడీని పెద్దన్న అని సంబోధించానే తప్ప, దానిలో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవన్నారు. పాతబస్తీలో శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయని అక్బరుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్, వైట్‌నర్ వాడేవాళ్ల సంఖ్య పెరుగుతున్నదనీ, దాన్ని కట్టడి చేయాలని కోరారు. స్థానిక పోలీసులకు తెలీకుండా అక్కడ ఏమీ జరగట్లేదనీ, చిత్తశుద్ధి ఉన్న పోలీస్ అధికారుల్ని అక్కడ నియమించాలని చెప్పారు. వక్ఫ్ భూముల ఆక్రమణదారుల్ని జైలుకు పంపాలని అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై గతంలో వేసిన సీబీసీఐడీ విచారణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిందన్నారు. ఎంఐఎం వత్తిళ్ల వల్లే మైనారిటీ బడ్జెట్ రూ. 3వేల కోట్లకు పెరిగిందన్నారు.

కాంగ్రెస్ నుంచి పోటీచేస్తే...నేనే గెలిపిస్తా



ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఆసక్తికరమైన రాజకీయ చర్చ అసెంబ్లీ వేదికగా జరిగింది. 2029 నాటికి మెట్రోరైల్ పూర్తిచేసి, దానిలోనే చాంద్రాయణగుట్టకు వచ్చి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించమని కోరతామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అక్బరుద్దీన్ కూడా సరదాగా వ్యాఖ్యానించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ స్థానంపై కన్నేస్తే, తానెక్కడికి వెళ్లాలని అన్నారు. తాను కొడంగల్ నుంచి పోటీచేస్తానన్నారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ, కాంగ్రెస్ బీఫామ్‌పై కొడంగల్ నుంచి పోటీచేస్తే, ఆయన్ని గెలిపించే బాధ్యతను తానే తీసుకుంటానని తేల్చిచెప్పారు.

మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలివ్వలేదు

ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, బీఎల్‌ఆర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం వరకు వేతనాలివ్వలేదని, కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న పోలీసుల అలవెన్స్‌లను సైతం పెండింగ్‌లో పెట్టిందని ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు.

మోడల్ స్కూల్స్ టీచర్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పోలీసులకు టీఏ, డీఏ అలవెన్స్‌లు ఇవ్వడం లేదన్నారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నామని గొప్పలు చెపుకుంటున్నదన్నారు. ప్రతి ఉద్యోగికీ ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలిస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో విఫలమైందన్నారు. హామీలను నిలబెట్టుకోవడం లేదని, పెన్షన్లను సైతం ఇవ్వడం లేదని విమర్శించారు.

పరస్పరం వైరుధ్యం, గందరగోళం

- బడ్జెట్ పై దేశపతి శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర బడ్జెట్ పరస్పర వైరుధ్యాలతో గందరగోళంగా ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. తలసరి ఆదాయం పెరిగిందంటూనే రాష్ట్ర ప్రగతి జరగలేదనడం సమంజసం కాదని తెలిపారు. శనివారం బడ్జెట్‌పై శాసనమండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు ఏడు నెలల్లో రూ.35 వేల కోట్ల అప్పులు చేసిందనీ, బడ్జెటేతర రుణాలుగా మరో రూ. 30 వేల కోట్లు తీసుకుందనీ, ఇంకో రూ.10 కోట్లు తీసుకునేందుకు సిద్ధమైందని చెప్పారు. అంటే ఏడాదికి రూ.లక్ష కోట్ల అప్పు చేయనున్నట్టు అర్థమవుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో తలసరి విద్యుత్ వినియోగం 1,196 యూనిట్ల నుంచి 2,349 యూనిట్లకు పెరిగిందనీ, వద్యాప్య పింఛన్లు రూ.200 నుంచి రూ.2000కు పెరిగాయని తెలిపారు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల ఊసేదని ప్రశ్నించారు.

ఎన్డీఎస్‌ఏ రిపోర్ట్ ఏది? :తక్కెళపల్లి రవీందర్ రావు

50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎస్‌ఆర్‌ఎస్పీని నిర్మించిన కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్‌ను విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్సీ తక్కెళపల్లి రవీందర్ రావు అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ రిపోర్టును బయటపెట్టాలని సవాల్ చేశారు.

బుద్ధి చెప్పినా మారరా? :మంత్రి పొన్నం ప్రభాకర్

కాళేశ్వరం ఎత్తు తగ్గించిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మారాలని సూచించారు.

హరీశ్‌రావు వర్సెస్ కూనంనేని

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమయపాలనపై అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య వాగ్వివాదం జరిగింది. బడ్జెట్‌పై కూనంనేని సాంబశివరావు 40 నిముషాలకు పైగా మాట్లాడుతుండటంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు 'మాట్లాడండి...మాట్లాడండి' అని కామెంట్ చేశారు. దీనితో కూనంనేని ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మాట్లాడితే నీకొచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. మీరెంతసేపు మాట్లాడినా మీకు టైం ఇస్తారు లెండి...అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. దీనితో కూనంనేని సీరియస్ అయ్యారు. 'నేను మాట్లాడేటప్పుడే మీకెందుకు ఇబ్బంది అవుతుంది. అనవసరంగా నన్ను కెలకొద్దు. నా ఒరిజినాలిటీ ఇది కాదు. చాలా సంయమనంతో మాట్లాడుతున్నా. నా అసలు రూపం చూస్తే మీరు తట్టుకోలేరు' అని ఘాటుగా స్పందించారు. దీనితో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్న తమకేమో స్పీకర్ తక్కువ సమయం ఇస్తున్నారనీ, ఒక్క సభ్యుడు ఉన్న సీపీఐకి అంత టైం ఎలా ఇస్తారని హరీశ్‌రావు స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు. దీనిపై స్పీకర్ సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

శాసన మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూధనాచారి

- తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్:బీజేపీ ఎమ్మెల్సీఏవీఎన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



హామీల అమలులో రాష్ట్రంలో కాగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని శాసన మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూధనాచారి విమర్శించారు. శనివారం మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన కాంగ్రెస్ హామీలను ఏకరువు పెట్టారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదని పేర్కొన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కారని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గత సర్కార్‌ను దోషిగా నిలబెడుతున్నారని వ్యాఖ్యానించారు. తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ, వ్యవసాయం, విద్యుత్, శాంతి భద్రతలు, సీసీకెమెరాల ఏర్పాటు, పచ్చదనం తదితర అంశాల్లో పదేండ్ల తెలగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడితే కరెంట్ తీగలమీద బట్టలారేసుకోవాలని చెప్పిన ముఖ్యమంత్రులు అడ్రస్ లేకుండా పోయారని అన్నారు. ఉమ్మడి ఏపీలో జరిగిన తప్పులన్నింటిని సరిదిద్దుకుంటూ పదేండ్లలో తెలంగాణను దేశంలోని నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలు హామీలిచ్చి, వాటిని అమలు చేయలేక నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నెడుతున్నారని విమర్శించారు. ఇంకా ఎన్నాళ్ళు తమను విమర్శిస్తూ బతుకుతారని ఆక్షేపించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత అని చెప్పి, నేడు బడ్జెట్‌లో వాటికి ఓటాన్ అకౌంట్ కంటే తక్కువ కేటాయించారని విమర్శించారు. "అత్మస్తుతి పరనింద" ఆపి తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ వల్లే రాష్ట్రం దివాళా తీసింది: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పదేండ్ల అవినీతి పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. శాసన మండలిలో శనివారం బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూధనాచారి విమర్శలను తిప్పికొట్టారు. 2014కు ముందు తెలంగాణలో సాగునీరే లేదనీ, కరెంటు తీగలే లేవని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. "ఆత్మస్తుతి పరనింద" అనే పదం పదేండ్ల బీఆర్‌ఎస్ పానలకే వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశంలోనే తప్పుడు ప్రాజెక్టని పేర్కొన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం నడుచుకుంటామే తప్ప బీఆర్‌ఎస్ లాగా సొంత నిర్ణయాలతో తెలంగాణ రైతులను మోసం చేయమని చెప్పారు. వాస్తవ పరిస్థితిని మరుగున పర్చేందుకు ప్రాజెక్టుల బాటపట్టారని చురకలంటించారు. దేశంలో కనుమరుగైన సాంకేతికతతో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను నిర్మించడం వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.40 వేల కోట్ల భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు లభ్యత ఎక్కడుంటే అక్కడే థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే నిబంధనలను తుంగలో తొక్కి, కమీషన్ల కోసం నల్లగొండలో ఏర్పాటు చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు న్యాయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారనీ, ఉమ్మడి ఏపీలో సైతం బొగ్గు నిల్వలు లేని కడపలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించారని చెప్పారు. ఈ సందర్భంగా గుత్తా వ్యాఖ్యలతో జీవన్‌రెడ్డి విభేదించారు. సమైఖ్య పాలనలో జరిగిన అన్యాయాన్ని ఆరోజు అందరం వ్యతిరేకించామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందిచ్చిన ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, జాబ్ క్యాలెండర్ తదితర ఆరు గ్యారంటీలన్నింటిని అమలు చేస్తామని చెప్పారు.

ఆలోచనలేకుండా హామీలు: బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి



ఆర్థిక విషయాలపై కనీస అవగాహన లేకుండా అడ్డగోలు హామీలిచ్చి వాటిని అమలు చేయలేక బీఆర్‌ఎస్ బాటలోనే తిరిగి అప్పుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తిప్పలు పడుతున్నదని బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా మూసీ పరిరక్షణ, మెట్రో విస్తరణ, డ్రగ్స్ నిర్మూలన మొదలగు అంశాలను సమర్థిస్తూనే, యువవికాసం, రైతు రుణమాఫీ, మహిళలకు పింఛన్ల పెంపు, తదితర అమలు కాని హామీలిచ్చారని విమర్శించారు. విద్య, వైద్యం లాంటి రంగాలను పక్కన పెట్టి పనికి రాని పథకాలకు దుబారా ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తమ ప్రాధాన్యతా క్రమాలను సరిదిద్దుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు.

హామీలపై బడ్జెట్‌లో స్పష్టత లేదు

బీజేపీ సభ్యులు పాయల్ శంకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు రాష్ట్ర బడ్జెట్‌లో స్పష్టతనివ్వలేదని బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ విమర్శించారు. రుణమాఫీ విషయంలో రూ. 31వేల కోట్ల అంచనా ప్రభుత్వం ఎలా వేసిందో అర్థం కావడం లేదన్నారు. నిర్దిష్టమైన గడువులోగా రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు బీమాకు ప్రీమియం ఎప్పటిలోగా చెల్లిస్తారో సభకు చెప్పాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. రైతులకు వడ్డీలేని రుణాల ఇస్తామన్న హామీని సర్కారు నిలబెట్టుకోలేదని విమర్శించారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న వడ్లకు మాత్రమే ఇస్తాననడం సరైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఇష్టానుసారం విమర్శలు చేయడం సరైందికాదన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం నిధులు తేవాలి

- తెలంగాణపై కేంద్రం వివక్ష
- కేంద్రం నుంచి ఏం తెస్తారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



"కేంద్రం తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చింది.. హైదరాబాద్ నగర అభివృద్ధికి కిషన్‌రెడ్డి ఎన్ని నిధులు తెస్తారో చెప్పాలి.. ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నగరానికి రూపాయి తీసుకురాలేదు.." అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రానికి రూపాయి కూడా తీసుకురాలేని వాళ్లకు కేంద్ర మంత్రులుగా ఉండే అర్హత లేదన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో హైదారాబాద్ మౌలిక సదుపాయాల కోసం రూ. 10 వేల కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతూ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌తోపాటు మెట్రో అభివృద్ధిలో ఆర్థిక లేమితో కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బడ్జెట్‌లో హైడ్రా, మూసీ ప్రక్షాళన, మెట్రో ఇతర అంశాలకు రూ.10 వేల కోట్లు కేటాయించామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, గతంలో టూరిజం నుంచి మంత్రిగా ఉన్న సమయంలోనూ హైదరాబాద్ కోసం ఒక్క రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. స్మార్ట్ సిటీని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు హైదారాబాద్ నుంచి కరీంనగర్‌కు మార్చారని.. ఆనాడు కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ అవసరం ఉంది కానీ హైదరాబాద్‌కు అదనంగా స్మార్ట్ సిటీ తేవడానికి నిధులు తీసుకురాలేదని అన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు బడ్జెట్ సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలోగాని స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి, తెలంగాణ అభివృద్ధికి నిధులు తెచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాగునీటికి అమృత్ పథకం కింద నిధులు కేటాయించాలని కోరారు. నిధులు తీసుకురాకుండా బీజేపీ నేతలు ఏం ముఖం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశ్నించారు. మీకు చేతనైతే రాష్ట్ర ప్రయోజనాల కోసం నిధులు తేవాలన్నారు. గంగా ప్రక్షాళనకు వందల, వేల కోట్ల రూపాయలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను మాత్రం విస్మరించిందన్నారు . మెట్రో రైల్‌ను పాత నగరంతో పాటు శివారు ప్రాంతాలకు విస్తరించడానికి నిధులు తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వం కేంద్రంతో ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరించిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతల కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శన విహార యాత్రలా జరిగిందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించిందని గుర్తు చేశారు. ఒక్క నీటి చుక్క వాడుకోకుండానే కాళేశ్వరం నిర్వహణ భారమైందన్నారు. ఎల్లంపల్లి, మిడ్ మానేరు ద్వారా నీరు తీసుకొచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. రైతాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కాళేశ్వరం ద్వారానే మొత్తం నీళ్లు వచ్చినట్టు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇప్పటి వరకు ఎన్ని నీళ్లు ఎత్తి పోశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలోనే ప్రగతి

ఎమ్మెల్సీ వాణిదేవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంగ్రెస్ పాలించిన 50 ఏండ్ల కన్నా 10 ఏండ్లు పాలించిన బీఆర్‌ఎస్ కాలంలోనే అభివృద్ధి ఎక్కువగా జరిగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి తెలిపారు. ఈ సందర్భంగా మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుంటూ, మాజీ ప్రధాని కూతురిగా మాట్లాడాలన్నారు. కొంత మంది సభ్యులు, ఆమె మాజీ ప్రధాని కూతురే కాదు... మాజీ ముఖ్యమంత్రి కూతురు కూడా అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలు దిశగా ప్రభుత్వం అడుగులు పడటం లేదని విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏమి జరగలేదన్నట్టు కాంగ్రెస్ సభ్యులు మాట్లాడటం సరికాదన్నారు. యూనివర్సిటీల వీసీల నియామకంలో తాత్సారాన్ని నివారించాలని కోరారు. ప్రభుత్వ సహాయంతో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న వారికి సకాలంలో ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు అందించాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ తెచ్చిన ప్రగతిని కాంగ్రెస్ ఏడు నెలల్లోనే పూర్వస్థితిలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ విద్యారంగానికి ఎంతో చేసిందని తెలిపారు.

ఒక్క టీచర్‌ను నియమించారా? :పొన్నం ప్రభాకర్



బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం మెరుగు పడిందంటూ వాణిదేవీ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో ఒక్క టీచర్ లేదా ఒక్క యూనివర్సిటీ ప్రొఫెసర్‌ను నియమిం చారా? చెప్పాలని ప్రశ్నించారు. పదేండ్లలో విద్యావ్యవస్థను పూర్తిగా చంపేశారని విమర్శించారు.

ఆ పేపర్లు చూసి చెప్తా..

- పాలన సరిగా లేకనే మమ్మల్ని ఇక్కడ కూర్చోబెట్టారు
- మీరు కూడా అలాగే చేస్తారా?
- మీ ఆరుగ్యారంటీల అమలు ఏది..? :బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఆ పేపర్లు చూసి, చదివిన తర్వాత విషయమేంటో చెప్తా...' అని శాసనసభలో బీఆర్‌ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శనివారం సభలో సీఎం రేవంత్‌రెడ్డి...కేంద్ర విద్యుత్ ఒప్పందాలపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంతకాలు చేసిందంటూ వ్యాఖ్యానించిన నేపథ్యంలో హరీశ్ పైవిధంగా స్పందించారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు పదేపదే అడ్డుతగలటంతో అసహనానికి గురై...'మా పాలన సరిగా లేకనే ప్రజలు మమ్మల్ని ఇక్కడ (ప్రతిపక్షంలో) కూర్చోబెట్టారు. మీరు కూడా అలాగే పరిపాలించి, మళ్లీ ఇక్కడకు వస్తారా..?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్... ఆరు గ్యారెంటీల పేరిట అనేక హామీలను గుప్పించి ఒదని గుర్తు చేశారు. వాటిని వంద రోజుల్లో అమలు చేసి తీరతామంటూ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సహా ఆ పార్టీకి చెందిన నేతలు బాండ్ పేపర్లు సైతం రాసిచ్చారని తెలిపారు. ఆ బాండ్లు ఇప్పుడు ఏమయ్యాయంటూ ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎక్సైజ్ శాఖకు ఈ యేడాది రూ.7,200 కోట్ల అదనపు ఆదాయం వస్తుందంటూ బడ్జెట్‌లో పేర్కొన్నారనీ, అంటే రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచబోతున్నారా? అని హరీశ్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. బెల్టు షాపులను ఎత్తేస్తారా? లేదా? అని అడిగారు. పన్నేతర ఆదాయం రూపంలో రూ.35 వేల కోట్లు వస్తాయంటూ చెబుతున్న ప్రభుత్వం, ఆ నిధులను ఎక్కడి నుంచి సమీకరించుకుంటుందో తెలపాలని కోరారు. భూముల అమ్మకాల ద్వారా రూ.10 వేల కోట్లను ఆర్జిస్తామని పేర్కొనటం దారుణమని అన్నారు. గతంలో భూముల అమ్మకాలపై నానా రాద్ధాంతం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే పని చేస్తోందని ఎద్దేవా చేశారు.



పన్నేతర ఆదాయం రూపంలో రూ.35 వేల కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.5 వేల కోట్లు, కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.12 వేల కోట్లు వస్తాయంటూ లెక్కలేసుకోవటం ద్వారా ప్రభుత్వం వాస్తవాలకు విరుద్ధంగా వ్యవహరి స్తోందని దుయ్యబట్టారు. ఏకకాలంలో రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు ఇస్తామని చెప్పిన సర్కారు, బడ్జెట్‌లో మాత్రం 26 వేల కోట్లనే కేటాయించిందని గుర్తు చేశారు. మిగతా రూ.5 వేల కోట్లను కోత పెడతారా? అని ప్రశ్నించారు. 2023 డిసెంబరు 9 నాటికి రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి... ఇప్పుడు ఆ గడువును ఆగస్టు 15కు పొడిగించటంతో రైతులకు వడ్డీ భారం తడిసిమోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శ్రీ పథకానికి కేటాయించిన రూ .1,065 కోట్లు ఏ మూలకూ సరిపోవని అన్నారు. గర్భిణిలు, బాలింతల కోసం రూపొందించిన కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్ల పంపిణీని ఆపొద్దని కోరారు. అవసరమైతే ఆ పథకాలకు పేర్లు మార్చుకోండని సూచించారు. అప్పులకు సంబంధించి పదేపదే బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని హరీశ్ ఈ సందర్భంగా వాపోయారు. కాంగ్రెస్ చెబుతున్నట్టుగా రూ.6,71,757 కోట్ల అప్పుల్లో గవర్నమెంట్ హామీ లేనివి, కట్టాల్సిన అవసరం లేనివి రూ.59,414 కోట్లని తెలిపారు. గవర్నమెంట్ హామీ ఉండి, కట్టాల్సిన అవసరం లేనివి రూ.95,462 కోట్లని చెప్పారు. మొత్తంగా ప్రభుత్వం కట్టాల్సిన అవసరం లేనివి రూ.1,54876 కోట్లని (రెండూ కలిపి) వివరించారు. మిగిలిన అప్పు రూ.5,16,881 కోట్లేనని విశదీకరించారు. ఇందులో కూడా ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయే నాటికి వారసత్వంగా వచ్చిన అప్పు రూ. 72, 658 కోట్లని తెలిపారు. ఇది కూడా తీసేస్తే రూ.4,32,614 కోట్ల అప్పే మిగులు తుందని వివరించారు. డిసెంబరులో రేవంత్ సర్కారు కొలువుదీరిన తర్వాత చేసిన రూ.6,115 కోట్ల అప్పును కూడా బీఆర్‌ఎస్ ఖాతాలో వేయటం దారుణమన్నారు. దీన్ని కూడా తీసేస్తే కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అప్పు కేవలం రూ.4,26,499 కోట్లేనని హరీశ్ వివరించారు. వాస్తవాలు ఈ విధంగా ఉంటే కాంగ్రెస్ నేతలు అప్పుల గురించి తమపై పదే పదే అభాండాలు వేయటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇట్ల చేద్దాం

కారప్పొడిలో కాసిని పల్లీలను కూడా వేయించి పొడిగొట్టుకుంటే ఇడ్లీల్లోకి, దోశెల్లోకి బాగుంటుంది.





ప్రియాంక సింఘాల్... వ్యాపార కుటుంబం నుండి వచ్చింది. కొత్త ఆవిష్కరణల పట్ల అమితమైన ఆసక్తి చూపే ఆమే అనుకోకుండా రక్షణ రంగంలో అడుగు పెట్టింది. వచ్చిన తర్వాత ఇది పురుషాధిక్యం రాజ్యమేలుతున్న రంగమని గ్రహించింది. ఇందులో ఎలాగైనా తన ప్రత్యేకతను చాటుకోవాలని బలంగా నిర్ణయించు కుంది. అత్యాధునిక సాంకేతికతో ఆ రంగంలో కొత్త ఆవిష్కరణలు ప్రారంభించి తన సత్తా చాటుకుంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

రక్షణ రంగంలో సత్తా చాటుకుంటోంది




ప్రియాంక సింఘాల్ అమృత్‌సర్‌లోని వ్యాపార కుటుంబంలో పెరిగారు. తండ్రి స్థాపించిన చర్మాచస్ హాస్పిటాలిటీ గురించి చాలా నేర్చుకుంది. డల్హౌసీలోని సేక్రేడ్ హార్ట్ స్కూల్లో పాఠశాల విద్యను అభ్యసించింది. తర్వాత అమృత్‌సర్ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసింది. సాంకేతికత, ఆవిష్కరణల పట్ల మొదటి నుండి ఎంతో ఆసక్తి చూపించేది. 'నేను వ్యాపార కుటుంబం నుండి వచ్చాను. మా నాన్న నాకు రోల్ మోడల్. ఆయనలాగే నేనూ మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలని కోరుకుంటున్నాను' అంటూ ప్రియాంక గుర్తుచేసుకుంది. ఇలాంటి ఆలోచనలతో ఉన్న ఆమె రక్షణ రంగం గురించి అసలు ఊహించనే లేదు.

టర్నింగ్ పాయింట్

ఇంజనీరింగ్ చదువు ముగింపు రోజుల్లో ఆమె గమనం ఓ మలుపు తిరిగింది. ఇంటర్న్‌షిప్‌ల వేట మధ్య తోటివారి నుండి వచ్చిన ఓ సవాలు ఆమెను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)కి దరఖాస్తు చేసుకోనేలా ప్రేరేపించింది. మొదట్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ప్రియాంక వంద మందికి పైగా ఉన్న అభ్యర్థుల నుండి ఎంపికైన కొంతమంది ఇంటర్న్‌లలో ఒకరిగా నిలిచింది. తర్వాత కాలంలో DRDOలో ఆమె వార్‌హెడ్ ఎలక్ట్రానిక్స్, ఎక్స్‌ప్లోజివ్ ఇనిషియేషన్ సిస్టమ్‌లు, రియల్ టైమ్ ఫీల్డ్ ట్రయల్స్‌తో సహా అత్యాధునిక సాంకేతికతలను బహిర్గతం చేసింది.

మొదటి అనుభవం

'మొదటి టెస్ట్ పేలుడు చూసిన అనుభవం నన్ను మంత్రముగ్దురాలిని చేసింది' ఆమె పంచుకుంటుంది. ఈ అనుభవం ఆమె భవిష్యత్ కెరీర్‌ను అందులోనే రూపొందించే అభిరుచిని రేకెత్తించింది. తన ఇంటర్న్‌షిప్ తర్వాత భిన్నమైన మార్గాన్ని అనుసరించింది. రక్షణరంగంలోని విధానాలను ప్రభావితం చేయాలనే ఆశతో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS) పరీక్షలకు సిద్ధమయ్యింది. అయితే ఆమె తన సాంకేతిక నైపుణ్యం,



వ్యాపార అనుభవంతో రక్షణ రంగంలో సముచిత స్థానాన్ని ఏర్పరచుకోవాలని నిర్ణయించుకుంది.

అమ్యునిక్ సిస్టమ్స్ పుట్టుక

2019లో ప్రియాంక అమ్యునిక్ సిస్టమ్స్‌ను స్థాపించింది. వాస్తవానికి ముందు దీనికి టెక్ వేవ్ సొల్యూషన్స్ అని పేరు పెట్టింది. రక్షణ సాంకేతికతలపై దృష్టి సారించింది. దిగుమతి చేసుకున్న ఆయుధ సామాగ్రిపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో కంపెనీ తన పనిని ప్రారంభించింది. ఈ మిషన్ కోసం భారత ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా సహకారం తీసుకుంది. ప్రియాంక దృష్టి స్పష్టంగా ఉంది. భారత సాయుధ దళాల అవసరాలను తీర్చగల స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేయడం ఆమె ప్రధాన లక్ష్యం. జలాంతర్గాములను లక్ష్యంగా చేసుకుని నీటి అడుగున యుద్ధ సామాగ్రి ఉపయోగించేలా చేయగలిగింది. దీని కోసం పూర్తి స్వదేశీ ఎలక్ట్రానిక్ ఫ్యూజింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇలాంటి వ్యవస్థను సృష్టించడం దేశంలో ఇదే మొదటి సారి. ఆ ఘనత ప్రియాంకకు దక్కింది. ఇది కంపెనీ సాధించిన విజయాలలో ఒకటిగా నిలిచిపోయింది.

ప్రత్యేక సవాళ్లు

డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీని ప్రారంభించడం వల్ల ఆమె కొన్ని ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొవలసి వచ్చింది. ప్రత్యేకించి నిధులను పొందడంలో, మార్కెట్ తన కంపెనీని ఆమోదించడంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. తను దాచుకున్న డబ్బును పెట్టుబడిగా పెట్టి వెంచర్‌ను ప్రారంభించింది. ఆర్థికంగా ఎవరిపై ఆధారపడకుండా గట్టి పునాదిని నిర్మించుకోవాలని ఆమె ముందే నిర్ణయించుకుంది. ప్రారంభంలో ఎలక్ట్రానిక్ భాగాలను అమ్మేందుకు, ఆదాయాన్ని సంపాదించడానికి కళాశాల ప్రాజెక్ట్‌లపై దృష్టిపెట్టింది. క్రమంగా ఆర్మీ, DRDO, నేవీతో సహా వివిధ రక్షణ సంస్థల నుండి అమ్యునిక్ సిస్టమ్స్ ఆర్డర్‌లను పొందింది.

సాంకేతిక వృద్ధి అవసరం

పరిశ్రమ పట్ల మొదట్లో సందిగ్ధత ఉన్నప్పటికీ ప్రియాంక తన ప్రయత్నాన్ని కొనసాగించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్యునిక్ సిస్టమ్స్ రూ. 40 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తోంది. ప్రస్తుతం కంపెనీ విలువ రూ. 250 కోట్లకు పెరిగింది. భారత రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధిగా చేయాలన్నా, ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడాలన్నా స్వదేశీ సాంకేతికత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె నొక్కి చెబుతోంది. 'దాని కోసం మేము సిద్ధంగా ఉండాలి. అంటే మేము యుద్ధం కోరుకుంటున్నామని కాదు. మన భూభాగాలను కాపాడుకోవడానికి, ఇతర దేశాలు మనల్ని అణగదొక్కకుండా చూసుకోవడానికి సహాయపడాలనుకుంటున్నాం' అని ఆమె చెబుతున్నారు.

మహిళలను గెలిపించారు

సాంకేతిక ఆవిష్కరణలతో పాటుగా, సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగంలో లింగ అడ్డంకులను ఛేదించాలనే ఉద్దేశంతో తాను అమ్యునిక్ సిస్టమ్స్ ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు చెప్పింది. రక్షణ రంగంలో మహిళా ప్రాతినిధ్య లోపాన్ని గుర్తించిన ఆమె మహిళలతో కూడిన వర్క్‌ఫోర్స్‌ను రూపొందించడానికి ప్రాధాన్యం ఇచ్చింది. 'నా వర్క్‌ఫోర్స్‌లో 50% మంది మహిళలు ఉండేలా నేను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తాను' అని ఆమె పంచుకుంది. అందుకే ఆమె మహిళా ఇంటర్న్‌లను నియమించుకుంటుంది. వారికి అవసరమైన శిక్షణ ఇస్తూ, రక్షణ సాంకేతికతలతో అనుభవాన్ని పొందేలా చూస్తుంది. మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను అర్థం చేసుకోవడం, వృత్తిపరమైన, వ్యక్తిగత బాధ్యతలను సమతుల్యం చేయడంతో పాటు సౌకర్యవంతమైన పని సంస్కృతిని తన కంపెనీలో ప్రోత్సహిస్తుంది. ఆమె తన కార్యాలయంలో తన రెండేండ్ల కొడుకు కోసం, పని చేసే తల్లుల కోసం చిన్న ఆట స్థలాన్ని కూడా ఏర్పాటు చేసింది. ■

డిప్రెషన్‌ను జయించాలంటే..

కొందరు ఏ కారణం లేకుండానే సంతోషంగా ఉంటారు. మరికొందరు డల్‌గా ఉంటారు. దీనికి భావోద్వేగంతో పాటు.. హార్మోన్లు కూడా కారణం అని నిపుణులు చెబుతున్నారు. ఆనందం కలిగించే డోపమైన్ అనే హార్మోన్ దీనికి కారణం అని చెబుతున్నారు. ఈ హార్మోన్ మంచి స్థాయిలో ఉత్పత్తి అయితే, ఆ వ్యక్తి నిత్యం సంతోషంగా, ముఖంపై చిరునవ్వుతో ఉంటారు. ఈ హార్మోన్ స్థాయిని సరిగ్గా ఎలా నిర్వహించాలి? నిపుణులు ఏం చెబుతున్నారు?

డోపమైన్ హార్మోన్ స్రావాన్ని పెంచడానికి.. రోజువారీ ఆహారంలో గ్రీన్ బీన్స్, సోయా బీన్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇందులో టైరోసిన్ అమినో యాసిడ్ సరైన స్థాయిలో ఉంటుంది. ఈ ప్రోటీన్ తీసుకోవడం వలన డోపమైన్ మరింత పెరుగుతుంది. గ్రీన్ బీన్స్, సోయాబీన్స్, పాల ఉత్పత్తులు, అరటిపండ్లు, గుడ్లు, ప్రోబయోటిక్స్, చికెన్ వంటి ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలు డోపమైన్ హార్మోన్ పెరిగేందుకు దోహదపడుతాయి. ఇవే కాకుండా రోజువారీ ఆహారంలో, గ్రీన్ టీ, కర్కుమిన్ (పసుపు), మెగ్నీషియం, విటమిన్ డి కూడా తీసుకోవాలి.

సంతోషంగా ఉండటానికి..

తగినంత నిద్రపోవాలి. ఈ నిద్ర కూడా నాణ్యతతో ఉండాలి. కనీసం 6 నుండి 8 గంటలు నిద్రపోవాలి. ధ్యానం చేయాలి. ఇది భావోద్వేగాలను నియంత్రించడానికి, సంతోషంగా ఉండటానికి డోపమైన్ హార్మోన్‌ను పెంచడానికి సహాయపడుతుంది. సంగీతం వినాలి. నచ్చిన మ్యూజిక్ వింటూ ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. ఉదయం పూట సూర్యకాంతిలో కాసేపు ఉండాలి. ఉదయాన్నే వచ్చే సూర్యకాంతి, స్వచ్ఛమైన గాలి డోపమైన్ స్రావాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ■

మోడల్ స్కూళ్లలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో గత 11ఏండ్లుగా బదిలీలు, పదోన్నతులు కల్పించలేదని గుర్తు చేశారు. ఈ క్రమంలో 25 మంది ఉపాధ్యాయులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన టీచర్ల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అలాగే ప్రాథమిక, జెడ్పీ, తదితర పాఠశాలల ఉపాధ్యాయుల మాదిరిగానే రాష్ట్రంలోని ఆశ్రమ గురుకులాల్లో పని చేస్తున్న పీఈటీలు, పండిట్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి సైతం ప్రస్తావించారు. వెంటనే బదిలీలు, పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీ దేవీ కోరారు. సమస్యలను నోట్ చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

పెద్దవాగుతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించండి :యాదవరెడ్డి

ఖమ్మం జిల్లాలో పెద్దవాగు తెగడం వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి కోరారు. ప్రకృతి విధ్వంసం వల్ల 40 ఎకరాల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కింద 80 శాతం ఏపీ, 20 శాతం తెలంగాణ ఆయకట్టు సాగవుతున్నదనీ, వెంటనే ఏపీతో మాట్లాడి ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించాలని కోరారు.

ఉస్మానియా ఆస్పత్రిని ఎప్పుడు నిర్మిస్తారు : ఎంఎస్ ప్రభాకర్

ఎంతో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలు మార్లు పెచ్చులు ఊడిపోవడంతో రోగులు అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. ఈ ఆస్పత్రి కొత్త భవనాన్ని ఎప్పుడు నిర్మిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

98 మంది డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయండి : తీన్మార్ మల్లన్న

తెలంగాణ ప్రభుత్వం 98 మంది డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో వీరిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎనిమిది నెలల పెండింగ్ గౌరవ వేతనం చెల్లించాలనీ, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాజకీయాలు, వ్యక్తి స్వేచ్ఛలో మతప్రమేయమొద్దు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భారతదేశం 'మత' దేశం కాదని, సెక్యులరిజం కలిగిన దేశమని అన్నారు. సెక్యులరిజాన్ని కాపాడుకునేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహా 4వ వర్ధంతి సభ శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్ అధ్యక్షతన నిర్వహించారు. మస్కు నర్సింహా చిత్రపటానికి పూలమాలలేసి నివాళ్లులర్పించారు. అనంతరం 'మతం-మతోన్మాదం' అనే అంశంపై తమ్మినేని మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ గత పార్లమెంటు ఎన్నికల్లో 370 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని మతోన్మాదాన్ని రెచ్చగొట్టిందని విమర్శించారు. ముస్లిం, క్రిస్టియన్, దళితులపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. భారత రాజ్యాంగం పట్ల కుట్రలను సమిష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు మస్కు నర్సింహా లాంటి పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో జరిగే పోరాటాలకు మరింత ఊతం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.యాదయ్య జగదీష్, మధుసూదన్‌రెడ్డి, కవిత, నాయకులు రామచందర్, జగన్, సిహెచ్.జంగయ్య, కిషన్, శ్యాంసుందర్, ఆలంపల్లి నరసింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ సిటీ కాదు..ఒరిజినల్ సిటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాతబస్తీ మెట్రో నిర్మాణాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మెట్రో నిర్మాణంపై చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ పాతబస్తీ అంటే ఓల్డ్ సిటీ కాదు.. అది ఒరిజినల్ సిటీ అని వ్యాఖ్యానించారు. అప్పట్లో సీఎం వైస్సార్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా జైపాల్ రెడ్డి వయబుల్ గ్యాప్ ఫండ్(విజీపీ) రూ. 1600 కోట్లు తీసుకువచ్చి హైదరాబాద్ మెట్రో నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్ చర్చలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతుండగా సీఎం చర్చలో జోక్యం చేసుకున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఓల్డ్‌సిటీకి మెట్రో రైల్ అందుబాటులోకి తీసుకురాలేదని సీఎం అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పాతబస్తీ మెట్రోకు శంఖుస్థాపన చేశామన్నారు. రెండో దశలో 78 కి.మీ మెట్రో ప్రాజెక్టు కోసం కేంద్రానికి నివేదిక సమర్పించామన్నారు. నాలుగేండ్లల్లో ఓల్డ్ సిటీ మెట్రో పనులు పూర్తి చేసే బాధ్యత తమదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్‌అండ్‌టీపై పాతబస్తీ మెట్రో విషయమై తీవ్ర ఒత్తిడి తెచ్చామన్నారు. పనులు చేస్తారా ? లేక చంచల్‌గూడ లేదా చర్లపల్లి జైలుకుపోతారా అని గట్టిగా చెప్పాల్సి వచ్చిందన్నారు. జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, హైటెక్‌సిటీలో ఉండేవాళ్లకు మెట్రో అవసరం లేదనీ, ఎక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందో అక్కడ కావాలని చెప్పారు. అందుకే ఫేజ్-2 కింద మెట్రోను రీడిజైన్ చేశామన్నారు. నాగోల్- ఎల్‌బీ నగర్-ఓవైసీ అస్పత్రి-చాంద్రాయణగుట్ట లైన్‌లో మెట్రోను శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకెళుతున్నట్టు తెలిపారు. ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్, బీహెచ్‌ఈఎల్ నుంచి రామచంద్రాపురం, ఫైనాన్సియల్ జిల్లా నుంచి కోకాపేట్ నియోపోలీస్ వరకు విస్తరించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం(జేవీ) మోడల్‌లో చేపడతామని ప్రకటించారు. నిధులను కేంద్రం 15 శాతం, రాష్ట్రం 35 శాతం, రుణాలు 45 శాతం, పీపీ మోడల్‌లో ఐదు శాతం సేకరిస్తామని వివరించారు.

స్వర్గం చూపించారు..నిధుల్విలేదు
బీఆర్ఎస్‌పై అక్బరుద్దీన్ దాడి

ఓల్డ్‌సిటీని అది చేస్తాం, ఇది చేస్తాం అని చెప్పి మాజీ సీఎం కేసీఆర్ స్వర్గం చూపించారనీ, నిధులు మాత్రం ఇవ్వలేదని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ విమర్శించారు. సీఎం మాట్లాడిన అనంతరం చర్చ కొనసాగిస్తూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. గత ప్రభుత్వం హైటెక్‌సిటీనీ, గచ్చిబౌలీని అభివృద్ధి చేసిందనీ, కానీ పాతబస్తీని పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఎన్నిసార్లు కోరినా పాతబస్తీ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంతో దోస్తీ చేశామనీ, ప్రస్తుత ప్రభుత్వంతో కూడా దోస్తీ చేస్తామన్నారు. వక్ఫ్ బోర్డు భూములను కాపాడాలని కోరారు. బీఆర్ఎస్ సర్కారు స్వర్గాన్ని చూపించిందనీ, నిధుల్వికుండా చేతులేత్తేసిందన్నారు. బడ్జెట్‌లో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. సంఖ్యలు ఒక్కో నివేదికలో ఒక్కోలా పేర్కొనడాన్ని తప్పుబట్టారు. దీనికి బాధ్యులు ఎవరు ? ఎవరు తయారుచేశారని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యేల బృందం బడ్జెట్‌ను 18 నుంచి 20 గంటల మేర అధ్యయనం చేసినట్టు చెప్పారు. మోడీ నోట్లను రద్దుచేసి జనాన్ని లైన్లల్లో నిలబెట్టారనీ, మీరు కూడా అలాగే చేస్తారా అని అడిగారు. ఎస్సీ, ఎస్టీల నిధులను మళ్లించి మైనార్టీలకు ఇస్తున్నారనే ప్రచారం మీడియాలో జరుగుతున్నదన్నారు. దూరదర్శన్‌లో కూడా ఈ వార్తలు వచ్చాయని చెప్పారు. వెంటనే ఖండించాలని సూచించారు. బీసీలు ఎప్పుడూ నిర్లక్ష్యానికి గురవుతున్నారనీ, వారికి నిధులను కేటాయించాలని చెప్పారు. అదానికి పాత బస్తీ బిల్లుల వసూళ్ల కాంట్రాక్టును ఇస్తామని దావోస్‌లో ప్రకటించడాన్ని తప్పుబట్టారు. అది జరిగేది కాదన్నారు. రూ.40 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు వివరణ ఇస్తూ ఫిబ్రవరిలో జరిగిన ఓటాన్ అకౌంట్‌లో పేర్కొన్నట్టు తెలిపారు. బీజేపీ సభ్యులు ప్రజలను విభజించడం సరికాదన్నారు. సభను పక్కదారి పట్టించొద్దన్నారు. లౌకికవాదాన్ని కాంగ్రెస్ నమ్ముతుందనీ, తమ పాలనా అలాగే సాగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అందరికి సమానంగా అమలుచేస్తుందని చెప్పారు. కులగణన జరిగితే, ఆమేరకు నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు.

యువశక్తితో ఇండియా

(మొదటిపేజి తరువాయి)

పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభం కానున్నాయి. జేడీయూ చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వ్యవహారశైలి దేశ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న నితీష్ కుమార్ నిటి ఆయోగ్ సమావేశానికి డుమ్మా కొట్టడంపై చర్చలు జరుగుతున్నాయి. బీహార్ తరపున డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా హాజరయ్యారు. బీహార్‌కు కేంద్రం ప్రత్యేక హోదా కల్పించకపోవడమే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. తమ డిమాండ్‌ను తిరస్కరించడానికి నిరసనగా, సీఎం నితీష్ కీలక భేటీని బాయ్‌కాట్ చేసినట్లుగా తెలుస్తోంది.

బెంగాల్ సీఎం మమత వాకౌట్

శనివారం నాటి సమావేశంలో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. సమావేశం నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో బెంగాల్‌కు కేంద్ర నిధులు నిరాకరించిన అంశాన్ని ప్రస్తావిస్తున్న సమయంలో తన మైక్‌ను మ్యూట్ చేసినట్టు మమత ఆరోపించారు. ఐదు నిమిషాలకు మించి మాట్లాడేందుకు అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే భేటీ నుంచి వాకౌట్ చేసినట్టు తెలిపారు. సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చిన మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ 'నాకు ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడేందుకు అనుమతించారు. పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని సమావేశంలో ప్రస్తావించాను. కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌పై వివక్ష చూపారని, రాష్ట్రానికి నిధులు కేటాయించాలని మాట్లాడటం ప్రారంభించాను. అంతే నామైక్‌ను ఆపేశారు. నాకంటే ముందు చాలా మంది మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, అస్సాం సీఎం హిమంత్ బిశ్వాస్ శర్మలకు 20 నిమిషాలు సుదీర్ఘంగా మాట్లాడే అవకాశం ఇచ్చారు. నాకు మాత్రం ఐదు నిమిషాలే మాట్లాడేందుకు అనుమతించారు. ఇందుకు నిరసనగా నేను సమావేశం నుంచి బయటకు వచ్చేశాను. బడ్జెట్ పూర్తి రాజకీయంగా ఉంది. ప్రతిపక్షాల నుంచి నేను ఒక్కదాన్నే ఈ సమావేశంలో పాల్గొన్నప్పటికీ నన్ను మాట్లాడనివ్వకపోవడం అవమానకరం. ఈ చర్య ప్రాంతీయ పార్టీలను అవమానించడం కిందకే వస్తుంది. భవిష్యత్తులో ఇంకెప్పుడూ నిటి ఆయోగ్ సమావేశానికి హాజరు కాను' అని అన్నారు. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా స్పందించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మైక్ కట్ చేయడమే కో ఆపరేటివ్ ఫెడరలిజమా? అని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రిని ఇలాగేనా గౌరవించేది, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు కూడా భాగమేనని బీజేపీ గుర్తించాలని అన్నారు. ప్రతిపక్షాలను శత్రువులుగా చూడకూడదని హితవు పలికారు. కోఆపరేటివ్ ఫెడరలిజం మనుగడ సాగించాలంటే చర్చలకు అవకాశం ఉండాలని, భిన్నాభిప్రాయాలను గౌరవించాలని స్టాలిన్ పేర్కొన్నారు.

ఎనిమిది మంది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు గైర్హాజరు

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాలపై వివక్షను నిరసిస్తూ ఎనిమిది మంది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ నిటి ఆయోగ్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. బడ్జెట్ కేటాయింపుల తీరుకు నిరసనగా నిటి ఆయోగ్ పాలక మండలి సమావేశాన్ని పలువురు సీఎంలు బహిష్కరించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏ.రేవంత్ రెడ్డి (తెలంగాణ), సిద్ధ రామయ్య (కర్ణాకట), సుఖ్వీందర్ సింగ్ సుఖ్ (హిమాచల్‌ప్రదేశ్) నిటి ఆయోగ్ సమావేశానికి హాజరుకాలేమని ప్రకటించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తీహార్ జైల్‌లో ఉండటం వల్ల ఆయన హాజరుకాలేరు. ఈ సమావేశంలో ఏపీ సీఎం ఎన్. చంద్రబాబు నాయుడు పాల్గొని మాట్లాడారు. నిటి ఆయోగ్ సభ్యులుగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, నీటి ఆయోగ్ వైస్ ఛైర్మన్, సభ్యులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోడి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్ట్ నెంట్ గవర్నర్లు, మంత్రులతో పాటు నిటి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

రాష్ట్రాలు జిల్లాలకు ఎక్కువ ఖర్చు చేయాలి : సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం

రాష్ట్రాలు జిల్లాలకు ఎక్కువ ఖర్చు చేయాలని నిటి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి హాజరుకాకపోవడం వల్ల ఆయా రాష్ట్రాలకే నష్టమని అన్నారు. నిటి ఆయోగ్ సమావేశం ముగిసిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీవీఆర్ సుబ్రమణ్యం మాట్లాడారు. ఈ సమావేశంలో డెమోగ్రాఫిక్ మేనేజ్‌మెంట్, జీరో పేదరికం అనే అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రాలు జిల్లాలపై ఎక్కువ ఖర్చు పెట్టాలని, తద్వారా అవి అభివృద్ధికి చోదకాలుగా మారాలని ప్రధాని కోరుకుంటున్నారన్నారు.

సీపీఐ(ఎం) నేతలపై అక్రమ కేసులెత్తేయండి

(మొదటిపేజి తరువాయి)

పెట్టిన కేసులు రద్దు చేయాలని కోరింది. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన సందర్భంగా ఇంటింటి సర్వేలో 31లక్షల మంది పేదలున్నా రని ప్రకటించిందని తెలిపింది. పదేండ్లు గడిచినా పేదలకు ఇండ్ల స్థలాలు గానీ, ఇండ్లు నిర్మించి ఇవ్వడం గానీ జరగలేదని సీఎం దృష్టికి తెచ్చింది. 2022 నుంచి 2024 వరకు 21 జిల్లాలలో ప్రభుత్వ భూములలో పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపింది. ఈ గుడిసెలను బీఆర్ఎస్ ప్రభుత్వం కూల్చివేసిందనీ పేదలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసిందని ముఖ్యమంత్రికి తెలిపింది. అయినా పేదలు అక్కడే గుడిసెలలో నివాసముంటున్నారని వివరించింది. ఈ సందర్భంగా వరంగల్, హన్మకొండ, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, పెద్దపల్లి, సూర్యాపేట, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, జగిత్యాల జిల్లాల్లో కేసులు పెట్టారని తెలియజేసింది. జగిత్యాల, కోరుట్లలో పేదలపై నాన్ బెయిలబుల్, 307 లాంటి తీవ్రమైన సెక్షన్లతో అక్రమ కేసులు బనాయించారని గుర్తుచేసింది. సీపీఐ(ఎం) ప్రతినిధి బందం గతంలో రెండుసార్లు కలిసిన సందర్భంగా పేదలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలనీ, గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టించాలని కోరగా సానుకూలంగా స్పందించి అసెంబ్లీలోనే పెట్టి కేసులు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేసులు రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. దీనికి సీఎం సానుకూలం గా స్పందిస్తూ న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని తన కార్యదర్శిని ఆదేశించారు.


మీటర్లపై హీటెక్కిన అసెంబ్లీ

(మొదటిపేజి తరువాయి)

ఆయన ప్రధాన ప్రతిపక్షానికి సవాల్ విసిరారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగు రోడ్డును రూ.ఏడు వేల కోట్లకే తెగనమ్మిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని రేవంత్ ఎద్దేవా చేశారు. ఆడ బిడ్డల సెంటిమెంట్ అయిన బతుకమ్మ చీరెల్లోనూ అవినీతికి పాల్పడ్డారంటూ దుయ్యబట్టారు. కురుమలు, యాదవులను అమాయకులను చేసి రూ.కోట్లను కొల్లగొట్టారని ఆరోపించారు. అభివృద్ధి కోసమే అప్పులు చేశామంటున్న బీఆర్ఎస్ నేతలు... పదేండ్ల కాలంలో అమ్మిన ప్రభుత్వ భూముల లెక్కలు మాత్రం చెప్పటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్, పాలమూరు జిల్లాకు ఏం చేశారంటూ ప్రశ్నించారు. రూ.20 లక్షల కోట్లకు పైగా ఖర్చు పెట్టినా పాలమూరు ప్రాజెక్టులు పూర్తి కాకపోవటానికి కారణమెవరంటూ నిలదీశారు. దశాబ్ద కాలంగా రంగారెడ్డి జిల్లాను నిర్లక్ష్యంగా వదిలేయటం వల్ల అది ఎడారిగా మారిందని వాపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ కాళ్లు, చేతులు విరగ్గొట్టి, పార్లమెంటు ఎలక్షన్లలో ఉరేసినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని సీఎం రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

పుంజుకుంటున్న హారిస్

వాషింగ్టన్ : నవంబర్ ఐదవ తేదీన జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ బలం పుంజుకుంటున్నారు. తాజా పోల్స్‌లో ఆమె రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధిక్యతను తగ్గించగలిగారు. కమలా హారిస్‌కు తన పార్టీ నుండే కాకుండా శ్వేతజాతీయులు కాని ఓటర్ల నుండి కూడా మద్దతు గణనీయంగా పెరుగుతోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజా సర్వే ప్రకారం హారిస్‌కు 49 శాతం, ట్రంప్‌కు 47 శాతం మద్దతు లభించింది. అయితే 3.1 శాతం పాయింట్ల మేర ఫలితాలు అటూ ఇటూ కావచ్చునని ఆ పత్రిక తెలిపింది. ఈ నెల ప్రారంభంలో ట్రంప్ తన ప్రత్యర్థి, దేశాధ్యక్షుడు జో బైడెన్‌పై ఆరు పాయింట్ల ఆధిక్యత కనబరిచారు. అయితే ఆ తర్వాత బైడెన్ పోటీ నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. కాగా న్యూయార్క్ టైమ్స్/సియానా కాలేజ్ పోల్ ఈ నెల 22-24 తేదీల మధ్య 1,142 మంది ఓటర్ల అభిప్రాయాన్ని సేకరించింది. ఇందులో ట్రంప్‌నకు 48 శాతం, హారిస్‌కు 47 శాతం మద్దతు లభించింది. రిజిస్టర్డ్ ఓటర్లలో ట్రంప్‌కు 48 శాతం, హారిస్‌కు 46 శాతం మంది మద్దతు ఇస్తున్నారని వివిధ పోల్ సర్వేలు తెలిపాయి. గతంలో రిజిస్టర్డ్ ఓటర్లలో బైడెన్ కంటే ట్రంప్‌కు తొమ్మిది శాతం పాయింట్ల ఆధిక్యత లభించింది. ఇదిలావుండగా కమలా హారిస్ శనివారం తన అభ్యర్థిత్వానికి సంబంధించిన పత్రాలపై అధికారికంగా సంతకం చేశారు. 'ప్రతి ఓటును గెలుచుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తాను. నవంబరులో మా ప్రజల ప్రచారం విజయం సాధిస్తుంది' అని ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు.



సూర్య ప్రతాపం

- రాణించిన పంత్, జైస్వాల్
- శ్రీలంకపై భారత్ ఘన విజయం

నవతెలంగాణ-పల్లెకెలె

భారత బౌలర్లు సమిష్టిగా చెలరేగటంతో శ్రీలంకతో తొలి టీ20లో భారత్ 43 పరుగుల తేడాతో గెలుపొందింది. 214 పరుగుల ఛేదనలో శ్రీలంక 14 ఓవర్లలో 140/1తో గెలుపు దిశగా సాగింది. కానీ ఈ దశలో వరుస వికెట్లు కూల్చిన మనోళ్లు మ్యాచ్‌ను మలుపు తిప్పారు. రియాన్ పరాగ్ (3/5), అర్షదీప్ సింగ్ (2/24), అక్షర్ పటేల్ (2/38) శ్రీలంక మిడిల్ ఆర్డర్‌ను కూల్చారు. నిశాంక (79), మెండిస్ (45) మెరిసినా.. ఆ జట్టు 19.2 ఓవర్లలో 170 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు సూర్యకుమార్ యాదవ్ (58, 26 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. రిషబ్ పంత్ (49, 33 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), యశస్వి జైస్వాల్ (40, 21 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (34, 16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో భారత్ 213/7 పరుగులు చేసింది.

టాప్ షో!: టాస్ నెగ్గిన శ్రీలంక తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పల్లెకెలె పిచ్‌పై బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. యశస్వి జైస్వాల్ (40), శుభ్‌మన్ గిల్ (34) తొలి వికెట్‌కు 5.6 ఓవర్లలోనే 74 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో జైస్వాల్ దంచికొట్టాడు. రెండు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఓపెనర్ల దెబ్బకు తొలి ఆరు ఓవర్లలోనే భారత్ 74 పరుగులు జోడించింది. కానీ వరుస బంతుల్లో ఓపెనర్లు నిష్క్రమించటంతో శ్రీలంక బౌలర్లు ఊరట చెందారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (58), వికెట్ కీపర్ రిషబ్ పంత్ (49) మరో కీలక భాగస్వామ్యం నిర్మించారు. మూడో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. నాయకుడిగా ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్.. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 22 బంతుల్లోనే అర్థ సెంచరీ పూర్తి చేశాడు. రిషబ్ పంత్ (49) వరల్డ్‌కప్ ఫామ్ కొనసాగించాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగాడు. టాప్-4 బ్యాటర నిష్క్రమించటంతో భారత దూకుడు తగ్గింది.



మనువాదాన్ని రక్షించటమే బీజేపీ విధానం

- బీజేపీపై రాజకీయ, ఆర్థిక విమర్శలతో ఆగిపోతే కుదరదు
- దాని భావాజాలాన్ని ఓడించేందుకు కృషి జరగాలి : శిక్షణా తరగతుల ప్రారంభ ఉపన్యాసంలో తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హిందూ రాష్ట్ర స్థాపనే బీజేపీ అసలు లక్ష్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో సాంస్కృతిక శిక్షణా తరుగతుల్లో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాదం, మూఢనమ్మకాలు పెచ్చరిల్లుతున్నాయని చెప్పారు. దీనికి బీజేపీ ప్రతినిధిగా ఉందన్నారు. బీజేపీ విధానాలు, నినాదాలు పరిశీలించాలన్నారు. దానికి అధికారంలో ఉండటం మాత్రమే లక్ష్యం కాదని చెప్పారు. హిందూ రాష్ట్ర స్థాపనకు అధికారాన్ని ఒక సాధనంగా ఉపయోగించు కుంటుందని తెలిపారు. కొన్ని పార్టీలు అధికారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేస్తాయని తెలిపారు. బీజేపీ మాత్రం మనుస్మృతి చట్టాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. హిందూత్వ మంటే.. హిందూత్వ సిద్ధాంతాన్ని రక్షించటమని కొందరు పొరపడుతున్నారన్నారు. వాస్తవంగా దాని భావం మరో రకంగా ఉందన్నారు. హిందూత్వ సిద్ధాంతం అంటే సనాతన ధర్మాన్ని రక్షించటమని చెప్పారు. మనువాదమే సనాతన ధర్మమన్నారు. కులవాదాన్ని రక్షించి, నిచ్చెన మెట్ల కుల సిద్ధాంతాన్ని అమలు చేయటమేనని చెప్పారు. మనుస్మృతి చట్టాల ప్రకారం పురుషాధిక్యత ఒక ధర్మమని గుర్తు చేశారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు, ఆధిపత్య భావాజాలం గురించి మాట్లాడటమంటే ఆ చట్టాన్ని ధిక్కరించటమేనని తెలిపారు. రిజర్వేషన్లు ఎత్తేయాలని వారు ఆలోచిస్తున్నారని చెప్పారు. అయితే తమ లక్ష్యాలను నెరవేర్చటానికి అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన రాజ్యాంగం ఆటంకంగా ఉందన్నారు. అందుకే మొన్నటి ఎన్నికల్లో 370 సీట్ల లక్ష్యంగా ప్రచారం సాగించారని చెప్పారు. అదనుకున్నట్టు రాజ్యాంగాన్నే తొలగిస్తే..దేశం దేశంగా ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రమాదాన్ని 20ఏండ్ల నుంచి చెబుతూనే ఉన్నామన్నారు. అయినా అది రోజు రోజుకు పెరుగుతుందని చెప్పారు. దీనికి కారణమేంటో విశ్లేషించాలన్నారు. రాజకీయ, ఆర్థిక విధానాలపై మాత్రమే విమర్శలు చేస్తే సరిపోదని చెప్పారు. దాని భావాజాలాన్ని ఓడించాలన్నారు. సాంస్కృతిక, సామాజిక, విద్యా రంగాల్లో కృషి పెరగాలన్నారు. ప్రత్యామ్నాయ భావాజాలంతో పని చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ సంస్కృతే సమాజ అభివృద్ధికి మార్గమని చెప్పారు. నేడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మనుస్మృతి ఆధారంగా మూఢ నమ్మకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వైనాన్ని నైపుణ్యంతో, వాస్తవాల ఆధారంగా ప్రజలకు అర్థం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, టీపీఎస్‌కే అధ్యక్ష, కార్యదర్శులు జి రాములు, భూపతి వెంకటేశ్వర్లు, ఎంవీ రమణ, విజ్ఞాన దర్శిని కార్యదర్శి టి రమేష్ మాట్లాడారు.

ఆసియా క్వీన్ ఎవరో?

- నాల్గో టైటిల్ వేటలో భారత్
- ఫైనల్లో నేడు శ్రీలంకతో హర్మన్‌సేన ఢీ

నవతెలంగాణ-దంబుల్లా



: మహిళల ఆసియా కప్ ఆఖరు అంకానికి చేరుకుంది. నాలుగు సార్లు చాంపియన్ టీమ్ ఇండియా వరుసగా ఐదోసారి టైటిల్ పోరుకు చేరుకుంది. రెండు దశాబ్దాల క్రితం శ్రీలంకపై విజయంతో ఆసియా కప్ అందుకున్న టీమ్ ఇండియా.. ఇప్పుడు మరోసారి ఆ ప్రదర్శన పునరావృతం చేసేందుకు సిద్ధమవుతోంది. అజేయ హర్మన్‌ప్రీత్ సేన నేడు టైటిల్ పోరులో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. ఆతిథ్య శ్రీలంక సైతం టైటిల్ అందుకోవటమే లక్ష్యంగా ఆడనుంది. భారత్, శ్రీలంక ఆసియా కప్ ఫైనల్ నేడు. మధ్యాహ్నం 3 గంటలకు టైటిల్ పోరు ఆరంభం కానుంది.

భారత మహిళల జట్టు బలంగా కనిపిస్తుంది. బ్యాటింగ్ లైనప్ పరుగుల వరద పారించగా, బౌలింగ్ లైనప్ వికెట్ల జాతర సాగించింది. బ్యాట్‌తో, బంతితో అమ్మాయిలు ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. అక్టోబర్‌లో టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో.. ఆసియా కప్ విజయంతో వరల్డ్‌కప్ వేటను షురూ చేద్దామని భారత్ భావిస్తోంది.

దివ్యాంగ క్రీడాకారులకు 'ఎస్‌జాట్' చేయూత

హైదరాబాద్: పది జట్లు, తొమ్మిది మ్యాచులు, ఆరు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన కేఎస్‌జీ జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) శనివారం ఘనంగా ముగిసింది. ఉప్పల్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో టీవీ9 విజయం సాధించి.. జేపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. తొలుత టీవీ9 నిర్ణీత 20 ఓవర్లలో 141/7 పరుగులు చేయగా.. ఛేదనలో ఎన్టీవీ 128/8 పరుగులు చేసింది. 12 పరుగుల తేడాతో టీవీ9 గెలుపొందింది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్ కలిసి విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు.. ఆటగాళ్లకు మెడల్స్ ప్రదానం చేశారు. స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జాట్) తరఫున పది మంది దివ్యాంగ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక చెక్కులను అందించారు. త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, కేఎస్‌జీ సీఈఓ సంజయ్, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ చీఫ్ భరణి, స్మయిల్‌గార్డ్ ఫౌండర్ శరత్, జూపర్ ఎల్‌ఈడీ సీఈఓ ఒరుసు రమేష్, మెడికవర్ తెలంగాణ హెడ్ అర్జున్ తదితరులు జేపీఎల్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌కుల వేలం ఆపాలి

సింగరేణి ప్రయివేటీకరణపై సమరం

- సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ యాత్రకు మద్దతు : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి నేరుగా కేటాయించాలని, వేలంపాట ఆపాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో నిర్వహించే సింగరేణి పరిరక్షణ యాత్రకు తమ సంఘం మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. సింగరేణి ప్రయివేటీకరణతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్లీనంలో సాయిబాబు మాట్లాడారు. బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణపై నాలుగు సంవత్సరాలుగా సింగరేణిలో నిరసనలు జరుగుతూనే ఉన్నా కేంద్రం పెడచెవిన పెడుతోందన్నారు. ఖనిజ సంపద ఉన్న ప్రాంతంలో ప్రభుత్వరంగ సంస్థలు దాన్ని వెలికితీసేందుకు ఆసక్తి చూపితే కొన్ని రాయితీలతో అప్పగించాలని ఆర్టికల్-17 చెబుతున్నా ఈ అంశాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కిషన్ రెడ్డి కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉండటం వల్ల సింగరేణిని కాపాడుకోవడం సులభమని అందరూ భావించారని, రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నారని చెప్పారు. వారంతా ప్రజల ఆశలను అడియాశలు చేశారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు, కార్మికులు కన్నెరజేసి సింగరేణిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. శ్రావణపల్లి బొగ్గుబ్లాకును సింగరేణికి కేటాయించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరుతున్నామంటూనే వేలంపాటలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొంటున్నదని, సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారని తెలిపారు.

వేలంపాటను రద్దు చేయాలని, శ్రావణపల్లి బొగ్గుబ్లాకును సింగరేణికే కేటాయించాలంటూ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, సిహెచ్ విఠల్, పి.మోహన్ రావు, తిరుమలాచారి, పి.రమ్య, జిల్లా ఉపేందర్, బండారు యాకయ్య ప్రసాద్ పాల్గొన్నారు.

నువ్వు నాకు నచ్చావ్‌లాంటి ఎంటర్‌టైనర్



కె.విజయ్ భాస్కర్

"మన్మథుడు' సినిమా చిరంజీవికి మ్యాచ్ అవ్వదు. 'జై చిరంజీవ' వెంకటేష్‌కు సరిపోదు.'నువ్వు నాకు నచ్చావ్' వెంకటేష్‌ను తప్ప మరెవరినీ ఊహించుకోలేం. ఈ సినిమా కథ కూడా ఓ కుర్రాడి కోసం తయారుచేసిన కథ. కేవలం కొడుకు కోసం చేసిన కథ కాదు. అయితే వాడి వయసు తగ్గ కథ ఇది. కానీ సినిమా చేసిన తరువాత మా అబ్బాయి కమల్ ఈసినిమాకి కరెక్ట్ అనిపించింది' అని అన్నారు దర్శకుడు కె. విజయ్ భాస్కర్. 'నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన కె.విజయ్‌భాస్కర్ దర్శకత్వంలో తాజాగా 'ఉషా పరిణయం' అనే సినిమా రానుంది. ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉపశీర్షిక. కె.విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంలో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ముఖ్యతారలు. ఆగస్టు 2న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత కె.విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

"ఉషా పరిణయం' సినిమా ప్రేమకు నేను ఇచ్చే నిర్వచనం. ఈ మధ్య ప్రేమకు అర్థం మారిపోయింది. ప్రేమ పేరుతో అమ్మాయిలపై దాడులు జరగడం ఎక్కువై పోయింది.. అలాంటి వాడు శాడిస్ట్. వాడు లవర్ కాదు. లవ్ అనేది ఎప్పుడూ హింసాత్మకంగా ఉండదు. హింసాత్మకంగా ఉంటే అది ప్రేమే కాదు. అలా నా స్టయిల్‌లో చెప్పాలనుకున్నాను. ప్రేమ అలా మారి పోయింది. అలా కాదు ఇలా వుంటే బాగుంటుందని నా స్టయిల్‌లో చెబుతున్నాను. అయితే ఇది మేసేజ్‌లా ఉండదు. ఎంటర్‌టైనింగ్‌గా ఉంటూ అండర్ కరెంట్‌తో ట్రూలవ్‌ను చూపించాలనుకున్నాను. మా అబ్బాయి కమల్‌కు ఇదొక మంచి అవకాశం. ఇంతకు ముందు కమల్ చేసిన సినిమా ఓన్లీ ఎంటర్‌టైనింగ్ సినిమా. ఇది ఇంటెన్సిటీ ప్రేమకథ సినిమా. ఈ సినిమాతో తెలుగమ్మాయి తాన్వీ ఆకాంక్షను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం. జై చిరంజీవి టైమ్‌లో బాలనటిగా ఈమెని రిజెక్ట్ చేశాను. 'మసాలా' తరువాత 'నువ్వు నాకు నచ్చావ్' జోనర్‌లో ఉన్న సినిమా చేసిన ఫీల్ కలిగింది'.



భిన్న కాన్సెప్ట్‌తో తుఫాన్

హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తుఫాన్'. ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ సంస్థ గతంలో విజయ్ ఆంటోనీ హీరోగా 'రాఘవన్, హత్య' సినిమాలను నిర్మించింది. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. ఈ సినిమాను ఆగస్టు 2న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

నిర్మాత జి. ధనుంజయన్ మాట్లాడుతూ, 'ఇదొక క్వాలిటీ, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న సినిమా. మ్యూజిక్‌తో పాటు మంచి డైలాగ్స్ ఉంటాయి. విజయ్ ఆంటోనీ మిమ్మల్ని ఈ సినిమాతో ఆకట్టుకుంటారు. చాలా మంది ఆర్టిస్టుల కాంబినేషన్ సీన్స్ ఉంటాయి. మా రైటర్ భాష్యశ్రీ మంచి డైలాగ్స్ రాశారు. ప్రేక్షకులకు నచ్చే అన్ని ఎలిమెంట్స్‌తో మా డైరెక్టర్ విజయ్ మిల్టన్ ఈ సినిమాను రూపొందించారు' అని తెలిపారు.

'అచ్చు రాజమణి మ్యూజిక్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ సినిమా మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా విజయ్ ఆంటోనీ తన సపోర్ట్ ఇస్తూనే ఉన్నారు. మా ప్రొడ్యూసర్స్ కమల్, ప్రదీప్, ధనుంజయన్‌కి థ్యాంక్స్' అని డైరెక్టర్ విజయ్ మిల్టన్ చెప్పారు. హీరో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'సత్యరాజ్ ఈ సినిమాలో ఓ మంచి రోల్ చేశారు. ఆయన మా మూవీలో భాగమవకుంటే ఇది అసంపూర్తి అయ్యేది. డైరెక్టర్ విజయ్ మిల్టన్ మంచి స్క్రిప్ట్‌ని ఈ మూవీకి రాశారు. నా రైట్ హ్యాండ్ లాంటి పర్సన్ డైలాగ్ రైటర్ భాష్యశ్రీ. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓ భారీ సినిమా చేయడం ఎంత కష్టమో మనందరికీ తెలుసు. అయినా కంటెంట్ మీద నమ్మకంతో మా ప్రొడ్యూసర్స్ కమల్, ప్రదీప్, ధనుంజయన్ సినిమా చేశారు. తెలుగుతో పాటు తమిళంలో రిలీజ్ చేస్తున్నారు. త్వరలో ఈ సినిమా స్నీక్ పీక్ రిలీజ్ చేస్తాం. అది మూవీపై ఇంకా ఆసక్తిని పెంచుతుంది. నా గత సినిమాలతో తెలుగు ఆడియెన్స్‌తో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. ఈ సినిమాతో మీకు మరింత దగ్గరవుతానని ఆశిస్తున్నా' అని చెప్పారు.

నవచిత్రం

అల్లరి నరేష్ నయా సినిమా షురూ



హీరో అల్లరి నరేష్ మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. ఈ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.29గా రూపొందనున్న ఈ సినిమాని అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా జూన్ 30న ప్రకటించారు. ఆ సమయంలో విడుదలైన సంకేత భాషతో కూడిన కాన్సెప్ట్ పోస్టర్, ఎంతో సృజనాత్మకంగా ఉండి, సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలోనూ పోస్టర్ వైరల్ అయింది. ఇప్పుడు చిత్రబృందం అధికారికంగా శనివారం పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించింది. "ఫ్యామిలీ డ్రామా" చిత్రంతో ప్రశంసలు అందుకున్న రచయిత-దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. వారం రోజుల్లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

నూతన కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించి, ఘన విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేశారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన నాయికగా నటిస్తున్నారు.

సరికొత్త ప్రేమకథా చిత్రం



కృష్ణవంశీ, మోక్ష

కృష్ణ వంశీ, మోక్ష లీడ్ రోల్స్‌లో నటిస్తున్న లవ్ ఎంటర్‌టైనర్ 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హైనివా క్రియేషన్స్ బ్యానర్ పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఇది ఒక అమ్మాయిని గాఢంగా ప్రేమించే నిజాయితీ గల యువకుడి కథ. తను ఆమెతో గడిపిన ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేస్తాడు. చుట్టుపక్కల ఉన్నవారందరూ తన ప్రేమ గురించి అమ్మాయికి చెప్పమని బలవంతం చేస్తారు. కానీ ఆమె నో చెబితే ఏమౌతుందో అని భయపడతాడు. అయితే వీరి మధ్య కొన్ని అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటాయి. కథలోని డ్రామా, ఎమోషనల్ రిచ్‌నెస్‌ని ట్రైలర్ అద్భుతంగా క్యాప్చర్ చేసింది. అర్థవంతంగా రాసిన డైలాగ్‌లు, హత్తుకునే సన్నివేశాలతో మంచి రొమాంటిక్ డ్రామాతో కంప్లీట్ లవ్ స్టోరీని చూడబోతున్నామనే భరోసా ఇచ్చింది. కృష్ణ వంశీ డెబ్యుటెంట్‌లా కాకుండా మంచి అనుభవం ఉన్న నటుడిలా ఆకట్టుకునే పెర్ఫార్మెన్స్‌తో అలరించాడు. మోక్ష కూడా తన పాత్రని పర్ఫెక్ట్‌గా పోషించింది. ట్రైలర్‌లో బ్రహ్మాజీ, సుధ, ప్రమోధిని, వెంకటేష్ కాకమును, చైతన్య గరికిపాటి తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు శశాంక్ తన లవ్లీ స్కోర్‌తో సినిమాటోగ్రాఫర్ ప్రేమ్ సాగర్ క్యాప్చర్ చేసిన విజువల్స్‌ని ఎలివేట్ చేశాడు. ఆగస్ట్ 2న విడుదల కానున్న సినిమాపై ట్రైలర్ అంచనాలను మరింత పెంచేసింది అని చిత్ర యూనిట్ తెలిపింది.



స్నేహ మాల్వియ, పవన్‌కుమార్, సాహిబా భాసిన్

యావరేజ్ స్టూడెంట్ నాని రిలీజ్‌కి రెడీ

"మెరిసే మెరిసే' సినిమాతో దర్శకుడిగా మొదటి సినిమాతోనే తన సత్తా చాటుకున్నారు పవన్ కుమార్ కొత్తూరి. ఇక ఇప్పుడు ఆయన దర్శకుడిగా, హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పవన్ కుమార్ తన రెండో సినిమా 'యావరేజ్ స్టూడెంట్ నాని'తో హీరోగా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై పవన్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్ 2న విడుదల కాబోతోంది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్లోకి రానుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. మోస్ట్ రొమాంటిక్‌గా సాగిన ఈ టీజర్ యూత్ ఆడియెన్స్‌ను ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. 'మనం ఆర్డినరీ అయినా మనం ట్రై చేసే అమ్మాయి ఎక్స్‌ట్రార్డినరీగా ఉండాలి',, 'కాలేజ్‌లో ఉన్నంత వరకే స్టూడెంట్ నాని.. ఆ తరువాత కూకట్ పల్లి నాని' అంటూ సాగే డైలాగ్స్‌తో మోస్ట్ రొమాంటిక్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా సాగింది. ఈ టీజర్‌లో విజువల్స్, ఆర్ఆర్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి.

సోషల్ మెసేజ్ ఇచ్చే ఆసక్తికర థ్రిల్లర్

మహా మూవీస్, ఎమ్ 3 మీడియా పతాకంపై వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజి'. ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు ఆద్యంత్ హర్ష మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



ఆద్యంత్ హర్ష

- మా నేటివ్ ప్లేస్ నెల్లూరు. తిరుపతిలో బయోటెక్నాలజీలో బీటెక్ చేశాను. ఆ తర్వాత ఫారిన్ వెళ్లి బయోటెక్నాలజీలో ఎంఎస్, పీహెచ్ డీ ఇన్ న్యూరో సైన్స్ చేశాను. అక్కడే ఫిల్మ్ మేకింగ్‌లో కోర్స్ చేశాను. ఈ టైమ్‌లోనే నా మూవీస్ కోసం పది కథలు రాసుకున్నాను. 2019లో ఇండియాకు తిరిగి వచ్చాను. దర్శకుడిని కావాలనేది నా కల. అదొక్కటే లక్ష్యంగా పని చేస్తూ వచ్చాను. ఈ క్రమంలో నాకుటుంబ సభ్యులు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు.
- ఇక్కడికి వచ్చి మూడు షార్ట్ ఫిలిమ్స్, 37 నిమిషాల నిడివితో ఓ ఇండిపెండెంట్ ఫిల్మ్ చేశాను. ఆ ఫిల్మ్ నచ్చి ఒకరు రెండు లక్షల రూపాయలకు కొనుక్కున్నారు. అప్పుడు నాలో కాన్ఫిడెన్స్ వచ్చింది. గతేడాది 'విరాజి' కథను ఒక ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌కు చెప్పాను. ఆయన నిర్మాత మహేంద్రనాథ్ దగ్గరికి పంపారు. ఆయనకి కూడా ఈ కథ నచ్చడంతో ట్రాక్ ఎక్కింది. అలాగే వరుణ్ సందేశ్ కూడా కథ విని వెంటనే ఈ మూవీ చేద్దామన్నారు.
- 'విరాజి' అనే టైటిల్‌కు నాకు అనిపించిన మీనింగ్ చీకట్లో ఉన్నవారికి వెలుగులు పంచేవాడు. 'విరాజి' అంటే శివుడు అని కూడా కొందరు చెప్పారు. ఈ సినిమాలో సస్పెన్స్, థ్రిల్లర్ వంటి అంశాలు ఉన్నా...అండర్ కరెంట్‌గా కొన్ని సోషల్ ఎలిమెంట్స్ చూపిస్తున్నాం. ఇప్పుడు సొసైటీలో ఉన్న ఒక కాంటెంపరరీ ఇష్యూని తెరపైకి తీసుకొస్తున్నాం. మీరు 'విరాజి' చూసి బయటకు వచ్చేప్పుడు ఆ పాయింట్స్ మిమ్మల్ని హాంట్ చేస్తూనే ఉంటాయి. ఈ సినిమా ప్రివ్యూ చూసి వరుణ్‌సందేశ్ బాగా ఎమోషనల్ అయ్యారు. ఇది నాకూ నీకు లైఫ్ ఇచ్చే సినిమా అవుతుందని అభినందించారు. సోషల్ మెసేజ్ ఇచ్చే ఆసక్తికర థ్రిల్లర్‌గా ఇది ప్రేక్షకుల్ని కూడా మెప్పిస్తుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815



తెలంగాణ - అడవులు

- ఫారెస్ట్ అనేది లాటిన్ భాషా పదం. ఇది Forus అనే పదం నుండి ఉద్భవించింది. అనగా గ్రామం వెలుపలి ప్రాంతం అని అర్థము.
- సహజ శీతోష్ణస్థితి, నైసర్గిక స్వరూపం, నేలలు, నది ప్రవాహాలకు అనుగుణంగా ఏదో ఒక భౌగోళిక ప్రాంతంలో పెరిగే వృక్ష సంపదనే సహజ ఉద్భిజ సంపద అంటారు.
- 1894లో బ్రిటిష్‌వారు తొలిసారిగా అటవీ విధానాన్ని ప్రకటించారు.
- 1952 - జాతీయ అటవీ విధానం ప్రకారం మొత్తం భూభాగంలో 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలి, పర్వతాలు మరియు పీఠభూములలో 60 శాతము, మైదానాలలో 20 శాతము అడవులు ఉండాలి.
- 1988లో 2వ అటవీ విధానాన్ని ప్రకటించారు. దీని ప్రకారము కొండ ప్రాంతాలలో 66%, మొత్తం విస్తీర్ణంలో 33% అడవులను కలిగి ఉండాలి.
- 1988లో భారత ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టింది.
- 2006 నూతన పర్యావరణ విధానాన్ని ప్రకటించారు.
- సామాజిక అడవులు అనే కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం 5వ పంచవర్ష ప్రణాళికలో ప్రారంభించింది. 6వ పంచవర్ష ప్రణాళికలో అమలు చేసింది. సామాజిక అడవుల పరిశోధన కేంద్రం అలహాబాద్‌లో కలదు.
- 1950 మార్చిలో వనమహోత్సవాన్ని ప్రారంభించారు. మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ప్రకటించారు.
- తెలంగాణ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం - 1,12,077 చ.కి.మీ. తెలంగాణ రాష్ట్ర వైశాల్యం రీత్యా దేశంలో 12వ స్థానం.

తెలంగాణ ఆర్థిక సామాజిక సర్వే 2017-18 ప్రకారం:

- తెలంగాణలో సామాజిక అడవులతో కూడిన అటవీ విస్తీర్ణం 27,291.99 చ.కి.మీ. ఇది రాష్ట్ర భౌగోళ విస్తీర్ణంలో అడవుల శాతం 24.04%, ఇందులో సామాజిక అడవుల విస్తీర్ణం 30%.
- ఇందులో రిజర్వుడు అటవీ విస్తీర్ణం 19,696.23. చ.కి.మీ. (72%), రక్షిత అటవీ ప్రాంతం 6953.47 చ.కి.మీ. (26%), వర్గీకరించబడని అడవులు 642.30చ.కి.మీ. (2%) ఉన్నాయి.
- 2016-17లో స్థిర ధరల వద్ద రాష్ట్ర స్థూల ఆదాయం (జివిఎ)లో అడవులు, కలప పరంగా 0.4% కలిగివున్నాయి.
- 2017-18లో స్థిర ధరల వద్ద రాష్ట్ర స్థూల ఆదాయంలో అడవులు, కలప రంగం 0.3 శాతం వాటా ఉంది.
- 2017-18లో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో ప్రస్తుత ధరలలో (ముందస్తు అంచనాల ప్రకారం) అడవులు, కలప వాటా 2,795 కోట్లు.
- 2017-18లో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో వృద్ధిరేటు ప్రస్తుత ధరలలో (ముందస్తు అంచనాల ప్రకారం) (అటవీ వృద్ధి రేటు): 4.9
- 2017-18లో స్థూల నికర రాష్ట్ర దేశీయోత్పత్తిలో ప్రస్తుత ధరలలో (ముందస్తు అంచనాల ప్రకారం) అడవులు, కలప వాటా 2,769 కోట్లు.

రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణం గల జిల్లాలు

1. జయశంకర్ భూపాలపల్లి (4,505.05 చ.కి.మీ.)
2. భద్రాద్రి-కొత్తగూడెం (4,286.98 చ.కి.మీ)

రాష్ట్రంలో అతి తక్కువ అటవీ విస్తీర్ణం గల జిల్లాలు

1. హైదరాబాద్ (1.43 చ.కి.మీ)
2. కరీంనగర్ (3.47 చ.కి.మీ)

శ్రీకాళహస్తీశ్వర శతకంలో కనిపించేది?

1. స్వరోచి, మనోరమ పాత్రలు గల ప్రసిద్ధ ప్రబంధం
   ఎ. వసు చరిత్ర బి. ఆముక్తమాల్యద
   సి. నల చరిత్రం డి. మను చరిత్ర
2. 'రామ రాజ భూషణుడు' రచించిన లక్షణ గ్రంధం?
   ఎ. వసు చరిత్ర
   బి. హరిశ్చంద్రనలోపాఖ్యానం
   సి. నరసభూపాలీయం
   డి. ఛందోదర్పణం
3. 'రామాభ్యుదయం' ప్రబంధకర్త?
   ఎ. గొబ్బూరినరసరాజు
   బి. అయ్యలరాజు రామభద్రుడు
   సి. మాదయ్యగారి మల్లన
   డి. రామరాజభూషణుడు
4. తెనాలి రామకృష్ణ కవి రచన కానిది?
   ఎ. ప్రభాతీ ప్రద్యుమ్నం
   బి. పాండురంగమహత్మ్యం
   సి. ఘటికాచల మహత్మ్యం
   డి. హరిలీలా విలాసం
5. 'సంగాత్రి శాలీనుల కథ' ఏ ప్రబంధంలో ఉంది?
   ఎ. ప్రభావతీ ప్రద్యుమ్నం
   బి. రాఘవపాండవీయం
   సి. శ్రీకాళహస్తిమహత్మ్యం
   డి. కళాపూర్ణోదయం
6. 'స్తుతిమతిమైన ఆంధ్రకవి' ఎవరు?
   ఎ. పింగళి సూరన బి. నంది తిమ్మన
   సి. ధూర్జటి డి. పెద్దన
7. ఆంధ్రభోజుడు 'శ్రీకృష్ణదేవరాయల' ఆస్థానంలో గల కవి
   ఎ. వెన్నలకంటి సూరన బి. పింగళి సూరన
   సి. అనంతామాత్యుడు డి. కూచిమంచి తిమ్మన
8. పెద్దన కవితా లక్షణం...?
   ఎ. నాటకీయత బి. సూక్తివైచిత్రి
   సి. అల్లిక జగిబిగి డి. రసపోషణ
9. శ్రీకాళహస్తీశ్వర శతకంలో కనిపించేది?
   ఎ. భక్తి వైరాగ్యం బి. ఆత్మనివేదన
   సి. రాజనీంద, లోకరీతి డి. పైవన్నీ
10. "భక్తకన్నప్ప కథ లేదా తిన్ననివృత్తాంతం" ఎందులోనిది
    ఎ. శ్రీకాళహస్తిమహత్మ్యం
    బి. కళాపూర్ణోదయం
    సి. శ్రీకాళ హస్తీశతకం
    డి. పాండురంగమహత్మ్యం
11. శ్లేషకావ్యమునకు ఉదాహరణం...
    ఎ. మనుచరిత్ర
    బి. వసుచరిత్ర
    సి. రాఘవపాండవీయం
    డి. హరిశ్చంద్రనలోపాఖ్యానం
12. "రాజుల మత్తుల్ వారి సేవ నరక ప్రాయంబుల్..." అని వాపోయిన కవి?
    ఎ. ధూర్జటి బి. తెనాలి రామకృష్ణ
    సి. రామరాజభూషనుడు డి. పెద్దన
13. తొలి తెలుగు ద్వర్థి కావ్యం ఏది?
    ఎ. పాండురంగ మహత్మ్యం
    బి. కళాపూర్ణోదయం
    సి. రామాభ్యుదయం
    డి. రాఘవపాండవీయం
14. వసుచరిత్ర కృతిపతి
    ఎ. వెంకటపతి
    బి. శ్రీకృష్ణదేవరాయలు
    సి. అళియరామరయలకు
    డి. ఓబయ నరసరాజుకు
15. 'రాధామాధవ కవి' బిరుదాంకితుడైన చింతలపూడి ఎల్లనార్యుడి రచన/రచనలు
    ఎ. రాధామాధవము
    బి. తారక బ్రహ్మ రాజీయం
    సి. విష్ణుమాయ నాటకం
    డి. పైవన్నీ
16. ఈ క్రింది వానిలో ద్వర్థి కావ్యం?
    ఎ. వైజయంతీ విలాసం
    బి. హరిశ్చంద్రనలోపాఖ్యానం
    సి. సిద్దేశ్వరి చరిత్ర
    డి. రాధామాధవము
17. 'కవి కర్ణ రసాయనము' గ్రంథకర్త?
    ఎ. కందుకూరి రుద్రకవి
    బి. అద్దంకి గంగాధరకవి
    సి. సంకుసాల నృసింహకవి
    డి. చదలవాడ మల్లన
18. 'మను వసు ప్రకాశిక' విమర్శక గ్రంథం రాసిన వారు?
    ఎ. పల్లా దుర్గయ్య
    బి. వేటూరి ప్రభాకర శాస్త్రి
    సి. కాశీపట్ల బ్రహ్మయ్యశాస్త్రి
    డి. నిడదవోలు వెంకటరావు
19. 'ప్రబంధ వాఙ్మయ వికాసము' గ్రంథకర్త?
    ఎ. పల్లా దుర్గయ్య
    బి. కడియాల రాంమోహన్‌రాయ్
    సి. వేటూరి ప్రభాకర శాస్త్రి
    డి. ఆచార్య టి.కోటేశ్వరావు
20. 'సంగీత రహస్యకళానిధి' బిరుదు గల కవి?
    ఎ. నంది తిమ్మన
    బి. రామరాజ భూషనుడు
    సి. తెనాలి రామకృష్ణ కవి
    డి. అన్నమయ్య
21. 'ప్రబంధ లక్షణాలు'....
    ఎ. ఏక నాయకాశ్రయత్వము, వాస్తైక్యం
    బి. అష్టాదశ వర్ణనాత్మకం, శృంగారరస ప్రధానం
    సి. ఆలంకారిక శైలి ప్రబంధానికి జీవం, భాషాంతరీకరణంకారాదు
    డి. పైవన్నీ
22. 'విజయ విలాసం' అనే ప్రబంధాన్ని రాసిన కవి?
    ఎ. నాచన సోమన
    బి. రఘునాథ నాయకుడు
    సి. చేమకూర వెంకటకవి
    డి. విజయ రాఘవుడు
23. "అల్లసాని వాని అల్లిక జిగిబిగి" అనే విమర్శక గ్రంథం రాసింది?
    ఎ. డా.సి.నారాయణరెడ్డి
    బి. శ్రీరంగం శ్రీనివాసరావు
    సి. గురజాడ అప్పారావు
    డి. విశ్వనాథసత్యనారాయణ
24. 'పారిజాతాపహరణం' కృతి కర్త ఎవరు?
    ఎ. నంది తిమ్మన
    బి. భట్టుమూర్తి
    సి. రామరాజభూషనుడు
    డి. పింగళి సూరన
25. "క్షేత్రమహాత్మ్య ప్రబంధం"....?
    ఎ. కళాపూర్ణోదయం
    బి. పాండురంగ మహత్మ్యం
    సి. విజయవిలాసం
    డి. రాఘవ పాండవీయం
26. "కేవలం కల్పనా కథలు కృత్రిమ రత్నములు" అని రామరాజ భూషనుడు ఏ ప్రబంధాన్ని దృష్టినందుకొని తన అభిప్రాయాన్ని తెలిపాడు.
    ఎ. పాండురంగ మహత్మ్యం
    బి. మనుచరిత్ర
    సి. రాజశేఖర చరిత్ర
    డి. కళాపూర్ణోదయం
27. 'పెద్దన వలె కృతి చెప్పిన పెద్దన వలె' అన్నది ఎవరు?
    ఎ. తెనాలి రామకృష్ణుడు
    బి. విశ్వనాథ సత్యనారాయణ
    సి. కవి చౌడప్ప
    డి. వేటూరి ప్రభాకరశాస్త్రి
28. ఆధునిక 'నవల' లక్షణాలున్న ప్రబంధ యుగం నాటి గ్రంథం?
    ఎ. గిరిజాకళ్యాం
    బి. ప్రభావతీ ప్రదుమ్నం
    సి. వసుచరిత్ర
    డి. కళాపూర్ణోదయం
29. 'వసు చరిత్ర'కు మూలం?
    ఎ. స్కందపురాణం
    బి. నన్నయ భారతం
    సి. మారన మార్కండేయపురాణం
    డి. తిక్కన భారతం
30. ప్రబంధాలలో ఏ రసానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది?
    ఎ. శృంగార బి. అద్భుత
    సి. కరుణ డి. హాస్య



నానాపురం నర్సింహులు
9030057994

సమాధానాలు

1. డి	2. సి	3. బి	4. ఏ	5. డి
6. సి	7. బి	8. సి	9. డి	10. ఏ
11. బి	12. ఏ	13. డి	14. సి	15. డి
16. బి	17. సి	18. సి	19. ఏ	20. బి
21. డి	22. సి	23. డి	24. ఏ	25. బి
26. డి	27. సి	28. డి	29. బి	30. ఏ

బడాబాబులకు పన్ను రాయితీలు ఇచ్చి వారి సంపద పెరిగేటట్టు చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. మరోవైపు సామాన్య ప్రజలపై భారీగా వివిధ పన్నుల రూపంలో భారం మోపి నడ్డి విరిచేస్తున్నారు. ఇలా కాక దేశ సంపదను దోచుకుంటున్న 167 అపరకుబేరుల కుటుంబాల సంపదపై రెండు శాతం పన్ను విధిస్తే జాతీయ ఆదాయం 0.5 శాతం పెరిగి దేశంలోని దారిద్రాన్ని కొంతైన తగ్గించవచ్చు. రాను రాను వట్టిపోతున్న ప్రభుత్వ ఖజానాను ప్రభుత్వరంగ పెట్టుబడుల ఉపసంహారణ (ప్రజల ఆస్తులు) ద్వారా నింపుకుంటున్నారు. ఈ దివాళా కోరు ఆర్థిక విధానాల ద్వారా సామాన్య ప్రజల జీవించే హక్కును హరించి వేస్తూ, కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్నారు. వాస్తవ పరిస్థితి ఇదైతే 'దేశం వెలిగిపోతోంది, వికసిత భారత్, అచ్చేదిన్' అంటూ అబద్ధాలను గోది మీడియాలో ఊదర గొడుతున్నారు.

విధ్వంసక అభివృద్ధి - అసమానతల భారతం



షేక్ కరిముల్లా
9705450705

అంబానీల ఇంట పెండ్లి వేడుకలు అట్టహాసంగా, అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఈ పెండ్లిలో జరిగిన సందడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియా వేదికగా పెండ్లి దృశ్యాల రీల్స్ తెగ వైరలై ఊదరగొట్టాయి. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్‌ల నుంచి ప్రముఖ హీరోలు హాజరయ్యారు. రాజకీయ నాయకులు, క్రికెటర్లు, ఇతర సెలబ్రిటీలు కూడా వచ్చారు. పెండ్లి అంగరంగ వైభవంగా జరిగింది. ఎంతో ఖరీదైన విలాస వస్తు బహుకరణలు, వేడుకలు, అందుకు చేసిన ఖర్చు అందరిని ఆశ్చర్యపరిచాయి. ఈ పెండ్లికి రూ.5వేల కోట్లు ఖర్చు పెట్టారన్న వార్తలతో అంతా ముక్కున వేలేసుకున్నారు. దేశం మారిపోతోంది. వెలిగిపోతోంది అంటే ఇదేనేమో! ఇక పెట్టుబడికి పుట్టిన విషపు మీడియా దేనికి ఇవ్వని ప్రాధాన్యతనిస్తూ ఈ పెండ్లి వేడుకల చుట్టూ తిరిగింది. ఈ పెండ్లికి చేసిన ఖర్చుపై దేశమంతటా చర్చ జరుగుతున్నది. ఆర్థిక అసమానతలు ఎంత తీవ్రస్థాయికి చేరుకున్నాయో ఇలాంటి ఘటనలు తెలియజేస్తున్నాయని మేధావుల విశ్లేషణ. 1991 నుంచి దేశంలో అమలౌతున్న ప్రపంచీకరణలో భాగంగా మొత్తం జాతి సంపదను (వనరులు) బడా బాబులకు కట్టబెట్టిన కారణంగా దేశ సంపద కొద్ది మంది చేతుల్లో పోగుబడింది. ధనవంతులు మరింత ధనవంతులు కాగా, పేదల స్థితి రానురానూమరింత దిగజారి పోతూ ఉంది. దేశపాలకులు అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్లనే దేశంలో ఆర్థిక అసమానతలు మరింత పెరిగిపోతున్నాయి. ఆకలి, ఆరోగ్యం, విద్య, వైద్యం, న్యాయం, చట్టంతో సహా అన్నింట్లోనూ అసమానతలు ఎక్కువవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక అసమానతలను పెంచటమే ప్రపంచీకరణ ముఖ్య లక్షణం.

దాదాపు రెండు దశాబ్దాల పాటు బ్రిటీష్ వలస పాలకులు మన వనరులు దోచుకొని ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన తర్వాత 1947లో స్వాతంత్ర్యం వచ్చినా దేశ పునర్మిణం జరగలేదు. దేశ ప్రజలకు ఏం కావాలి? తినేందుకు ఇంత ముద్ద... కట్టుకొనేందుకు కాస్త బట్ట.. ఉండేందుకు ఒక గూడు... కావాలి. తర్వాత ఉచిత విద్య, వైద్యం కావాలి. ఇవేమి ప్రజలకు అందలేదు. ఇప్పటికీ ఇవే ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అంటే సరైన ప్రజా ఆర్థిక విధానాలు అనుసరించటం లేదని తేలిపోయింది. దేశ ప్రజల దుర్భర జీవితాలను అనేక అంతర్జాతీయ నివేదికలు చెబుతునే ఉన్నాయి. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం దేశంలో అత్యంత ధనవంతులైన కొద్ది మంది వద్దే దేశ సంపదలో 90శాతం పోగుపడింది. ఇందులో ఐదు శాతంగా ఉన్న అపర కుబేరుల వద్ద 62 శాతం సంపద ఉంది. ఒక్క శాతంగా ఉన్న ఆదానీ, అంబానీల వద్ద 40.6 శాతం సంపద కేంద్రీకృతమై ఉంది. మిగతా దేశంలోని అశేష ప్రజానికం వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని పై నివేదిక ప్రకటించింది. 2012-2021 మధ్య దేశంలో సృష్టించిన బడిన సంపదలో 40శాతం ఈ సంపన్నులే దోచుకున్నారు. ప్రపంచాన్ని ఆర్థికంగా కుది పేసిన కరోనా మహమ్మారీ కాలంలో కూడా ఈ కుబేరుల లాభాలు తగ్గకపోగా 121 శాతం పెరిగాయి. నిమిషానికి రూ.2.5 కోట్లు, రోజుకు రూ.3.068 కోట్లు ఈ కుబేరుల ఖాతాల్లోకి చేరాయి. కండ్లు బైర్లు కమ్మే ఈ నిజాన్ని నివేదిక బయట పెట్టింది.

మరోవైపు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ సంఖ్యలో పేదలు 228.9 మిలియన్ మంది భారతదేశంలోనే ఉన్నారని, గత నాలుగు సంవత్సరాల్లో దేశంలో నిరుపేదల సంఖ్య 19 కోట్ల నుంచి 35 కోట్లకు చేరిందని చెప్పింది. పై పెచ్చు 2020-21 సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు పన్నుల మినహాయింపు ద్వారా రూ.1,03,285.44 కోట్లు లబ్ది చేకూర్చిందని వివరించింది. దేశంలో 100 మంది కుబేరుల దగ్గర 54.12లక్షల కోట్లు, అపరకుబేరులైన ఆదానీ, అంబానీ లాంటి వారికి 27.52 లక్షల కోట్లు అదనపు లాభం చేకూర్చి మేమున్నది




సంపన్నులకు 'సేవ చేయడానికేనని' చాటుకుంది మోడీ ప్రభుత్వం. బీజేపీకి అత్యంత ఆప్తుడైన అదానీకి కరోనా కాలంలో కూడా 8 రెట్లు ఆదాయం పెరిగి 10.98 లక్షల కోట్లకు అధిపతి అయి దేశంలోనే అత్యంత ధనవంతునిగా అవతరించాడు. పూనావాల, శివనాడర్, బిర్లాలు 2022లో ఇరవై శాతం ఎక్కువ సంపదను పోగేసుకున్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత్ వృద్ధి సాధిస్తుందని ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నదని గోది మీడియా పెద్ద ఎత్తున్న ప్రచారం చేస్తున్నది. కాని వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రపంచ ఆకలి సూచిలో భారత్ స్థానం క్రమంగా క్షీణిస్తుంది. దేశంలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. 67 లక్షల పసిపిల్లలు రోజు మొత్తం పస్తులుండే పరిస్థితి దేశంలో ఉందని కేంద్ర ఆరోగ్య శాఖ జాతీయ కుటుంబ సర్వే (2019-21) తేల్చి చెప్పింది. ఆకలి బాధలో పశ్చిమ ఆఫ్రికా దేశాల తర్వాత స్థానం భారతేనని పేర్కొంది. ముఖ్యంగా బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్‌లో ఈ సంఖ్య ఎక్కువ. ఇక్కడ 24.7 శాతం పిల్లలు పస్తులుంటున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లో 24.6 శాతం, జార్ఖండ్‌లో 21 శాతం, రాజస్థాన్‌లో 19.8 శాతం, అస్సాంలో 19.4శాతం మంది పిల్లలు ఆకలితో అలమ టిస్తున్నారని సర్వే వెల్లడించింది. మొత్తంగా దేశంలో రోజంతా ఏమి తినని పిల్లల సంఖ్య 19.3 శాతంగా ఉంది. దేశంలో పది మంది చిన్నారుల్లో కనీసం ఇద్దరికి రోజు మొత్తం భోజనం లభించని దుస్థితి నెలకొంది. 2016 నుంచి ఈ పరిస్థితిలో మార్పు లేదని ఈ అధ్యయనం పేర్కొంది.

అలాగే సంతోష సూచికలో మన దేశ స్థానం గత పది సంవత్సరాల్లో దిగజారింది తప్ప ప్రజలకు 'అచ్చేదిన్' ఏమిలేవు. మానవ అభివృద్ధి సూచిక-2022లో కూడా 191 దేశాల్లో మనది 132వ స్థానం. శ్రీలంక 73, బంగ్లాదేశ్ 129, భూటాన్ 127వ స్థానాల్లో ఉండి మనకంటే మెరుగ్గా ఉన్నాయి. మోడీ తాను అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని హామీ ఇచ్చారు. కాని గడిచిన పదేళ్లలో నిరుద్యోగిత బాగా పెరిగిపోయింది. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. సెంటర్ ఫర్ ఇండియన్ ఎకానమీ నివేదిక-2022 ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేటు 7.7 శాతంగా ఉంది.గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ నిరుద్యోగిత రేటు 8.04 శాతంగా ఉంది. పనిచేయగలిగే సత్తా ఉన్నా, తగిన ఉపాధి దొరకక పొట్ట కూటి కోసం దేశ యువత అల్లాడి పోతున్నారు. ఈ పదేళ్లలో 23 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 7లక్షల మందికే ఉపాధి దొరికింది. అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏటా ఇస్తానన్న 2 కోట్ల ఉద్యోగాలు ఏమయయ్యో? మోడీ జవాబు చెప్పాలి. ఇలా ఉపాధి కల్పనలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దేశంలో గత 20 ఏళ్లుగా ఉపాధి రహిత అభివృద్ధి జరిగింది. దీని మూలంగా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగం కారణంగా యువత ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు పెరిగాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో పేర్కొంది. 1991 నుంచి మొత్తం ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరణ చేయడంతో దేశ సంపద కొద్ది మంది చేతుల్లో పోగుపడి తీవ్ర ఆదాయ అసమానతలకు దారి తీసింది.

బడాబాబులకు పన్ను రాయితీలు ఇచ్చి వారి సంపద పెరిగేటట్టు చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. మరోవైపు సామాన్య ప్రజలపై భారీగా వివిధ పన్నుల రూపంలో భారం మోపి నడ్డి విరిచేస్తున్నారు. ఇలా కాక దేశ సంపదను దోచుకుంటున్న 167 అపరకుబేరుల కుటుంబాల సంపదపై రెండు శాతం పన్ను విధిస్తే జాతీయ ఆదాయం 0.5 శాతం పెరిగి దేశంలోని దారిద్రాన్ని కొంతైన తగ్గించవచ్చు. రానురాను వట్టిపోతున్న ప్రభుత్వ ఖజానాను ప్రభుత్వరంగ పెట్టుబడుల ఉపసంహారణ (ప్రజల ఆస్తులు) ద్వారా నింపుకుంటున్నారు. ఈ దివాళా కోరు ఆర్థిక విధానాల ద్వారా సామాన్య ప్రజల జీవించే హక్కును హరించి వేస్తూ, కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్నారు. వాస్తవ పరిస్థితి ఇదైతే 'దేశం వెలిగిపోతోంది, వికసిత భారత్, అచ్చేదిన్' అంటూ అబద్ధాలను గోది మీడియాలో ఊదర గొడుతున్నారు. గత పదేళ్లలో పెరిగినంతగా ఆర్థిక అసమానతలు బ్రిటీష్ పాలనలో కూడా పెరగలేదని ప్రపంచ అసమానతల ప్రయోగశాల-2024 ప్రకటించింది. సామాజిక, ఆర్థిక, న్యాయ, విద్య వైద్య రంగాల్లో ఉన్న తీవ్ర అసమానతలను పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా మన సంస్కృతి, విలువలు పూర్తిగా పతనమై పోతున్నాయి. నేటి ప్రభుత్వాలు రాజ్యాంగ లక్ష్యమైన ప్రజా సంక్షేమ బాధ్యత నుంచి పూర్తిగా వైదొలిగి పోయాయి. ఈ మొత్తం సమస్యల పరిష్కారానికి మరో స్వతంత్ర పోరాటం చేసి మనిషిని మనిషి దోచుకోలేని సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను ప్రజలు నిర్మించుకోవాలి.

'సినిమాలు, సీరియల్స్ సమాజానికిచ్చే సందేశమేమిటి!?'



ఐ.ప్రసాదరావు
6305682733

ఇప్పుడున్న సమాజంలో మంచి గురించి పక్కనబెడితే కనీసం నెగిటివ్ థాట్స్, వైఖరులు పెంచకుంటే ఉంటే చాలు. సినిమాలు, సీరియల్స్‌లో టెక్నాలజీ వాడి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతమైన దృశ్యాలు, సంఘటనలు చూపించవచ్చు. నాలుగు మంచి విషయాలు చెప్పడం ద్వారా ప్రేక్షకులపై చెడు ప్రభావాలను అరికట్టవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి ఆలోచనలతో చిత్ర పరిశ్రమ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

మానవ నాగరికత ఆవిర్భావం నుంచి "వినోదం" ఒక భాగం. అలసిన శరీరానికి మానసిక ఆరోగ్యం, ప్రశాంతత చేకూర్చేవి ఆటలు, పాటలు, నాటికలు, పుస్తక పఠనం మొదలైనవి. కాలక్రమేణా ముఖ్యంగా 19వ శతాబ్దం నుండి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో నేడు 21వ శతాబ్దంలో సాఫ్ట్‌వేర్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ముఖ్యంగా వినోద కార్యక్రమాలు అయిన సినిమాలు, టీవీలు, సీరియల్స్, ఓటీటీ వంటివి, సెల్ ఫోన్లు, కంప్యూటర్ వివిధ సామాజిక మాధ్యమాలు వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రాం వంటి పలు సమా చార సౌకర్యాలు ద్వారా మానవుడు జీవితం పలు రకాలుగా పెనవేసుకున్నది. ప్రపంచ నలుమూలల అందరినీ ఒకచోట చేర్చి వేరే లోకాల్లో విహరింపచేస్తుంది. మానవుని జ్ఞానంతో అనేక విషయాలు చేరవేస్తూ మనలను చైతన్యపరుస్తూ ఉండటం మంచి పరిణామమే... కానీ ఇదే పరిజ్ఞానం సమాజంలో పలు కొత్త సమస్యలకు కారణమవుతోంది.

ముఖ్యంగా మానవులు వినోదం కోసం సినిమాలు, సీరియల్స్ చూస్తూ కొంత ఉపశమనం పొందుతారు. కానీ ఇటీవల కాలంలో వస్తున్న సినిమాల్లో ఎక్కువగా హింసా ప్రవృత్తి, నేరాలు పెంచే విధంగా, మితిమీరిన శృంగారం వంటివి మేళవించి రూపొందిస్తూ ముఖ్యంగా యువతను, పిల్లలను ప్రభావం చేసే విధంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కోట్ల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కించిన సినిమాలు ప్రజలకు ఇచ్చే సందేశం ఏమిటి...!? దాదాపు అన్ని సినిమాలు హింస, దోపిడీ, అశ్లీలమే కదా..!? కోట్ల రూపాయల ఖర్చు పెట్టి, మరెన్నో కోట్ల రూపాయలు సంపాదించడమే.. పూర్తిగా వ్యాపార దృక్పథమే తప్పా, తాము నిర్మించిన సినిమాలు, సీరియల్స్ ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయో కనీసం ఇకనైనా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ముక్కుపచ్చలారని వయసులోనే మర్డర్లు, మానభంగాలు చేసే విధంగా పిల్లలను ప్రభావం చేస్తున్నాయంటే ఎంత భయంకరం..!?.పూర్తిగా 15 సంవత్సరాల వయస్సు నిండని వారు కూడా అనేక ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో పలు వార్త పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. బాల నేరస్తుల సంఖ్య పెరగటం ఆందోళన కలిగించే అంశం. జువెనైల్ జైల్లో ఖైదీల సంఖ్య పెరగటం బాధాకరం. సెల్ ఫోన్లు, కంప్యూటర్ అందరికీ అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ గేమ్స్, వివిధ రకాల యాప్స్, సైట్లు లభ్యం కావడం వల్ల అనేక నేరాలు, ఘోరాలు పెరుగుతున్నాయి. నేరప్రవృత్తి, హింసా ప్రవృత్తి, సైబర్ క్రైమ్స్, దోపిడీ విశృంకలత రకరకాల చెడు వ్యసనాలకు మూలం ఈ సినిమాలు, సీరియల్స్ అని చెప్పాల్సిరావడం బాధాకరమైన తప్పని పరిస్థితి. ఇలాంటి చెడు ప్రసారాలపై, సామాజిక మాధ్యమాలపై సమాజం దృష్టి సారించి నియంత్రించే మార్గాలు అన్వేషించాలి.

ఒకప్పుడు వినోద కార్యక్రమాల ద్వారా సంస్కృతి, విలువలు, మానవత్వం, నీతి, సందేశాలు అందేవి. సమాజం విలువలతో నిర్మించబడేది. నేడు స్వార్థం, దోపిడీ విచ్చలవిడితనంగా మారుతున్నది. కనీసం తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల యెడల సరైన ప్రవర్తన, బాధ్యత కరువవుతోంది. భవిష్యత్తులో ఎక్కడ చూసినా



వృద్ధాప్య ఆశ్రమాలే కనిపిస్తాయంటే ఆశ్చర్యపోవాల్సిందే! ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. కొంత సమయం వారితో గడపాలి. కష్టసుఖాలు, మంచిచెడ్డలు, గురించి చెప్పాలి. ఎప్పుడూ మార్కులు, ర్యాంకుల కోసమే మాట్లాడద్దు. నీతి కథలు, నైతిక విలువలు నూరిపోయాలి. సినిమాలు సీరియల్స్, సెల్ ఫోన్లపై నిఘా ఉంచాలి. దర్శకులు, నిర్మాతలు కూడా మానవునిలో మంచి స్వభావం పెంచే విధంగా సినిమాలు, సీరియళ్లను చిత్రీకరించాలి. ఇప్పుడు కూడా పాత సినిమాలు, పాత సినిమా పాటలే అనేక మంది చూస్తూ, వింటూ మానసిక ప్రశాంతత పొందుతున్నారు.. వాస్తవమే కదా! మరి నేడు ఎన్నో కోట్ల రూపాయల ఖర్చు పెట్టి తీసిన సినిమా అయినా, కేవలం ఒక నెల రోజుల్లో కనుమరుగవుతుంది. అంటే దానికి చర్చ కూడా ఉండదు. దీనికి కారణం సరైన సందేశం లేకపోవడమే. ఇప్పుడున్న సమాజంలో మంచి గురించి పక్కనబెడితే కనీసం నెగిటివ్ థాట్స్, వైఖరులు పెంచకుంటే ఉంటే చాలు. సినిమాలు, సీరియల్స్‌లో టెక్నాలజీ వాడి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతమైన దృశ్యాలు, సంఘటనలు చూపించవచ్చు. నాలుగు మంచి విషయాలు చెప్పడం ద్వారా ప్రేక్షకులపై చెడు ప్రభావాలను అరికట్టవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి ఆలోచనలతో చిత్ర పరిశ్రమ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.